 

# నివాళులు

63వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

సంగీత మాసపత్రిక

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

సంపుటి - 63 జనవరి-ఏప్రిల్ 2025 సంచిక - 8-11













డమ్మీ ప్రచురణ

63వ సంవత్సరపు ప్రచురణ

# గానకళ

అంతర్జాతీయ సంగీత మాసపత్రిక

వ్యవస్థాపకులు **కీ॥శే॥ మునుగంటి శ్రీరామమూర్తి**

గౌరవ సంపాదకులు **డా॥ శ్రీమాన్ కొమాండూరి శేషాద్రి**

సంపాదకుడు **మునుగంటి వెంకట్రావు**

30-1-29, రంగయ్యనాయుడువీధి, కాకినాడ - 533001, సెల్ : 9441488721

సహాయ సంపాదకులు

**శ్రీ వాసా గోపీనాధరావు**
విశ్రాంత ప్రిన్సిపాల్, సంగీత నృత్యకళాశాల, హైదరాబాద్

**శ్రీ కె.వి. బ్రహ్మానందం**
విశ్రాంతాచార్యులు, ప్రభుత్వ సంగీత నృత్యకళాశాల, విజయవాడ

**శ్రీ మండలీక సీతారాఘవరావు**, చెన్నై

**శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి**, కాకినాడ

సంపుటి - 63 | జనవరి-ఏప్రిల్ 2025 | సంచిక - 8-11

## గమనిక :

1962 జూన్ నెల నుండి ప్రారంభమై అవిచ్ఛిన్నంగా వెలువడుతున్న గానకళ 2024 సంవత్సరం డిశంబరు సంచిక తరువాత వెలువడ లేదు.

దీనికి కారణం కేంద్రప్రభుత్వ నిర్దేశంలో పనిచేస్తున్న RNI సంస్థ అమలు పరుస్తున్న విధి విధానాల ఆటంకమే కారణం.

చాల నిర్దుష్టంగా, పటిష్టంగా అమలుచేస్తున్న నియమనిబంధనలు 'కళలు-సంస్కృతి' అంశాలుగా వెలువడుతున్న పత్రికలకు కూడా ప్రతిబంధకమై నిలిచాయి.

పత్రిక స్థాపించిన శ్రీ మునుగంటి వారి కుమారులమైన మేము కూడా కొనసాగించడానికి అనేక అడ్డంకులు ఎదురయినాయి. వాటిని ఇంకా అధిగమించవలసివుంది. ఈ ప్రయత్నంలో మూడు నెలలు గడిచిపోయాయి. ఇక వేచివుండలేక "డమ్మీ" పేరున వెలువరిస్తున్నాము.

## ఈ సంచికలో....

పేజిలలో

1. త్యాగరాయకృతులలోని అంతర్నిదర్శనాలు - ప్రొ.డి. సాంబమూర్తిగారు.....3
2. గతానికి స్వాగతం...
త్యాగయ్య- వాగ్గేయకారత్వం. - శ్రీ మల్లాది సూరిబాబు.....6
3. సుధాతరంగం...బాల గంధర్వుడు - శ్రీ మోదుమూడి సుధాకర్.....10
4. ఉనికి ఎరుకే ఉత్తమ గతి - శ్రీ మల్లాది సూరిబాబు.....12
5. మునుగంటి శతజయంతి-కాకినాడ .....17
6. 'సంకీర్తనోద్యాన విహారి'
- శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్ - శ్రీ కలగ కృష్ణమోహన్.....23
7. మనోగతం - శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు.. 26
8. సంగీతసభల కార్యకలాపములు - విహారి.....28

## ముఖచిత్రం

1. విజయ త్యాగరాజు సంగీత సభలో "సంగీత సుధానిది" బిరుదు పొందిన మృదంగ విద్వాంసులు శ్రీ పత్రి సతీష్ కుమార్.
2. 12-4-2025 న తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం మరియు అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, తిరుపతి ఆధ్వర్యంలో స్వర్గీయ బాలకృష్ణ ప్రసాద్ సమస్మరణోత్సవంలో వారిపై గ్రంథాన్నిఆవిష్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు.
3. ఎం.ఎస్.ఎన్. మదర్ సంగీత ఝరి - బెంగుళూరు సంస్థలో సన్మానింపబడిన సీనియర్ సంగీత విదుషి శ్రీమతి ముట్నూరి జలజాక్షి.
4. కాకినాడలో సంగీత సభాపతి కీ.శే. మునుగంటి శ్రీరామమూర్తి శతజయంతి ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలనంతో ప్రారంభిస్తున్న శ్రీనారాయణం మురళి-శ్రీమతి హిమబిందు దంపతులు - శ్రీ ఈ.వి. కృష్ణమాచార్యులు — కుటుంబ సభ్యులు (4-4-2025)
5. స్వర్గీయ అమ్ముల విశ్వనాథం భాగవతార్ 109వ జయంతి ఉత్సవంలో వారి స్మారక పురస్కారం స్వీకరించిన శ్రీమతి జయంతి సావిత్రి భాగవతారిణి. చిత్రంలో అమ్ముల వారి కుటుంబసభ్యులు.
6. ఏప్రియల్ 5వ తేదీ కాకినాడ సూర్యకళామందిరంలో కీ.శే. మునుగంటి శ్రీరామమూర్తి శతజయంతి వేడుకలలో "నేను-మా మునుగంటి" కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రసంగిస్తున్న శ్రీ కె.ఎస్.ఎస్. ఆంజనేయమూర్తి (సరస్వతీ గానసభ-అధ్యక్షులు. చిత్రంలో శ్రీ ఎం.ఎస్. శ్రీనివాస్ ముఖ్య అతిథి — (విశాఖ మ్యూజిక్ అకాడమి, విశాఖ) కలరు.

Email : ganakalamagazine@yahoo.co.in కు కళాకారులు, సంస్థలు వార్తలు, ఫోటోలు పంపవచ్చు.

ganakala.in వెబ్ పేజీలో గానకళ పూర్వ సంచికలు, కొత్త సంచికలు చూడవచ్చు.

# త్యాగరాయకృతులలోని అంతర్నిదర్శనాలు

## (1767-1847)

**ప్రొఫెసర్ డి. సాంబమూర్తిగారు** బి. ఏ. బి. యల్.(మద్రాసు విశ్వవిద్యాలయ సంగీత శాఖాధ్యక్షులు)

త్యాగరాజుకృతులు కవితాభావనకు, ప్రస్ఫుట భావములకు, సునిశితాశయ ప్రసిద్ధి. పైగా ముఖ్యములైన అంతర్గత ప్రమాణాలను మనకంద జేయు చున్నవి. అతని జీవనములోని నిత్యకృత్యాలు, ఆతని బ్రతుకు తెరువు కోసము ప్రయత్నము, అసూయగల అతని సమకాలికుల అన్యాయపు అపవాదులకు ఆతనిలో కలిగిన ఉద్రేకము, మతము, వేదాంతమునకు సంబంధించిన వివాదాంశముల గురించి అతని అభిప్రాయములు, విశుద్ధ గానమును గురించి అతని ఉద్దేశము, ఇంకా యెన్నో విషయములను గురించి ఆతనిపాటలవల్ల బోధపడుతుంది. పైవిషయాలిని రుజువుపరచే కొన్ని కీర్తనలను గురించి యీవ్యాసము విశదీకరిస్తుంది.

1.త్యాగరాజు ప్రజాసేవచేస్తూ నిరాడంబరంగా, భక్తిగా, జీవనం గడిపాడు, తనపూర్వుల యింటిలో ఒక భాగము, కొంచెముగా భూవసతి తప్ప, త్యాగరాజుకి వేరే ఆస్తిలేదు. తన కుటుంబాన్ని, ఎందరో శిష్యులనీ, ఉంఛవృత్తి వల్ల పోషించేవాడు, శిష్యులకుతోడుగా, సంగీత ప్రబోధముకోసమూ, ఆధ్యాత్మిక సంతృప్తికోసమూ ఎందరో భాగవతులు, పండితులు, గాయకులు, వచ్చి ఆతని ఆతిధ్యం పొందుతూ ఉండేవారు. అతడు వారానికొక్కసారే ఉంఛవృత్తికై వెళ్ళేవాడు. అప్పుడు దొరికిన దానితో తనకుటుంబాన్ని, శిష్యులనీ, వస్తూవెళ్ళుతూ ఉండే అతిధులనీ పోషించగలిగేవాడు. తిరువయ్యారు సమీపాన్నుండే గ్రామాల్లో ఉంఛవృత్తిభజనలు చేయుమని అతనిని ఆహ్వానించేవారు, ఉంఛవృత్తి జీవనము బొత్తిగా నిరాడంబరమైనది, మిక్కిలి కష్టమైనదని, 'మాళవశ్రీ' రాగంలో నున్న "ఎన్నాళ్ళు తిరిగేది, ఎన్నాళ్లు ?" అనే కీర్తన చరణంలో.

“ఉప్పు కర్పూరమువఱకు ఉంఛవృత్తిచే నార్జించి” – అని వ్రాసుకొన్నాడు,

2. ఈశ్వర కృపవల్ల తనకు లభించిన 'స్వరార్ణవ'మను గ్రంథరాజాన్ని త్యాగరాజు అవగాహన చేసుకొన్నట్లు, శంకరాభరణం రాగంలో నున్న “స్వర రాగసుధారస” అన్న కీర్తన ఆఖరి చరణాన్నిబట్టి తెలుస్తుంది.

**"రజతగిరీశుడు నగజకు దెల్పు**
**స్వరార్ణవ మర్మములు,**
**విజయముగల త్యాగరాజు కెరుకే,**
**విశ్వసించి తెలుసుకో ఓ మనసా !"**

దొరకినంతవరకు ఈగ్రంధ భాగంలో,

త్యాగరాయ కీర్తనల ద్వారా మొదట మనము తెలుసుకొన్న రాగాల లక్షణాలు చెప్పబడి ఉన్నాయి. అదిగాక సుప్రసిద్ధమైన యీక్రింది శ్లోకముకూడా ఈ గ్రంథంలో ఉంది.

**"ఆత్మమధ్య గతప్రాణః, ప్రాణమధ్య గతోధ్వనిః ధ్వని మధ్య గతో నాదః, నాదమధ్యే సదాశివః."**

3. శంకరాభరణ రాగంలోనున్న "ఎందుకు పెద్దలవలె" అన్నకృతిలోని చరణాన్ని బట్టి వివిధవిద్యాశాఖల్లో అతనికున్న ప్రావీణ్యము సువ్యక్తమగును.

**"వేదశాస్త్ర తత్వార్థములు తెలిసి,**
**భేదరహిత వేదాంతములు తెలిసి,**
**నాదవిద్యా మర్మంబులను దెలిసి,**
**నాథా ! త్యాగరాజనుత నిజముగ"**

4. తాను నేర్చినది సరియైన సంగీతమనీ, అట్టి సంగీతము పరిపూర్ణానందస్థితిని పొందుటకు సహాయపడుననీ, అనేక కృతులందు నొక్కి వక్కాణించినాడు. ముఖారికృతిలో ఇలాగన్నాడు.

**"త్యాగరాజు నేర్చిన**
**సంగీత శాస్త్రజ్ఞానము**
**సారూప్య సౌఖ్యదమే మనసా !"**

5. తన రచనలు నిర్దుష్టములైనవనీ, అవి ఆధ్యాత్మిక శక్తివల్ల పుట్టినవనీ, బాహ్య ప్రపంచకానికి వాటిని వ్యక్త పరచడానికి తానొక ఉపకరణమాత్రుడనీ, త్యాగరాజెరుగడు. తోడి రాగంలో ఉన్న 'దాశరథే ! నీ ఋణము తీర్ప నా తరమా?" అన్నకృతిలోని చరణంలో "భుక్తి ముక్తి గల్గునని కీర్తనములు "బోధించిన" అనియున్నది. "బోధించిన" అన్న మాటను బట్టి ఆపాటలు త్యాగరాజు చెవిలో చెప్పబడినవన్న సత్యము వెల్లడి అవుతూంది.

6. ముఖారి రాగంలో ఉన్న "చింతిస్తున్నాడే యముడు" అన్నకృతిలో త్యాగరాజ ఈ క్రింది విధంగా వ్రాశాడు.

**"సారమని త్యాగరాజు సంకీర్తనము పాడే రనుచు చింతిస్తున్నాడే యముడు. "**

7. గొప్ప రచయితగా త్యాగరాజు పేరుప్రతిష్ఠలు అతని జీవిత కాలంలోనే బాగుగా వ్యాపించాయి. ఆసంగతి త్యాగరాజునకు తెలుసును. ఆవిషయము రెండు కృతులలో వ్రాసుకొన్నాడు,

1. 'దాశరథే' అన్న తోడికీర్తనలో

**"ఆశదీర దూరదేశమునను ప్రకాశింపజేసిన రసిక శిరోమణి."**

2. శహన రాగంలో ఉన్న 'ఈవసుధ నీవంటిదైవము ' అన్నకృతిలో.

**"భువనమందు కీర్తి కల్గజేసే"**

ఆరెండు కృతులలోను "ఓదేవా! నాకీర్తి దూర ప్రదేశాల దాకా ఎవరు వ్యాప్తి చేశారు ?" అని త్యాగ రాజన్న విషయం గమనింప తగ్గది.

8. తనకు ముందెందరో రామాయణకథను కీర్తనలుగా రచించినప్పటికీ, ఆకథనే తాను కూడా కీర్తనలుగా ఎందుకురచించాడో అన్నదానికి కారణం, ఏపనికో జన్మించితినని" అన్న అసావేరి కృతిలో చెప్పాడు.

**"వాల్మీకాదిమునులు నరులు వర్ణించిన నా ఆశ తీరునా ?"**

9. శతరాగ రత్నమాలిక అనే మహత్తర కీర్తన కావ్యమును తాను పూర్తిచేసిన సంగతి ఈ క్రింది రెండు కృతులవల్లా రుజువు అవుతుంది.

1. రీతిగౌళ రాగంలో ఉన్న "రాగరత్నమాలిక" అన్న కీర్తనలో **"త్యాగరాజు కడతేరే తారకమని చేసిన శతరాగ రత్నమాలికచే రంజిల్లు నటహరి"**

2. ముఖారి రాగంలో ఉన్న "ఏలా అవతారమెత్తికొంటివో ? అన్న కీర్తనలో

**"శతరాగ రత్నమాలికను రచించిన త్యాగరాజునకు వరమొసగుటకా ? ఏలా అవతారమెత్తు కొంటివో ?'**

10. తానీ ప్రపంచకంలో ఒక నిర్దిష్ట కార్యాన్ని నిర్వహించడానికి జన్మించాననీ, దానిని తన శక్తివంచన లేకుండా సాధించగలిగాననీ, అన్న విషయాలు అతనికి పూర్తిగా తెలుసును. ఈ సంగతి గానవారధి రాగంలో ఉన్న **"దయ చూచుట కిదివేళరా !"** అన్న కృతిలోనున్న ఒక చరణము రుజువుచేస్తుంది. **"మును నీవానతిచ్చిన పనులా సగౌని నే మనసారగ నిదానముగ సల్పినాను."**

11. బిళహరి రాగంలో నున్న **"దొరకునా యిటువంటి సేవ ?"** అన్న కీర్తనలో త్యాగరాజు తనతండ్రి పేరు చెప్పాడు.

**"రామబ్రహ్మ తనయుడౌ త్యాగరాజు తా బాడుచు."**

అతని సంగీత నాటకమైన 'నౌకాచరిత్ర' ఆరంభంలోనున్న 5వ కంద పద్యంలో అతడు తనవంశం పేరుకూడా చెప్పాడు.

**"కాకర్లాంబుధ చంద్రుడు**
**శ్రీకరుడగు త్యాగరాజ చిత్తనివేశా !"**

12. తన రెండు సంగీత నాటకాలకూ చివరను వ్రాసిన ఫలశ్రుతులనుబట్టి, తన రెండు కావ్యముల ప్రశస్తిని గురించి అతనికి బాగా తెలుసుననీ, విశ్వాస ముందనీ రుజువవుతూంది.

**శ్రీరామబ్రహ్మ తనయ త్యాగరాజేన నిర్మితం**
**ప్రహ్లాద భక్త విజయ ప్రబంధ భుక్తిముక్తిదాం**
**యే గాయంతి సదా భక్త్యాయే సృణ్వంతిచా శ్రద్ధియం.**
**యేపఠంతి సదా ప్రత్యా తేషాం సర్వాఘ నాశనాం.**
**"ప్రహ్లాద భక్త విజయమ్"**

**త్యాగరాజ కృతాం పుణ్యాం కథాం సాధుమనోహరం**

**ఏశృణ్వంతి నరా లోకేతేషాం కృష్ణః ప్రశీదతీ !**

★ ★ ★

**(1947 నాటి 'అనసూయ మాసపత్రిక నుండి ఈ అపురూపమైన వ్యాసం తీసుకోవడమైనది. సం॥)**

గతానికి స్వాగతం

# త్యాగయ్య - వాగ్గేయకారత్వం



- మల్లాది సూరిబాబు
ఫోన్ : 9182718656

మీకు సంగీతంపై ఆసక్తి కలగడానికి కారణం ఎవరు? అని ఒక ఇంటర్వ్యూలో ప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసుడైన డా. మంగళం పల్లి బాలమురళీకృష్ణను అడిగితే, ఆయన చెప్పిన సమాధానం...

నేనేమీ ప్రయత్నించలేదు. సంగీతమే నన్ను వరించిందన్నారు. అభిజాత్యంతోనో అతిశయోక్తిగానో చెప్పినట్లుగా తోచినా యిందులో నిజం లేకపోలేదు. కారణజన్ములు అలాగే జన్మిస్తారనడానికి సాక్ష్యం యిలాంటి విద్వాంసులే. గాత్రంతో బాటు వయోలా, మృదంగం వాద్యాలన్నీ అలవోకగా వాయించగల సమర్థుడైన విద్వాంసుడు బాలమురళీకృష్ణ. అన్నీ అప్రయత్నంగా సిద్ధించిన విద్యలే.

కొన్ని సంగీత వాద్యాలు చూడగానే ఆ వాద్యాలలో ప్రసిద్ధులైన మహా విద్వాంసులు గుర్తుకొస్తారు. ఆ వాద్యాలకోసమే జన్మించారేమో అన్నంత కీర్తని సంపాదించుకుని లబ్ధప్రతిష్టులైన వారెందరో!

వీణ పేరు చెప్పగానే వెనకటితరంలో సిద్ధ విద్యాధరిగా పేరున్న వీణధనమ్మాళ్.

వీణే యింటిపేరుగా 'మారి' ప్రసిద్ధులైన 'సంగమేశ్వర శాస్త్రి, ఈమని శంకరశాస్త్రి చిట్టిబాబు, బాలచందర్, దొరై స్వామి, అయ్యంగార్ యిలా ఎందరెందరో ఉన్నారు.

వయోలిన్ కు ద్వారం వెంకటస్వామి నాయుడు, ఎం.ఎస్. గోపాలకృష్ణన్, లాల్గుడి జయరామన్ వేణువుకు మాలిగా కీర్తినందుకున్న టి.ఆర్. మహాలింగం, అంతకు ముందు తరంలో శరభశాస్త్రి, పల్లడం సంజీవరావు మొదలగువారు. మృదంగం పేరు చెప్పగానే మనసులో మెదిలే విద్వాంసులకే విద్వాంసులైన ఫళని సుబ్రహ్మణ్యపిళ్ళై, ఫాల్ఘాట్ మణిఅయ్యర్ వంటి మహా విద్వాంసులెందరో! ఆ విద్యలతో వారికి గల అవినాభావ సంబంధం, మాటల కందనిది. వారి వల్ల ఆ వాద్యాలు పునీతమయ్యాయి. వారు చరితార్థులయ్యారు.

నాదస్వర వాద్యానికి హిమాలయ శిఖరమంత కీర్తిని తెచ్చిన విద్వాంసుడు టి.ఎన్. రాజ రత్నం పిళ్ళై. గుమ్మానికి తోరణం కట్టగానే వినబడే మంగళవాద్యం నాదస్వరం. ఒకప్పుడు మన యిళ్ళలో జరిగే శుభకార్యాల్లో ముఖ్యంగా పండుగలూ, పర్వదినాల్లోనూ, వివాహాది శుభకార్యాలలోనూ విధిగా కనబడేది, వినబడేది నాదస్వరమే! మంత్రానికీ ప్రణవనాదానికీ సంబంధముంది వివాహాది వేడుకలలో సంకల్పం మొదలు అప్పగింతల వరకూ మంత్రోచ్చారణలతో ముంచెత్తే పురోహితులకు ఎదురుగా కూర్చునే నాదస్వర మేళానికి 'మంగళవాద్యాల'ని పేరుంది. ఒక వైపు మామిడి తోరణాలతో మరోవైపు మంగళవాద్యాలతో నిండిన పెళ్లి పందిరి శోభ చూడవలసినదే.

ఎంత కనుల పండువగా ఉండేదో? అపురూపమైన మన సంప్రదాయ విలువలు, క్రమంగా అడుగంటిపోయాయి.

వివాహం ఒక తంతులా మారింది. ఇద్దరూ ఒకటవ్వడానికి లక్షలు ఖర్చుపెట్టాలా? గుడి సరిపోదా? అనే వితండవాదులతో పెళ్ళికి అర్థమే మరుగున పడింది.

తమిళనాడులో ఊరూరా సంగీత సభలే. ప్రతి శుభకార్యానికీ ఉన్నవారైనా లేనివారైనా వారి యిళ్ళల్లో సన్నాయి మేళాలు, పాట కచేరీలూ జరుగుతూంటాయి.

దేవాలయాలలో స్వామివారికి జరిగే కల్యాణోత్సవాల్లో, నిత్యపూజోత్సవాల్లో నాదస్వరం వినబడుతూనే ఉంటుంది. అక్కడి వారి సంగీతాసక్తికి నిదర్శనమది.

రంగు పూసలను భద్రపరచి ఆణిముత్యాలను వదులుకుంటే దోషం ఎవరిది? సరదాగా ఏదో కాలక్షేపం కోసం సినిమాలు, సినిమా సంగీతానికి అలవాటుపడ్డ వారికి దివ్యమైన సంగీతంలోని రుచి ఎలా తెలుస్తుంది?

కేవలం కర్ణాటక సంగీత మాధుర్యంకోసం తపన పడే వారికే ఎరుక. ప్రతి ఏడాది మద్రాసు మహానగరంలో మార్గశిర మాసంలో వందలాది సంగీత కచేరీలు జరుగుతూంటాయి. తిండీ తిప్పలూ మాని సంగీతం వింటారు. సంగీత శ్రవణంలో యింత విపరీతమైన ఆసక్తి దాక్షిణాత్యులకు ఏర్పడటానికి కారణం అక్కడి విద్వాంసులే. మంచి సంగీతం తపస్సుగా సాధన చేస్తారు. అదే పదిమందికీ వినిపిస్తారు. సంగీతాసక్తిని విపరీతంగా పెంచి పోషించినది వారే.

పైగా మన త్యాగరాజు వెళ్ళి తంజావూర్ లో స్థిరపడ్డాడు. ఆయన శిష్యులందరూ ఎక్కువగా తమిళులే. లోకానికి సంగీతంలో రుచిని కలిగించినది, విద్వాంసులుగా తయారుచేసిన ఘనత కూడా త్యాగయ్యగారి శిష్య ప్రశిష్యగణమే. అలాటి వీరిలో నాదస్వర చక్రవర్తిగా ఓ వెలుగు వెలిగినవారు టి.ఎన్. రాజరత్నం పిళ్ళై.

జీవితంలో తాను పొందవలసిన భోగాలన్నీ హాయిగా అనుభవించాడు. కావలసినంత కీర్తిని సంపాదించాడు. ఒక మాటలో ఆ వాద్యం కోసమే పుట్టిన కారణ జన్ముడు. సంగీతరంగంలో 'మేధావులైన మహా విద్వాంసులెవరు? అని అడిగితే తడుముకోకుండా చెప్పగలిగేది ముగ్గురినే! వారిలో ఒకరు టి.ఆర్. మహాలింగం, మరొకరు ఫాల్ఘాట్ మణి అయ్యర్, యింకొకరు టి.ఎన్. రాజరత్నం పిళ్ళై.. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు సెమ్మంగుడి శ్రీనివాసయ్యర్ ఓ సభలో చెప్పిన మాటయిది.

రాజరత్నం నాదస్వరానికి ఎందుకంత క్రేజ్? ఆపేరే ఎందుకు ఆ రోజులలో ప్రసిద్ధమయ్యింది? నాదస్వరం వాయించే ప్రతి విద్వాంసుడూ తెలిసికోవాలి.

1898 ఆగష్టు 28న తంజావూర్ జిల్లాలోని ఒక చిన్నగ్రామం తిరు మరుగల్ లో పుట్టాడు, రాజరత్నం. ఐదో ఏటనే తండ్రి గతించడంతో మేనమామ, ప్రముఖ నాదస్వర విద్వాంసుడైన తిరుమరుగల్ నటేశన్ దగ్గర పెరిగాడు... మేనమామ దగ్గర గాత్రంతో బాటు బాల్యం నుండి నాదస్వర వాద్యం నేర్చుకోవడం మొదలు పెట్టాడు...

ఆ రోజుల్లో ప్రఖ్యాత వయొలిన్ విద్వాంసుడైన తిరుక్కోడికావల్ కృష్ణయ్యర్ దగ్గర చేరి దీక్షగా సంగీతాభ్యాసం కొనసాగించాడు. వివాహ వేడుకలలోనూ శుభకార్యాలలోనూ వినబడుతూ నాదస్వర మేళాన్ని మంగళవాద్యంగానే పరిగణించే ఆ రోజుల్లో, ఆ వాద్యానికి కచేరీ స్థాయి తెచ్చి, గౌరవ ప్రపత్తులు కలిగించిన విద్వాంసుడు రాజరత్నం పిళ్ళై. గాత్రం నేర్చుకునే వారికి ఆదర్శప్రాయమైన వాద్యాలలో ఒకటి వీణ. రెండోది నాదస్వరం – రెండూ గాత్రధర్మం కలిగినవే. గమక సౌందర్యం వాద్యాలలో ప్రస్ఫుటంగా గాత్రధర్మం కలిగి, వినిపిస్తాయి. రాగాలాపనకు కావలసిన మనోధర్మమంతా ఈ వాద్యాల్లోనే కనిపిస్తుంది. అందుకే వీణ వాయించేవారు, పాడుతూ వాయిస్తారు. నాదస్వరంతో బాటు గాత్రం కూడా సాధన చేసిన విద్వాంసుడు రాజరత్నం. ఆకాశవాణిలో యిప్పటికీ రాజరత్నం పాడిన సంగీత కచేరీల రికార్డింగ్లున్నాయి.

అసాధారణమైన మనోధర్మంతో కూడిన రాగాలాపన తో రాజరత్నానికి సాటి మరొకరు లేరు. ఆ రోజుల్లోనే రాజరత్నం పిళ్ళై రాగాలు మాత్రమే గ్రామఫోన్ రికార్డులుగా విడుదలవడమే యిందుకు సాక్ష్యం.

సంగీతాన్ని అభ్యసించే విద్యార్థులకూ పాడే విద్వాంసులకు రాగాలాపనే ఒక పెద్ద సవాల్. ఎందుకంటారా?

రాగాలాపన ముందుగా సిద్ధంచేసుకుని పట్టేది కాదు. ఆశు కవిత్వంలా వేదికపై అప్పటికప్పుడు సృష్టించబడేదే రాగం. కడివెడు పాలను మరగిస్తే లభించే వెన్నలా, ఎన్నో కీర్తనలు నేర్చుకోగా ఉపాసనతో పాడగా పాడగా దొరికేది రాగ జ్ఞానం.

కర్ణాటక సంగీతం కంటే హిందూస్థానీ సంగీత విద్వాంసులు ఎక్కువగా రాగానందంపైనే దృష్టిపెట్టి సాధన చేస్తారు.

ఏ సంప్రదాయంలోనైనా రాగమే జీవం. రాగాన్ని సర్వ గమకాది భూషణములతో అలంకరించి మనోహరంగా చిత్రించడమే విద్వాంసుల లక్ష్యం.

రాగం వల్ల కీర్తనలూ, కీర్తనలవల్ల రాగం పరస్పరం అభివృద్ధి చెందుతూ శ్రోతలకు ఆనందాన్ని కలిగిస్తాయి.

వాగ్గేయకారుల రచనలన్నీ మనోజ్ఞమైన రాగాలలో రచించబడి విస్తృతంగా గానం చేయబడ్డాయి. స్వరాన్ని అలంకరించే సంకారం వల్ల రాగ స్వరూపం ఏర్పడుతుంది. ఎవరెవరికి ఎంత ప్రాప్తమో ఎవరికెరుక? సంగీతం ఒక గంగ. ఎవరిని పునీతం చేస్తుందో? రాగస్వరూపాన్ని అందంగా చిత్రీకరించి పాడాలన్నా వాయించాలన్నా ఎంతో సాధన కావాలి. కొందరి గతజన్మల సంస్కారం కూడా కారణం కావచ్చు.

కారణజన్ములైన అటువంటి వారిలో ఈ రాజతర్నం పిళ్ళై. గుళ్ళూ గోపురాలు కాదు. ఏకంగా మహారాజుల ముందు రాజ దర్బారులలోనూ, రాజాస్థానాల్లోనూ దర్జాగా, ఠీవిగా తిరుగుతూ, తన సంగీతాన్ని విధిగా వినేలా చేసిన నాదస్వర చక్రవర్తి ఆరోజుల్లో ప్రసిద్ధులైన అమ్మా సత్రం కన్నుస్వామి పిళ్ళై వద్ద రెండేళ్ళు దీక్షగా సాధన సాగింది. తిరువడుతురై స్థానంలో ఆస్థాన నాదస్వర విద్వాంసుడై, స్థానిక వినాయక స్వామి ఆలయంలో ప్రభాతవేళ నాదస్వరం వాద్యం వినేందుకు ఎందరో భక్తులతో బాటు, సంగీత రసికులూ కూర్చుని వినేవారట.

దర్బారు, శుభ పంతువరాళి, సావేరి వరాళి, కాంభోజి, కల్యాణి, కేదారం వంటి రక్తైన రాగాలలోనూ సొగసులను మనోజ్ఞంగా వినిపించటంతో, రాజరత్నం పేరు నలుమూలలా ప్రాకింది.

మహా విద్వాంసులు సైతం విస్తుబోయి వినేలా నాదస్వరంలో వైవిధ్యభరితమైన రాగ సంచారాలు మరులు గొలిపేవి. సంగీత రసికులెందరో ఆ మహా విద్వాంసులు ఎన్ని గంటలు వాయించినా అన్న హారాలు మాని విన్న సందర్భాలు అనేకం.

ఆయనదో ప్రపంచం ఏ విద్వాంసునికీ అలవికాని, అసాధ్యమైన రాగప్రయోగాలు అలవోకగా గంగా ప్రవాహంలా దూసుకొచ్చేవి. రాగాలాపనతో వినిపించిన సంగతి తిరిగి కనబడేదికాదు. అసాధ్యమైన మనో ధర్మంతో సాగే రాజరత్నం పిళ్ళై రాగాలాపనకు అప్పుడూ యిప్పుడూ సంగీత విద్వల్లోకం జోహార్లు అర్పిస్తూనే ఉంది. సంపాదన కోసం సంగీతాన్ని ఆశ్రయించే వారు వస్తూంటారు, వెళ్ళిపోతూంటారు. కానీ ఆత్మోన్నతికోసం సంగీతాన్ని మోక్షమార్గంలో ఉపాసించే నాదయోగులు అరుదుగా పుడ్తారు. వారికి ఏ కోరికలూ ఉండవు. కీర్తి, కిరీటాలు అక్కర్లేదు. అవే వారి వెంట పడుతూ వారి ఖ్యాతిని యినుమడింపచేస్తాయి. అటువంటి నాదయోగి రాజరత్నం పిళ్ళై.

“నీలీల పాడెద దేవా!” అనే నాదస్వరాన్ని వాయించిన అరుణాచలం ఈ రాజరత్నం శిష్యుడే. భగవంతుడు కొందరికి కొన్ని విభూతులు ప్రసాదిస్తాడు. చిత్తశుద్ధిగా నిర్మలభక్తితో సంగీతోపాసన వారి అభ్యున్నతికి కావలసినవన్నీ దైవమే సమకూర్చి పెట్తాడు. గురువుపై గురి, గంటల తరబడి చేసే సాధనే సంగీత విద్వాంసుల పెట్టుబడి. రాజరత్నం అలాటి సాధనే చేశాడు.

మంగళ వాద్యమైన నాదస్వర వాద్యానికి ఓ ప్రత్యేక ప్రతిపత్తిని కలిగించి, సంగీతరంగంలో ఆ వాద్యానికి ఉన్నతస్థానాన్ని కల్పించి కచేరీ గౌరవం కలిగించిన ఏకైక నాదస్వర విద్వాంసుడు రాజరత్నం పిళ్ళై. ఆలయాలలో ఎక్కడో ఓ మూల కూర్చుని, పర్వదినాలలో పండుగరోజుల్లో దేవుడి కల్యాణోత్సవాల్లో, గుడి చుట్టూ తిరుగుతూ వాయించే నాదస్వర కళాకారులు సంగీత కచేరీలు చేస్తూ యితర విద్వాంసులతో సమానమైన హోదాతో నిలదొక్కుకోవడానికి కారణం టి.ఎన్.ఎస్. రాజరత్నమే. గాత్ర ధర్మం బాగా తెలిసిన ఆ వాద్యంలోనే నాదస్వర విద్వాంసులు శిక్షణ నిచ్చి విద్వాంసులుగా తయారు చేయడం సహజం. అపారమైన సంగీత పరిజ్ఞానం కలిగిన మన ఆంధ్రదేశంలో పైడిస్వామి అనే నాదస్వర వాద్య విశారదుడు రాజమహేంద్రవరంలో ఎమ్.ఎస్. బాలసుబ్రహ్మణ్యశర్మయనే గాత్ర విద్వాంసుణ్ణి తయారుచేయటం విశేషంగా చెప్పుకోవాలి.

మన ఆంధ్రదేశంలో నాదస్వర వాద్య విద్వాంసులకు కొదవలేదు. పారుపల్లి వారి శిష్యగణంలోని దాలిపర్తి పిచ్చహరి, చిలకలూరి పేట శ్రీరంగం వాస్తవ్యులు షేక్ చినమౌలా సాహెబ్, సింహాచలానికి చెందిన ఆస్థాన విద్వాంసులు దోమాడ చిట్టబ్బాయి, యింకా ఎందరెందరో ఈ వాద్యం వల్ల ప్రసిద్ధులైయ్యారు.

★ ★ ★

సుధా తరంగమ్

# బాల గంధర్వుడు - 'విద్వాన్ మధన్'



- మోదుమూడి సుధాకర్
9885183988. విజయవాడ



బాల మేధావులుగా ఎందరో పేరు తెచ్చుకుంటారు. అయితే, సంగీత రంగంలో ఒక బాలమురళి, ఒక మాండలిన్ శ్రీనివాస్, ఒక వీణ గాయత్రి.. ఎలా అయితే బాల్యంలోనే తమదైన ముద్రను స్వంతం చేసుకున్నారో అలాగే హిందూస్థానీ సంగీతంలో చిరంజీవి మదన్ ను చెప్పుకోవాలి.అతను ఎప్పటికీ చిరంజీవిగానే రసహృదయుల గుండెల్లో నిలిచిపోతాడు. కారణం అతను జీవించింది 14 సంవత్సరాలే! 1927 డిసెంబరు 28 న పంజాబ్ రాష్ట్రంలో జలంధర్ జిల్లాలోని ఖాన్ ఖానా అనే గ్రామంలో సంప్రదాయ సిక్కుల కుటుంబంలో సర్దార్ అమర్ సింగ్, పూరన్ దేవి దంపతులకు పుట్టిన మాస్టర్ మదన్, ఊహతెలియగానే సంగీతవిద్య అభ్యసించటం ఆరంభించాడు. తన మూడవ ఏట హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మాపూర్ శానిటోరియం లో అతను చేసిన తొలి సంగీత ప్రదర్శన, అక్కడ కిక్కిరిసిన శ్రోతలను సంభ్రమాశ్చర్యాలకు లోనుచేసింది. ధ్రుపద్ శైలిలో సాగిన ఆ బాల విద్వాంసుని గానానికి నిర్వాహకులు, శ్రోతలు బంగారు పతకాలతోనూ, ఆభరణాలతోనూ బ్రహ్మరథం పట్టారు. "హే శారదా నమన్ కరూన్" అనే మిశ్ర కాపీ భజనతో కచేరీ ముగిసింది.

జన్మతః అబ్బిన జ్ఞానానికి పండిట్ అమర్నాథ్ గారి సుశిక్షణ తోడు అవటంతో అనతి కాలంలోనే మాస్టర్ మదన్, తన సోదరుడు మాస్టర్ మోహన్ తో కలసి భారత్ అంతా పర్యటించి, అనేక రాజ ఆస్థానాలలో ప్రదర్శనలు ఇచ్చి,గౌరవ సత్కారాలు అందుకున్నాడు. ఖ్యాతి వహించిన హరివల్లభ్ మేళా (జలంధర్), ఇంకా సిమ్లా సమ్మేళనాలలో ఈ సోదరుల ప్రదర్శనకు జనం పోటెత్తారు. ఎందరో జగద్విఖ్యాత గాయకులకు రానంతమంది ప్రేక్షకులు వీరి కచేరీ వినటానికి ఆసక్తితో వచ్చేవారు. వీరు సిమ్లాలో ఉండగా విఖ్యాత గాయకులు శ్రీ కె.ఎల్.సైగల్ ఈ చిరంజీవుల ఇంటికి తరచు వచ్చి తన హార్మోనియంతో వాద్య సహకారం ఇచ్చేవారు. తన ఎనిమిదవ ఏటనే ఢిల్లీ రేడియోలో పాడే గాయకులలో ముఖ్యుడిగా చిరంజీవి మదన్ నిలిచాడు.

1940 లో సిమ్లా నగరంలో మహాత్మా గాంధీ బహిరంగ సభకు జనం పేలవంగా కనబడ్డారు. కారణం అదే సమయంలో నగరంలో జరిగిన మాస్టర్ మదన్ కచేరీ! తనచేతిలో నిత్యం సిల్క్ వస్త్రంతోచుట్టిన గురునానక్ చిత్రపటాన్ని ఉంచుకొనేవాడు అతను! కలకత్తా లో తన జీవితంలో ఆఖరి కచేరీ 14 వ ఏట చేసి, "వినత్ సునో మోరీ అవధ్పూర్ కే బసియా" అనే అంశం గంటన్నర సేపు పాడగా, శ్రోతలు ఎంతగా మంత్రముగ్ధులైపోయారంటే, కచేరీ ముగిశాక, వారంతా తమ ఇళ్లకు వెళ్ళటానికి కూడా ఇష్టపడలేదు. ఒక శ్రోత 500/-రూపాయలు బహుమతిగా ఆ చిరంజీవి పాదాలకు సమర్పించాడు. (1942 లో అది చాలా పెద్ద మొత్తం) అంతేకాక అక్కడకు వచ్చిన వివిధ సంస్థల ప్రతినిధులు తొమ్మిది బంగారు పతకాలతో మాస్టర్ మదన్ ను సమ్మానించారు. అప్పటి బంగారు పతకాలు నిఖార్సయినవందశాతంబంగారంతోచేయబడిఉండేవి! చిరంజీవి మదన్ ఆ తదుపరి ఢిల్లీ రేడియోలో 3, 4 నెలల పాటు కార్యక్రమాలు సమర్పించాడు. అయితే దురదృష్టవశాత్తూ అతనికి అనారోగ్యం సోకింది. అది క్రమేపీ తీవ్రమైంది. ఎందరు ఎంత ప్రయత్నించినా, ఫలితం దక్కలేదు. అతని కుటుంబ సభ్యులు 1942 వేసవిలో సిమ్లా తీసుకువెళ్లారు. అయితే, అతని నుదురు, కండరాలు తీవ్రంగా వాపుకు గురై, జూన్ 5 వ తేదీన ఈలోకం వదిలాడు చిరంజీవి మదన్. ఒక సుమధుర గాత్రం మూగవోయింది. ఆనాడు సిమ్లా నగరం యావత్తూ స్వచ్ఛందంగా బంద్ పాటించింది.అసంఖ్యాకంగా అతని అభిమానులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు. చిరంజీవి మదన్ సాధించిన బంగారు పతకాలను యథాతథంగా అతని పార్థివ శరీరంపై ఉంచి, దహనకాండ నిర్వహించారు అతని అభిమానులు. మాస్టర్ మదన్ మరణానంతరం, అతని మరణంపై ఎన్నో పుకార్లు గుప్పుమన్నాయి. అంబాలా నగరంలో అతని అపూర్వ ప్రదర్శన విని ఒక యువ గాయని భోజనానికి తన ఇంటికి ఆహ్వానించి, తాంబూలంలో విషం కలిపి ఇచ్చిందని, ఢిల్లీ ఆకాశవాణిలో అతని గానం విని, ఒక అసూయాపరుడైన గాయకుడు, అతనికి పాదరసం కలిపిన షర్బత్ ఇచ్చాడని, కలకత్తా లో ప్రదర్శన అనంతరం బంధువులలోనే ఒకరు విషం కలిపిన పానీయం ఇచ్చారని.. ఆ తరువాత అతని గాత్రం మూగవోయిందని చెప్పుకున్నారు. ఏది ఏమైనా అటువంటి అమర గాయకుడు మరల పుట్టటం దుర్లభం. విలయాగ్ని లాంటి ఈర్ష్యాద్వేషాలకు ఆ పసిప్రాణం బలి అయిపోయింది. తన జీవితకాలంలో కేవలం ఎనిమిది రికార్డులు మాత్రమే ఇచ్చాడు చిరంజీవి మదన్. వాటిలో "యు నా రహ్ రహ్ కే హమే", "హైరత్ సే థక్ రహా హై ".. అనే రెండు గజల్స్ ముందు లభ్యమైనాయి. అతి శ్రమకోర్చి సేకరించిన మిగిలిన ఆరు పాటలూ ప్రస్తుతం వినటానికి దొరుకుతున్నాయి. MASTER MADAN అని యు ట్యూబ్ లో TYPE చేస్తే ఆ ఎనిమిది పాటలు వినవచ్చు.

# ఉనికి ఎరుకే ఉత్తమ గతి



- మల్లాది సూరిబాబు
ఫోన్ : 9182718656

"తెలిసి రామ చింతనతో నామము
సేయవే ఓ మనసా"
తలపులన్ని నిలిపి నిమిషమైన
తారక రూపుని నిజ తత్త్వార్థము
రామాయన చపలాక్షుల పేరు
కామాదుల పోలు వారు వీరు
రామాయన బ్రహ్మమునకు పేరు
ఆ మానవ జన నార్తులు దీరు ॥ తె ॥

అర్కమనుచు జిల్లేదునకు పేరు
మర్కట బుద్ధులెట్లు ధీరు
అర్కుడనుచు భాస్కరునకు పేరు
తర్కమనే అంధకారము దీరు ॥ తె ॥

అజమనుచును మే షమునకు పేరు
నిజ కోరిక లేలా గీదేరు?
అజుడని వాగీశ్వరునకు పేరు
విజయము గల్గును త్యాగరాజ నుతుని ॥ తె ॥

ప్రసిద్ధమైన త్యాగరాజ కీర్తనల్లో ఇదొకటి. సంగీత విద్వాంసులు సాధారణంగా పల్లవి, అనుపల్లవి, తర్వాత ముద్రాచరణంతో ముగించటం అలవాటు. అంటే 'త్యాగరాజనుత' అనే ఆఖరి చరణమే పాడతారు.

నిశ్చల మనోశక్తికి గుర్తుగా ఈశ్వరుడే 'దక్షిణామూర్తి'గా కనిపిస్తాడు. అంటే వృద్ధులైన శిష్యులెదురుగా పరబ్రహ్మతత్త్వాన్ని మౌన వ్యాఖ్యానం ద్వారా అందిస్తాడు.

ఆ శిష్యులకు శాస్త్ర విషయాల్లో ప్రావీణ్యత ఉంది కానీ, తత్త్వ సారాన్ని గ్రహించలేదు.

వారికి మిగిలిపోయిన ధర్మసంశయాలు అంతటా వ్యాపించి పోయిన దక్షిణామూర్తి మహామౌనంలో నివృత్తి అయ్యాయి.

నిశ్చల మనస్సుకు సూటైన మార్గాన్ని తన మౌనం ద్వారా లోకానికి అందించిన మహనీయులు భగవాన్ రమణ మహర్షి. మహర్షి సన్నిధిలో ఒక్కొక్కరికీ ఒక్కో అనుభవం.

దక్షిణామూర్తిలో మూర్తీభవించిన నిశ్చల మనోశక్తికి రమణుల జీవితమే శాశ్వతమైన గీటురాయి. ఒకరోజు రమణ మహర్షిని అడగాలని ప్రఖ్యాత తాత్త్వికవేత్త పాల్ బ్రంటన్ కొన్ని ప్రశ్నలను ముందుగా జాగ్రత్తగా రాసుకుని సిద్ధం చేసుకుని, ఎన్నో సంశయాలతో భగవాన్ కూర్చున్న హాల్లో ప్రవేశించారు. భగవాన్ మంచం మీద అతి సహజసిద్ధమైన స్థితిలో శాంతమూర్తియై కూర్చున్నారు.

హాలంతా నిశ్శబ్దంగా ఉంది. అలా గంటకు పైగా గడిచింది. మరో గంట గడుస్తోంది. ఇద్దరి మధ్య ఏ రకమైన సంభాషణా లేదు. మౌనమే. భగవాన్ని అడగాలని పెట్టుకున్న ప్రశ్నలన్నీ బ్రంటన్ నుంచి నెమ్మదిగా జారుతున్నాయి. ఆ ప్రశ్నలను అడగాలా? వద్దా? అనేది కూడా ఆయనకు పట్టలేదు. ప్రశాంతత! ఒక నదిలా తన ప్రక్క నుంచి ప్రవహిస్తూ, తన అంతఃకరణాన్ని తాకిన అనుభూతి మాత్రం తనకు తెలుస్తోంది. ఇంక ప్రశ్నలు సంధించవలసిన అవసరం తనకు కనిపించలేదు – ఆయన సన్నిధిలో, మౌన ఆశీర్వాదం లభించింది. తృప్తిగా లేచి వెళ్లిపోయాడు బ్రంటన్.

తలపులకు తాళం వేయటమంటే అర్థం అదే. మౌన వ్యాఖ్యకు పరమార్థం కూడా అదే. భక్తులు భావాలు పంచుకుంటారు అనటానికి నిదర్శనం. త్యాగరాజు రచించి పాడుకున్న 'పూర్ణచంద్రిక' రాగంలోని కీర్తన ఇది.

మానవ దైనందిన జీవన విధానానికి తలమానికంగా నిలిచే కీర్తన పట్టుమని పది నిమిషాలు ధ్యానం చేయగలిగితే చాలు – కానీ బుద్ధిని నియంత్రించి నిలబడటం చిన్న విషయం కాదు. ఎందుకంటే మన తలపులకు తలుపులుండవు. ఆశలకు, ఆలోచనలకు ద్వారబంధాలు, తాళాలూ ఉండవు.

విరామం లేకుండా దిక్కుమాలిన పరుగులే పరుగులు. ఏవేవో ఆకాశహర్మ్యాలే. పెట్టుబడి అక్కర్లేదు. కానీ తిరిగి రాని కాలం మాత్రం గాలిపాలు. తారకరాముణ్ణి తత్త్వం తెలిసి భజించే భక్తుల వెనకాలే వుండి వారి సేవ చేస్తాట్ట పరమాత్ముడు.

మనసులోని భావాలను వ్యక్తం చేయటానికి మాటలకు శక్తి లేదు. నిజానికి మాటలు చాలవు. ఎన్ని జన్మల్లో చేసిన పాపాలైనా మానవజన్మ లభించినందుకు సార్థకం చేసుకుని బ్రతకరా నాయనా' అని నెత్తినోరూ బాదుకుని యోగులైనా, నాదయోగులైనా చెవిన ఇల్లు కట్టుకుని చెప్పారు.

త్యాగయ్య భౌతిక దేహంతో 80 ఏళ్లున్నా యశః కాయంతో ఎందుకు ఎవరి కోసం, ఈనాటికీ మన మధ్య వున్నారో తెలిస్తే చాలు తత్త్వం తెలిస్తే అహంకారముండదు.

అహంకారం ఛస్తే 'ఆత్మే' తానవుతాడు. నశించే శరీరం కాదు. ఆత్మలోనే ఉంది శరీరం. ఆత్మేవ జగత్సర్వం.

ధనబలం, విద్యాబలం లేదా అహంకారం, రాజ్యాధికారం, ఇవన్నీ సహజంగా, అభిమానాన్నీ అభిజాత్యాన్ని పెంచి పోషిస్తూంటాయి.

తత్త్వం తెలుసుకునేంతవరకూ 'సునామీ'లా ఒక ఊపు ఉపేస్తాయి. అయోమయంలో పారేస్తాయి.

ఉన్నచోట స్థిమితంగా ఉండనివ్వవు. లోకతత్త్వం తెల్సుకోవాలన్నా శరీర తత్త్వం, ఆత్మతత్త్వం తెలుసుకోవాలన్నా వివేకం ఉండి తీరాలి.

అన్నిటికీ మనస్సే ప్రధానం. రామచంద్రుణ్ణి ధ్యానించినప్పుడు ఆయన నిజ తత్త్వం తెలిసి ధ్యానిస్తే అది ఫలవంతమౌతుంది. ఒక్కో మాటకు రెండు అర్థాలున్నాయి. రామ అంటే 'స్త్రీ' అనే అర్థముంది.

తారక రాముణ్ణి స్మరిస్తే పరబ్రహ్మ స్వరూపం తెలుస్తుంది. సంసార దుఃఖ నివృత్తి కలుగుతుంది. నిజమైన సంగీత సద్గురువు త్యాగరాజే.

ముగ్గురు సంగీతమూర్తులూ ఒకే వూళ్లో వున్నారు. ఎవరి ధోరణిలో వారు పాడుకుంటూ బ్రతికారు. ఎవరి శిష్యులు వారికున్నారు. ఒకరంటే మరొకరికి గౌరవమే. అన్యోన్యం గానే ఉండేవారు తప్ప అసహనం గానీ, అహంకారం గానీ, మత్సర బుద్ధిగానీ ఎఱుగరు కాబట్టే ప్రాతఃస్మరణీయులయ్యారు. సంగీత లోకానికి ఆదర్శ పురుషులయ్యారు.

తమ జీవితాలను సంగీత మార్గంలో నడుపుకుని తరించారు. ఆ దారిని మనకూ చూపించారు.

తనకంటే గొప్పవారిని అభినందించటం, తక్కువ వారిని ప్రోత్సహించి మాట్లాడటం సంగీతజ్ఞులకుండే ప్రాథమిక సద్గుణాలు.

ఇవి లోపించినంత కాలం, వారి పాటకు పెరుగుదలంటూ వుండదు. ఎండమావిలా కనిపిస్తుంది. అంతే.

సంగీత మూర్తిత్రయమైన శ్యామశాస్త్రి, త్యాగరాజు, దీక్షితులు వీరిలో ఏ ఒక్కరికీ కీర్తి కండూతి లేదు. రాజులతో గానీ రాజాస్థానాలతో గానీ పనిలేదు. రాజుల్ మత్తులు, వారి సేవ నరకప్రాయమని వాళ్లకు చాలా దూరంగానే బ్రతికారు.

భద్రాచల రామదాసు, కబీరు వంటి వారెందరో వున్నారు. 96 కోట్ల రామనామ జపం చేసినది ఒక్క త్యాగయ్యే.

భక్తులలో త్యాగయ్యకు ప్రహ్లాదుడే స్ఫూర్తి. ఆదర్శమూర్తి. ఆయననే అంతరంగంలో నిలుపుకుంటూ, ఆయననే స్మరిస్తూ, ప్రహ్లాదుడికి లభించిన ముక్తి మార్గాన్ని తనకూ ప్రసాదించమని చేసే వేడుకోలు ప్రయత్నమే ఆయన ప్రహ్లాద భక్త విజయం.

సంగీతానికి అనువైన అజంత భాష మన తెలుగు భాష, అరవ దేశంలో వుండి అచ్చ తెలుగులో నాదోపాసనను మేళవించి, సప్తస్వర సుందరులను భజించి, సంగీతజ్ఞులకో మార్గం చూపించిన ఆ మహానుభావుణ్ణి తలచుకోని వారెవ్వరు?

అందుకే సంగీత సాహిత్యనిధి అయిన త్యాగరాజు కీర్తనలన్నీ ఆయన మనసులో నుండి ఆశువుగా బయలుదేరినవే.

★ ★ ★

సంగీత జ్ఞాన విహీనులకు మోక్షము గలదా? యని నిర్మొహమాటంగా ధైర్యంగా త్యాగరాజు వేసిన ప్రశ్నకు కలదని నిర్భయంగా ప్రత్యుత్తరమియ్యగలిగిన వారింతవరకూ పుట్టలేదు.

ఈ వేళ అటువంటి పెద్దలు ఏర్పరచిన సంగీత మార్గంలో ఎందరు ప్రయాణిస్తున్నారు?

సంగీతాన్ని జీవికగా (తేలికగా) చేసుకుని బ్రతికేవారే ఎక్కువ. ఇంకా నయం. పాడేందుకు ఇష్టం లేకపోయినా, పాడటం తమకు తెలియకపోయినా, కనీసం ఇతరులు పాడితే సంతోషించగల చైతన్యం ఇంకా లోకంలో వుంది అనేవారు సంగీత విమర్శకుడు

రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ. ఒక విద్వాంసుడు గానం చేస్తూంటే మరో విద్వాంసుడు కూర్చుని వింటే గండపెండేరంతో సత్కరించి గజారోహణం చేసినతం సంబరపడే వారుంటారు. కానీ, అటువంటి వారు అరుదు.

విద్వాంసుల కంటే, సంగీత పరిచయం బొత్తిగా లేని వారి ఎదురుగా పాడటమే కష్టం. వారికి తెలుసనుకుని పాడాలా? తెలియదనుకుని భావించి, దానికి తగ్గట్టుగా పాడాలా? అనే మీమాంసతో గాయకుడు సతమతమౌతాడు. వారికి బాగా పరిచయమున్న రాగాల్లోనే కీర్తనలు వినిపించటమే అవుతుంది, సినీ రంగంలో సుప్రసిద్ధ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరావు పాట, ప్రతిభలను గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఆయన భార్య సావిత్రిగారితో 2003వ సం.లో విజయవాడ రేడియో కేంద్రంలో నేనే ఒక ఇంటర్వ్యూ చేశాను.

'సంగీత విద్వాంసులు సైతం మెచ్చుకునే గాయకుడు కదా మీ ఆయన? మీరున్న మద్రాసు నగరంలో ఎన్నో సంగీత సభలున్నాయి, ఎందరెందరో మహా విద్వాంసులు పాడుతూంటారు. ఎప్పుడైనా సంగీత కచేరీలకు వెళ్లి వినాలనే ఆసక్తి వుండేదా?' అని అడిగాను. దానికి ఆమె 'ఆయనకు కర్ణాటక సంగీతం ప్రాణం. నిజానికి ఆయనకు భిక్ష పెట్టినది ఆ సంగీత జ్ఞానమే. అదే లేకపోతే రాగాల స్వరూప స్వభావలన్నీ ఎలా తెలుస్తాయి? మహా కవి కాళిదాసు చిత్రం కోసం 'కల్యాణి' రాగంలో 'మాతా మరకత శ్యామా, మాతంగీ' అనే శ్యామలా దండకం విని పరవశుడైన ఒక సంగీత రసికుడు. మా యింటికో రోజు పొద్దున్నే వచ్చి బుట్టెడు పళ్లు ముందు పెట్టి తమిళంలో మాట్లాడుతూ 'అయ్యా! మీ వంటి గాయకుడు దొరకడం తెలుగు సినిమా రంగం చేసుకున్న పుణ్యం. నేను రెండు దశాబ్దాలుగా కేవలం కర్ణాటక సంగీత కచేరీలు మాత్రమే వింటాను. ఏ సినిమాలు చూడను. సినిమా పాటలు వినను. మా యింట్లో ఎవరూ వినరు. సినిమాలకు వెళ్లరు. ఆర్తిగా మీలా గానం చేసి మ్రొక్కరిల్లితే ఎదురుగా అమ్మవారొచ్చి నిలబడదా?' అని కళ్లనీళ్ల పర్యంతమై పాదాభివందనం చేసి వెళ్లిపోయాడు. నిజానికి మనసులో సంగీత కచేరీలకు వెళ్లి వినాలనే వుండేది. కానీ సమయం సరిపోయేది కాదు.

తీరా వెళ్లామని అనుకునేలోగా, తనలో తాను 'ఎన్నో ఏళ్లు కష్టపడి శుద్ధమైన కర్ణాటక సంగీతం నేర్చుకుని, అందులో హాయిని అనుభవించిన నేను.... బ్రతుకుతెరువు కోసం ఈ సినిమా పాటలు పాడవలసి వస్తోంది కదా' అని చింతించవలసిన స్థితి వస్తుంది – నన్ను వెళ్లమనకు. వీలు చేసుకుని ఎప్పుడైనా ఇంట్లో కూర్చునే వింటానులే' అనేవారు.

నిజమైన పండితునికి బుద్ధి ప్రమాణం. ఇది ప్రాచీనం, యిది అర్వాచీనం, యిది సాంప్రదాయం, యిది ఆధునికం అనే భేదాలుండవు. బుద్ధికి తోచినదాన్నే ప్రమాణంగా స్వీకరిస్తారు. ప్రమాణానికి బద్ధమైన దాన్నే అంగీకరిస్తారు. ఘంటసాల పాడిన సంప్రదాయ సంగీత ధోరణి పాటలే దీనికి ఉదాహరణ. మన గురించి మనమే పట్టించుకునే సమయ ముండదు. అవతలి వారిని గురించి

ఆలోచించేదెవరు? వోలేటి సుబ్బారావనే ఆప్తమిత్రు డొకాయన వున్నారు. పరుల యోగ క్షేమాలు తెలుసుకోవటమే ఆయన ప్రవృత్తి. సంగీత సాహిత్యాలంటే ప్రాణం. ఆయన పిల్లలు అమెరికాలో వుంటారు. అక్కడున్నా, ఇక్కడున్నా దూరమైనా, భారమైనా, తాను ప్రాణంగా భావించేవారితో ఏదో ఫోన్లో బాతాఖానీ కాదు. స్వయంగా వారిళ్లకు వెళ్లి పలకరించే స్వభావం కలిగిన అరుదైన స్నేహశీలి.

మద్రాసు వెళ్తే ప్రముఖులను కలవకుండా యింటికి రాడు. ఆ మధ్య మద్రాసు వెళ్లినప్పుడు అక్కడ ఘంటసాల కబుర్లు తీసుకొచ్చి, వినిపించాడు. సినిమా అవకాశాలు వెతుక్కుంటూ ఆధారము దొరక్క మద్రాసులోని పానగల్లు పార్కులో, ఘంటసాల కాలక్షేపం చేసే రోజుల్లో రామచంద్రరావనే వ్యక్తితో స్నేహం ఏర్పడింది. మంచి సంగీత రసజ్ఞుడు.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ తన పాటలు రామచంద్రరావుకు పాడి వినిపించేవారుట ఘంటసాల.

ఫలానా రాగం బాగుందనీ, ఫలానా రాగం ఆ పాటకు నప్పలేదనీ చెప్పగలిగేటంత చనువును పెంచుకున్న రామచంద్రరావు విశాఖపట్నం నుంచి తమ బ్రతుకు తెరువు కోసం మద్రాసు చేరాడు. క్రమంగా అక్కడే ఇద్దరికి స్నేహం పెరిగింది. సినిమా రంగంతో ఘంటసాల కాస్త నిలదొక్కుకోగానే అతన్ని తన వద్దే ఉంచేసుకున్నారు. చాలా కాలం ఘంటసాల ఇంట్లోనే ఉంటూ, 'సావిత్రమ్మగారికి వంటలో సహాయపడుతూ వుండేవాడు' అని సావిత్రిగారు చెప్పిన మాటలు గుర్తుచేశాడు.

★ ★ ★

ఇంట్లో పూజా మందిరంలో కూర్చుని ఆ ఏడుకొండల వాణ్ణి తలచుకోండి. వెంటనే ఆ దివ్య మంగళ విగ్రహుని రూపం కంటికి కనిపించదూ? ఇక్కడ కూర్చుని అమెరికాలో వున్న మీ పిల్లల్ని ఓసారి తలుచుకోండి. చిరునవ్వులు చిందిస్తూ గబగబా మీ ఒళ్లో వాలేసి మీ మనవలు, మనవరాళ్ల మొఖాలు మనసులో నిలిచి సంతోషాన్ని నింపేయవూ?

ఒకటే పదార్థం. రెండు రూపాల్లో కనిపించినట్లుగా సంగీతంలో రాగాలు కూడా అంతే – రాగాన్ని స్మరించగానే 'ఆ రాగ దేవతలు' సాక్షాత్కరించినట్లుగా విద్వాంసులు పాడేవారొకప్పుడు. పాలు, నీరు కలిసినట్లుగా రాగం, భావం కలిసి ఖరహరప్రియ, కాంభోజి, కాపీ, కీరవాణి, కల్యాణి, మోహన వంటి ఎన్నో రాగాల్లో పాడే కీర్తనలన్నీ ఆ రాగాల్ని ప్రతిబింబించే సాహిత్య రూపాలే. రాగం, సాహిత్యం వేరువేరు కాదు' అని భావించి రాగభావం బాగా తెలిసి పాడాడు. కాబట్టే ఘంటసాల వెంకటేశ్వరరావును నేటికీ జనం తలుచుకోవటంలో ఆశ్చర్యం లేదు.

ఈ వేళ సినిమాలకు రాగాలతో నిమిత్తం లేదు – ఏదో ఓ బీటు వుంటే చాలు – సంగీత జ్ఞానం విధిగా గాయకులకుండాలనే నియమం లేదు – నాద సుఖంతో పనిలేదు.

★ ★ ★

# మునుగంటి శతజయంతి-కాకినాడ

ఏప్రియల్ 4, 5, 6 తేదీలలో "సంగీత సభాపతి" స్వర్గీయ మునుగంటి శ్రీరామమూర్తి శతజయంతి ఉత్సవాలు మూడురోజులపాటు కాకినాడ సూర్యకళామందిరంలో మునుగంటి వారి కుమారులు వెంకటరావు, భాస్కర వెంకట రామకృష్ణల ఆధ్వర్యంలో పటిష్టమైన ప్రణాళికతో జరిగి అందరినీ అలరించాయి.

మొదటి రోజు కాకినాడ పరిసర ప్రాంత సంగీత విద్వాంసులు వారి శిష్యప్రశిష్యులు మునుగంటికి సంగీత నీరాజనం అర్పించారు.

ఈ కార్యక్రమం తలపోసిన మునుగంటి వారి రెండవ కుమారుడు భాస్కర వెంకటరామకృష్ణ స్వాగతం పలికి కళాకారులను ఆహ్వానించారు.

సభా కార్యక్రమంలో మునుగంటి స్థాపించిన సంగీత విద్వత్సభ అధ్యక్షులు శ్రీ నారాయణం మురళి సభాధ్యక్షులుగా వ్యవహరిస్తూ శ్రీ మునుగంటి వారికి తనకు గల పరిచయాన్ని, సంగీత రంగంలోకి తాను ప్రవేశించడానికి మునుగంటి ఎలా కారకులయ్యారో వివరిస్తూ ఆ ప్రోద్భలం వల్లనే తాను సభలో కొనసాగుతున్నానని తెలిపారు.వారికి సర్వదా కృతజ్ఞుడనని అన్నారు.

ముఖ్య అతిథిగా సభనలంకరించిన విద్వాన్ శ్రీ ఈయుణ్ణి కృష్ణమాచార్యులు(సత్కళావాహిని అధినేత) సంగీత రంగంలో మునుగంటి చేసిన సేవ – ఆర్థికంగా,సామాజికంగ,సంస్థ మనుగడకు పునాదులు వేసిందని వారిని ఎవరూ మరువలేరని తెలిపారు.

అధ్యక్షులు తదుపరి కార్యక్రమం నిర్వహించ వలసినదిగా శ్రీమతి సూర్యకుమారి గారిని నిర్దేశించి సభా కార్యక్రమం ముగించారు.

విదుషి శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి మునుగంటి వారి గురించి ప్రసంగిస్తూ వారి కార్యదక్షత, సమయపాలన ఎవ్వరికీ సాధ్యం కావన్నారు. తదుపరి ''స్వరనీరాజనం'' నిర్వహణా భారం వహించగా రాత్రి పదివరకు సాగింది. ఇందులో సర్వశ్రీ శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు – ముత్తుస్వామి దీక్షితర్ రచనలు; శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి, శిష్యులు – త్యాగరాజస్వామి రచనలు; శ్రీమతి జి. అరుణ, శిష్యులు –శ్యామశాస్త్రి రచనలు; శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి – స్వాతి తిరునాళ్ రచనలు; శ్రీ ద్విభాష్యం నగేష్ బాబు – వీణ – పట్నం సుబ్రమణ్యయ్యర్ రచనలు; శ్రీమతి చిలుకూరి సుబ్బలక్ష్మి, శిష్యులు – అన్నమాచార్య రచనలు; శ్రీమతి ఆత్మకూరి పుష్పారామ్మోహన్ – కొచ్చెర్లకోట రామరాజు రచనలు; శ్రీమతి చావలి సూర్యకుమారి, శిష్యులు – నారాయణతీర్థ రచనలు; శ్రీ ఇ.వి. కృష్ణమాచార్యులు, శిష్యులు – మహదేవశంభో రచనలు; శ్రీమతి ఎమ్. విజయకుమారి, శిష్యులు – మీరా భజన్స్; శ్రీ బి.వి.ఎస్. శర్మ, శిష్యులు – మురళీవాదనం – ముత్తయ భాగవతార్; బాల భవన్ విద్యార్థులు – పురందర దాసు రచనలు; శ్రీ అంగాడి శివప్రసాద్; శ్రీ పేపకాయల రామకృష్ణ, – మైసూర్ వాసుదేవాచారి రచనలు; శ్రీమతి కేశిరాజు శారదాదేవి –తంజావూర్ శంకరయ్యర్, జయదేవ అష్టపది; శ్రీ నజీర్ – వీణ కుప్పయ్యర్; శ్రీమతి దేవరకొండ విజయలక్ష్మి– లాల్గుడి తిల్లానాలు; శ్రీరామ సమాజం విద్యార్థులు – రామదాసు రచనలు; శ్రీమతి సుధా అనంత్ – బాల మురళీ రచన, సూరదాస్ భజన; శ్రీమతి లక్కరాజు శేషకుమారి మెమోరియల్ సంగీత శిక్షణా కేంద్రము – తూము నరసింహదాసు రచనలు; వాద్య సహకారములు : వయొలిన్ : శ్రీ విష్ణుభట్ల శ్రీరామచంద్రమూర్తి; మృదంగం : శ్రీ వారణాసి శ్రీనివాస్, శ్రీ కె. సూరిబాబు, శ్రీ ఎ. అనిల్ కుమార్, శ్రీ పి. పవన్ కుమార్, శ్రీ చిలుకూరి అభిరామ్ పాల్గొన్నారు.

శ్రీ మునుగంటి భాస్కర వెంకటరామకృష్ణ కళాకారులను సత్కరించగా మునుగంటి మనుమలు సాయిరవిచరణ వినీత్, విరియాల వెంకట విశ్వేశరరావు సంగీత విద్యార్థులకు మెమెంటోలను అందించారు.

కార్యక్రమానంతరం ఫలహారముల ఏర్పాటు జరిగింది.

రెండవ రోజు కార్యక్రమం విశేషమైభాసించింది. "నేను మామునుగంటి" శీర్షికన మునుగంటి వారితో తమకుగల ఆప్యాయానురాగాలను గుర్తుచేసుకొని పులకరించినవారెందరో.

ఈ కార్యక్రమం సరస్వతీ గానసభ అధ్యక్షులైన శ్రీ కె.వి.యస్. ఆంజనేయమూర్తి మహోదయుల ఆధ్యక్షతన ప్రణాళికా బద్ధంగా జరిగింది. బహుతీవ్రమైన వర్షం తడిపినా అభిమానుల సందడి కొనలు సాగుతూనే నడచింది.

అధ్యక్షపీఠం నుండి ఆంజనేయమూర్తి గారి ప్రసంగంలో మునుగంటి వారు తననెలా ప్రభావితం చేసినదీ వివరిస్తూ వారి ఋణం ఎవరికైనా తీర్చుకోలేనిదని, వారి నుండి చక్కని స్ఫూర్తి పొందానని అంటూ ఆ నాటి ముఖ్య అతిథి శ్రీ ఎమ్.ఎస్. శ్రీనివాస్ (పూర్వ కార్యదర్శి–విశాఖ మ్యూజిక్ అకాడమి–విశాఖ)ను ఆహ్వానించారు ప్రసంగానికి. శ్రీరామమూర్తిగారిని మొదట కలిసిన వైనం వివరిస్తూ, వారి సేవలను కొనియాడారు శ్రీనివాస్.

అనంతరం సర్వశ్రీ యార్లగడ్డ దశరథ రామారావు, ఆర్.ఏ.రావు, డా॥ఎస్.వి.రావు, వక్కలంక రామకృష్ణ, విద్వాన్ కొమాండూరి వెంకట కృష్ణ, విద్వాన్ కొమ్మాజ్యోశ్యుల సద్గురుచరణ్ తదితరుల ప్రసంగాలలో మునుగంటి స్ఫూర్తి ఆవిష్కరింపబడింది. తుది పల్కులలో అధ్యక్షులు సంగీత సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆనాటి సంగీత సభలో చెన్నై విద్వాంసులు ప్రసన్న వెంకటరామన్ గాత్ర సంగీత సభ లో ''మోహన'' మన్మోహనమైంది. శ్రీ కొమాండూరి వెంకట కృష్ణ, కొమ్మాజ్యోశ్యుల సద్గురు చరణ్ ప్రక్క వాద్య సహకారం శోభస్కరమై విరాజిల్లింది.

ఆనాటి చవులూరించిన విందును శ్రీ ఆంజనేయ మూర్తిగారే ఏర్పాటు చేసి రసవంతం చేశారు.

మూడవరోజు సభ శ్రీరామమూర్తి గారి "సంస్మరణ" సభ. విద్వాన్ శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు అధ్యక్షతన, శ్రీ మండలీక సీతారాఘవరావు(ట్రస్టీ–శ్రీరామసమాజం)ముఖ్య అతిథిగా జరిగింది.

తన సంగీత ప్రయాణంలో, సంగీత విద్వత్సభ, శ్రీరామసమాజం సంస్థలలో తనకు ఆయన కల్పించిన సేవాభాగ్యం, గానకళలో వ్యాసాలు అందించే అవకాశం వంటి అంశాలు అధ్యక్షుల వారి ఉపన్యాసంలో చోటు చేసుకొన్నాయి. ముఖ్య అతిథి రాఘవరావు శ్రీరామసమాజం, విద్వత్సభ లకు సేవ చేసే అవకాశం వారు కల్పించారని, సమాజ నూతన భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని తెలుపుతూ ఒక లక్ష రూపాయలు శ్రీరామ సమాజ నూత్న భవన నిర్మాణానికి తొలి వంతుగా అందజేశారు.

ఇంకా హైదరాబాద్ నుండి విచ్చేసిన శ్రీ జయంతి సత్యనారాయణ శాస్త్రి గానకళ ద్వారా మూర్తి గారి పరిచయం అయిందని, దానికి సహాయ సంపాదకునిగా పనిచేసే అవకాశం కలిగిందని, వారితో అనేక విషయాలు ముచ్చటించుకొనే వాడినని, వారి సాంగత్యం ఉపయుక్తమైనదని అంటూ అనేక విషయాలు తెలిపారు.

శ్రీ జి.ఎస్.కె.డి.వెంకటరావు, శ్రీమతులు పుష్పా రామ్మోహనరావు, మండ విజయకుమారి, శ్రీమతి ఎం. భరతలక్ష్మి, చావలి సూర్య కుమారి, విదుషీమణి శ్రీమతి పంతుల రమ మాట్లాడారు.

కళాకారులకు ముఖ్యంగా తెలుగు కళాకారులకు వారిచ్చిన ప్రోత్సాహం గురించి సర్వులు ఉటంకించారు. అనంతరం విదుషి శ్రీమతి పంతుల రమ రసభరితమైన సంగీత సభ ఉర్రూతలూగించింది. చి॥పంతుల సాకేత్ వయొలిన్ పై, శ్రీ ధన్వాడ ధర్మారావు మృదంగంపై చక్కని సహకారం యిచ్చారు. కళాకారులందరిని శ్రీ మునుగంటి భాస్కర వెంకట రామకృష్ణ సన్మానించారు.

మూడు రోజుల కార్యక్రమాలు విజయవంతం చేసిన అన్నదమ్ములును సత్కళావాహిని కార్యదర్శి శ్రీమాన్ కృష్ణమాచార్యులు, శ్రీమతి కుంజికాలక్ష్మి దంపతులు, సత్కళ సభ్యులు సత్కరించారు. వచ్చిన వారందరినీ మునుగంటి కుటుంబం సత్కరించింది. మునుగంటి వారి కోడళ్లు శ్రీమతి కళ్యాణి, శ్రీమతి మైత్రేయి, కుమార్తె విరియాల శుభాదేవి, కుటుంబ సభ్యులందరు పాల్గొన్నారు. అందరికీ మునుగంటి వెంకటరావు ధన్యవాదాలు అందజేశారు. కీ.శే. శ్రీ డబ్బీ వెంకటరమణయ్య పంతులు సంస్మరణగా తూర్పుగోదావరి జిల్లా సంఘం, కాకినాడ సౌజన్యం అందజేసింది.




శతజయంతి ఉత్సవాలు


శతజయంతి ఉత్సవాలు


శతజయంతి ఉత్సవాలు


శతజయంతి ఉత్సవాలు


శతజయంతి ఉత్సవాలు


శతజయంతి ఉత్సవాలు














శతజయంతి ఉత్సవాలు


శతజయంతి ఉత్సవాలు








































శతజయంతి ఉత్సవాలు

శతజయంతి ఉత్సవాలు



# 'సంకీర్తనోద్యాన విహారి' - శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్

జీవితంలో ఇష్టపడిన దానికోసం మనసారా కష్టపడాలి. అలా ఇష్టపడినప్పుడే ఏ కష్టాన్నయినా భరించగలం. ఆపైన కష్టపడినప్పుడే మనకు ఇష్టమైనదాన్ని సాధించగలం. సంగీతమూ అంతే. సాధన చెయ్యాలి. సేవన చేయాలి. భావన చెయ్యాలి. శోధన చేయాలి. అప్పుడే, సంగీతకళాకారుడికి సంపూర్ణత్వం సిద్ధిస్తుంది. అలా సిద్ధి పొందినవారే — ఒక ఘంటసాలగానో, సుశీలగానో, సాలూరి రాజేశ్వర్రావు గానో, బాలసరస్వతీదేవిగానో, బాలమురళీగానో, నేదునూరిగానో, చిత్తరంజన్ గానో, బాలకృష్ణ ప్రసాద్ గానో పరిణతి చెందిన సప్తస్వర వ్యక్తిత్వాలై సాక్షాత్కరిస్తారు. సంగీత ప్రియుల ఆరాధ్యదైవాలవుతారు.

జీవితంలో వెలుగు నీడల మధ్య .. ఆ సన్నని కాల్దారి మీద నడిచిన వ్యక్తి బాలకృష్ణ ప్రసాద్. వెన్నెల వేళలూ చూశాడు. చీకటి రేలనూ కడచాడు. ఆ దారిలో ఎదురైన అనేక అనుభవాలు అతని చూపుల్లో వినిపిస్తాయి. ఎన్నో అనుభూతులు అతని మాటల్లో కనిపిస్తాయి. ఆ అనుభవాల ఆనందాలూ .. అనుభూతుల పరిమళాలూ అతని 'పసి'నవ్వుల్లో దోగాడుతూంటాయి. అందుకే — బాలకృష్ణ ప్రసాద్ పాట వినడం ఒక అనుభవమే కాదు .. ఒక మనోహరమైన అనుభూతిలోకి మేల్కొనడం ... ఒక అద్వితీయ ఆధ్యాత్మిక సంగీత సభలో పాల్గొనడం.

సంగీత సాహిత్యాల పరిధులెరిగి రాగ సౌరభం చెడకుండా .. భావ సౌకుమార్యం పోకుండా స్వచ్ఛమైన, శుద్ధమైన ఉచ్చారణతో ప్రతి పదాన్నీ ఆ రాగ స్పర్శతో పాడే విశిష్ట శైలి తీరే – బాలకృష్ణ. ఆ రాగాల వనమాలి పేరే – బాలకృష్ణ.

రాగం తానై, భావం తానై .. లయలో సంచరించే నైపుణ్యంతో కూడిన ఏకాగ్రత తప్ప భావ సౌందర్యాన్ని మరుగునపరిచే అనవసర విన్యాసాలూ, మరే భేషజాలూ అతని పాటలో వినిపించవు. శబ్ద సౌందర్యం, స్వర సౌష్టవం తెలిసినవాడుగనకే — భావ సౌమ్యం అతనికి అలవడింది. సంగీత సౌకుమార్యాన్నీ, సాహిత్య సౌరభాన్నీ ఆత్మలో నింపుకొన్నాడుగనకే – సప్తస్వర వేదం అతని గొంతులో స్థిరపడింది.

సుతారం .. సుతిమెత్తన .. మార్దవం .. హాయి — అనే పదాలకు పర్యాయ పదమై .. తెలుగువారి అంతరంగాలలో ఆధ్యాత్మిక స్వర దీపాలు వెలిగించిన భావుకుడూ, నిత్య సాధకుడూ, ఆత్మ శోధకుడూ.. గాయకుడూ, వాగ్గేయకారుడూ .. మా గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్.

అన్నమయ్య సంకీర్తనా ప్రచార యజ్ఞంలో – వేటూరి ప్రభాకర శాస్త్రిగారూ, అలానే ఆ కీర్తనలను మొదట స్వరపరచి తెలుగువారికి సమర్పించిన రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మగారూ ప్రాతఃస్మరణీయులు. బాలాంత్రపు రజనీకాంతరావు గారూ, మల్లిక్ గారూ, నేదునూరి కృష్ణమూర్తి గారూ, కామిశెట్టి శ్రీనివాసులు గారూ చిరస్మరణీయులు. ఈ వరుసలో బాలకృష్ణ ప్రసాద్ కి కూడా ఒక విశిష్ట స్థానం ఉందనడం అతిశయోక్తి కాదు. తన గురువుగారైన నేదునూరి బాణీలు కూడా బాలకృష్ణ కంఠంలో అందంగా, లలితంగా ఒదిగిపోయి అన్నమయ్య భావ చిత్రాలకు సజీవాకృతినిచ్చాయి. శాస్త్రీయ, లలిత, జానపద రీతుల్లో తాను స్వయంగా స్వరాలద్ది గానం చేసిన అన్నమాచార్యులవారి అనేక సంకీర్తనలు విశేష జనాదరణ పొంది.. ఇప్పటికీ అనేక వర్ధమాన గాయనీ గాయకుల పెదవులపై మసలుతూనే ఉన్నాయి.

అసలు అన్నమయ్యకూ.. బాలకృష్ణ ప్రసాదుకూ.. మట్టికీ, మనిషికీ – వానకూ, నేలకూ ఉన్న బాంధవ్యం ఏదో ఉందనిపిస్తుంది నాకు. చినుకు నేలను తాకగానే గుబాళించే మట్టి పరిమళం అందరికీ అనుభవైకవేద్యమే. తెలుగు నేలనుంచి వెలువడిన స్వచ్ఛమైన "స్వరరాగ సుధారస" మాధుర్యం యేదో ఆతని పాటలో ఎగసి .. వినగానే ఆ సొగసు మనసుల్ని ఆవరించుకుని.. వశపరుచుకొంటుంది. తండ్రి – చెయ్యి పట్టుకొని పిల్లాడిని బడికి నడిపించినట్లు ఈతని పాట మనసుల్ని ఆకట్టుకొని నా వంటి 'నాస్తికుడిలాంటి' వాడికి కూడా భగవంతునిపై ధ్యాస మళ్లించి, ఆధ్యాత్మికతవైపు అడుగులు వేయిస్తుంది.

దేవుడనే ఊహ – నమ్మినవారికి ఆలాపన .. నమ్మనివారికి ఆలోచన. ఉన్నాడనుకున్నవారికి ఈతని పాట – ఒక పథం అయితే .. లేదనుకున్నవారికి అదొక – పాఠం... సంగీత పాఠం. అంతే.

సంగీత సాహిత్యాలను ఉపాసించాడుగనకే ఆ రెంటి పరిధులూ తెలిసి సాగే అతని స్వర విన్యాసంలో విషయ పరిజ్ఞానం ప్రస్ఫుటంగా వెల్లడవుతుంది. నాద సాక్షాత్కారం కలిగిందిగనకే – అన్నమయ్యను అంతరంగ రంగంపై ప్రతిష్ఠించుకుని ఆ పదకవితా పితామహుని ఆంతర్యాన్నెరిగిన తన్మయత్వంతో పాడతాడు. తన పాటతో పరిసరాలనూ, శ్రోతల హృదయాలనూ సునాదమయం చేస్తాడు. అదీ అతని గానం సాధించిన పరమార్థం. అందుకే, అతని చేరువ సరస్వతి సన్నిధానం. అతనికి మాత్రం – "చిత్తజ గురుడు".. అన్నమయ్యే నిధీ, నిధానం.

అందుకే అంటానూ – బాలకృష్ణ ప్రసాద్ అన్నమయ్య పదాలతో శ్రీపతి సన్నిధికి దారిచూపే సంగీత రాయబారీ ... అన్నమాచార్యులవారు అందించిన తిరువేదాన్ని సామాన్యులవరకూ చేరవేయడానికి దేశాటనం చేసిన ఆధ్యాత్మిక బాటసారీ ... అని. అన్నమయ్య సంకీర్తనలను – ఆరాధించి, పరిశీలించి, విశ్లేషించి దోషరహితంగా .. చందోబద్ధ న్యాయాన్ని పాటిస్తూ తన్మయుడై, చిన్మయుడై .. సాహిత్య భావాన్నిబట్టి లలితంగా, శాస్త్రీయంగా,జనరంజకంగా,మనోరంజకంగా, చిత్తరంజకంగా ఆలపించే గాత్రధారీ .. అన్నమయ్య పద సంకీర్తనలకు విస్తృత ప్రాచుర్యం కలిగించిన ముఖ్య పాత్రధారీ ... సూత్రధారీ – శ్రీమాన్ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్.

శబ్దానికి ఉన్న శక్తీ .. నిశ్శబ్దానికి ఉన్న పటిమా తెలుసుగనకే చిరునవ్వుతో భాషించడం అలవడింది. మాటలనూ, భాషనూ పొదుపుగా వాడుతూ నొసలు చిట్లించేవారికీ, చెవులుకొరికేవారికీ తన పాటతోనే జవాబు చెప్పే పాటవం అతనిది.

తాను నేర్చుకున్న సంగీతం మీదా, నేర్పిన గురువుల పట్లా అచంచల భక్తి కలిగిన సాధకుడు.. తన పెదవులపై రాగరంజితాలై కదిలే 'పదాల'పై ప్రగాఢ అనురక్తి కలిగిన శోధకుడు.. నాలాంటి ఎందరికో జ్ఞాన దానం చేసిన బోధకుడు.. చెదరని విశ్వాసంతో పరమాత్మను కొలిచే ఆస్తికుడు.. బాలకృష్ణ ప్రసాద్. తనకు జీవితాన్నీ, జీవనాన్నీ కరుణించిన సంగీత సాహిత్యాలపై విధేయతా, నడవడికలో నమ్రతా... ఆత్మ విమర్శ చేసుకోగలిగిన కూశాగ్ర బుద్ధీ, తాను చేపట్టిన అన్నమయ్య సారస్వత ప్రచార యజ్ఞమ్ పై చిత్త శుద్ధీ కలిగిన నిత్య "అభ్యాస యోగి" – బాలకృష్ణ ప్రసాద్.

ఆత్మీయంగా పలకరించే చూపూ, కుశలం అడిగే చిర్నవ్వూ, అరమరికలులేని కలుపుగోలుతనం, మాటల్లో మెత్తదనం, నడకలో నిదానం, నడతలో పూర్ణత్వం, సుత్తిమెత్తని హాస్యం.. అతని ప్రత్యేకతలు.

1980 ల నాటి మాట. నాకు ఆకాశవాణి జాతీయ పురస్కారాలు వచ్చిన అన్ని సంగీత రూపకాల్లోనూ

బాలకృష్ణ ప్రసాద్ ముఖ్య పాత్రధారి. అతను రికార్డింగులకు వచ్చినప్పుడు బెజవాడలో నా ఆకాశవాణి క్వార్టర్స్ లో – నా వంటతో సహా ఎన్నో విషయాలు చర్చకు వచ్చేవి. అయితే, ఏదో మాటల సందర్భంలో త్యాగరాజ ఆరాధకుడినైన నేను స్వామివారి సాహిత్యం, ప్రయోగాల గురించి మాట్లాడుతుంటే అన్నమాచార్యుల వారి సాహిత్య వైశిష్ట్యం గురించి సవివరంగా చెప్పి నన్ను అన్నమయ్యలోకి నడిపించిన మార్గదర్శి బాలకృష్ణప్రసాద్. నిజానికి అది – అన్నమయ్యలోంచి త్యాగయ్యలోకీ త్యాగరాజస్వామి నుంచి అన్నమాచార్యులవారిలోకీ ఒక ఆధ్యాత్మిక సంగీత, సాహిత్య ప్రయాణం. నా వరకూ అది ఒక సంగీత, సాహిత్య అధ్యయనం. తెలుసుకున్నది ఎక్కువా.. ఆచరించినది తక్కువే అయినా ఆ రోజుల్లో బాలకృష్ణ ప్రసాదుతో గడిపిన అమృతతుల్యమైన ఘడియలు ఎవ్వరూ కొల్లగొట్టలేని నా ఆస్తి.

ఏదో ఒక రాగంలో పాడే పాటకూ.. రచయిత అంతరంగాన్ని శోధించి, సాహిత్యాత్మను ఆవిష్కరించే పాటకూ తేడా ఆ చర్చలవల్లా, అతని పాట వల్లా తెలిసింది. స్వర, రాగ జ్ఞానం – స్వరకర్తకూ, గాయకుడికీ కూడా యెందుకు అవసరమో అవగతమైంది. మోతాదు మించిన శాస్త్ర ప్రకర్ష కర్ణరంజకం, మనోరంజకం కాదనీ బోధపడింది. అలానే, ఈ సంగీత ప్రయాణంలో నా స్థానం, నా నడకా .. నేను ఎక్కడ తడబడుతున్నానో కూడా తెలిసివచ్చింది. ఒక్క మాటలో చెప్పాలంటే – చూపు ప్రసరించడం వేరు .. దృష్టి సారించడం వేరు – అన్నది విశదమైంది.

గత నలభై ఏళ్లలో కొన్ని పురస్కారాలూ, మరికాసిని బిరుదులతో బాలకృష్ణ ప్రసాద్ పాటా, పేరూ తెలుగు రాష్ట్రాల్లోనే కాక ఇతర ప్రాంతాల్లో కూడా వ్యాపించి అతనికి మంచి గుర్తింపు వచ్చింది. ఈ “ఆమని సొబగుల పాట”ను ప్రేమించి “ఏమని పొగడుదుమే !”అనుకున్నవారెందరో.. అతని పాటనీ, పాడే విధానాన్నీ అనుసరించేవారూ, అనుకరించేవారూ మరెందరో.. శిష్యులూ, ప్రశిష్యులూ, గాయనీ గాయకులూ, అభిమానులూ అనేకం.. అయితే, గమనించాల్సింది ఏమిటంటే – ఈనాటికీ అతని అడుగు నేలమీదనే ఉంది.

“ఇలాగే పాడుతూ బతకాలని ఉంది అందుకే పుట్టాలీ .. మళ్ళీ మళ్ళీ” అని బాలకృష్ణ ప్రసాద్ వ్రాసిన లలిత గీతాన్ని శ్రీ పి వి సాయిబాబా స్వరపరచగా – 1974 లో అని జ్ఞాపకం – రవీంద్రభారతిలో తానే పాడాడు. అదేమోగానీ, అతని పాటలు వినడమే కాదు, అతనితో నా స్వర రచనలు పాడించిన నాకు – బాలకృష్ణ పాట వినడానికే “మళ్ళీ మళ్ళీ పుట్టాలి” అనిపించడం – కాస్త అతిశయోక్తిగా ధ్వనించే నిజం.

అసలు, నిజానికి మీరు చదివిందంతా ఉపోద్ఘాతం మాత్రమే. అతని పాట గురించీ, రచనల గురించీ ఇంకా.. వ్రాయాల్సిన విశ్లేషణలూ, చాలా.. చెప్పాల్సిన విషయాలూ ఉన్నాయి. సరే. ఇదే సరిగ్గా వ్రాయలేదేమో అన్న సంశయంతో కూడిన వెలితితో సతమతమవుతున్నా. అందుకే, ఇక ఇక్కడితో ఆపుతున్నా. తప్పదు మరి !

సంగీత నాటక అకాడమీ పురస్కారం ఆలస్యంగానైనా అందుకొంటున్న ఈ “అన్నమయ్య సంకీర్తనోద్యాన విహారికి”.. “తిరునగరి సంచారికి” జేజేలు ! జేజేలు ! జేజేలు !

**– కలగ కృష్ణమోహన్**

[ గేయ రచయిత, స్వరకర్త ]

98495 98983

స్వర్గీయ బాలకృష్ణ ప్రసాద్ గారికి ఆత్మీయ నివాళిగా శ్రీ కలగా కృష్ణ మోహన్ రాసిన ఈ వ్యాసాన్ని తిరిగి అందిస్తున్నాము. ‘సంకీర్తనో ద్యాన విహారి’ నేడు హరిలోక విహారిగా వెళ్లడమే మనకు లోటు.

మనోగతం

# అన్నమయ పదార్చనకు స్వరశోభను అందించిన భాగ్యశాలి శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్

- ముప్పవరపు వెంకయ్యనాయుడు



పదకవితా పితామహుడు అన్నమయ్య సంకీర్తనా స్వర యజ్ఞాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వర్తించిన శ్రీ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారు ఇటీవల పరమపదించిన నేపథ్యంలో శనివారం తిరుపతిలో నిర్వహించిన కార్యక్రమంలో నేను పాల్గొని వారి స్మృతికి నివాళులర్పించాను. ఏ రంగంలో అయినా తమ కృషితో సమాజంపై చెరగని ముద్ర వేసిన వారిని స్మరించుకోవడం సత్ సంప్రదాయం. ఈ సంప్రదాయాన్ని గౌరవిస్తూ జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్– తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ గారి సంస్మరణ కార్యక్రమం నిర్వహించడం మంచి విషయం.

భారతీయ సనాతన ధర్మ ప్రబోధ, సామాజిక సేవ నాకిష్టమైన అంశాల్లో ముఖ్యమైనవి. ఈ రెండూ ఎవరు చేసినా నేను చాలా సంతోషిస్తాను. సనాతన ధర్మ ప్రబోధలో భాగమైన సాధనాల్లో భక్తి సాహిత్యం, భక్తి ఉద్యమం ఉత్కృష్టమైనవి. ఆధ్యాత్మికతకు ముఖ్య సోపానాలుగా నిలిచిన ఈ రెండూ భారతీయ సమాజాన్ని సద్గుణ సంపన్నం చేయడంలో, ప్రపంచంలోని ఇతర దేశాలకు భిన్నమైన సమాజంగా అవతరించడంలో, ధర్మాచరణలో ప్రపంచానికి మార్గసూచీగా నిలవడంలో కీలక భూమిక పోషించినవి.

తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య కీర్తనలు తెలుగునాట భక్తి ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లాయి. అన్నమయ్య హృదయాంతరాళాల నుంచి జాలువారిన 32 వేల కీర్తనలను ఆయన మనవడు రాగిరేకుల మీద రాయిస్తే వాటిలో దాదాపు 15వేలు మాత్రమే చివరకు మిగిలాయి. వాటి గురించి ప్రపంచానికి తెలియడానికి దాదాపు 350 ఏళ్లు పట్టింది. రాగిరేకులపై నిక్షిప్తమైన ఆ అమృతపు పలుకులను అర్థం చేసుకుని సమాజానికి అందించడంలో ఎంతో మంది సాహితీవేత్తలు కృషి చేశారు. అయితే ఆ సాహిత్యాన్ని స్వరరాగ గంగా ప్రవాహ సమానం చేసి, వీనుల విందుగా మలచి, అన్నమయను ప్రతి ఇంటి మనిషిగా చేసిన వారిలో శ్రీ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారు అగ్రస్థానంలో ఉంటారు. అన్నమాచార్యుని అమూల్యమైన ఆ భక్తి సాహిత్యాన్ని తెలుగనాట, ప్రపంచంలో తెలుగు పలికే ప్రతి ఇంటా చేరువ చేశారు.

అన్నమయ్య కీర్తనల్లోని మాధుర్యం మనందరికీ తెలిసిందే. వారి గాత్రం ఎలా ఉంటుందో మనమెవ్వరం వినలేదు. బహుశా శ్రీ బాలకృష్ణ ప్రసాద్ గారిలానే ఉంటుందేమో అని నా వ్యక్తిగత అభిప్రాయం. సంకీర్తనలను స్వరపరచడాన్ని ఓ వృత్తిగా గాక, జీవితాన్నే సంకీర్తనగా మలచుకుని, శ్రీ వారి సేవలో జీవితాన్ని ధన్యం చేసుకున్న భాగ్యశాలి ఆయన. చుట్టుపక్కల ఉన్న గుడిలోంచో, హాల్ లో ఉన్న టీవీలోంచో అన్నమయ్య కీర్తనల రాగాలాపన వినపడుతున్నప్పుడు అప్రయత్నంగా మనమంతా గొంతు కలుపుతున్నామంటే, మనసు అల్లకల్లోలంగా ఉన్నప్పుడు అవే కీర్తనలు మన గుండెల్లోంచి నాలుకపైకి అప్రయత్నంగా వచ్చి రాగంగా మారుతున్నాయంటే ఆ అప్రయత్నం వెనక శ్రీ గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ గారి నిర్విరామ, నిస్వార్థ, ఫలాపేక్షరహిత కృషి ఉంది.

శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ గారి గళం నుంచి జాలువారిన అన్నమయ్య సంకీర్తన స్రవంతిలో తడిసి పులకిస్తున్న శ్రోతలు దేశవిదేశాల్లో లక్షలాదిగా ఉన్నారు. తెలుగునాట వారి ముఖపరిచయం లేని వ్యక్తులు ఉన్నారేమో గానీ, వారి గాత్ర పరిచయం లేనివారు లేరనటం అతిశయోక్తి కాదు. తిరుమల శ్రీనివాసుని కృపతో 16 ఏళ్ళ వయసులోనే అన్నమయ్య సంకీర్తనా స్వర యజ్ఞాన్ని శ్రీ బాలకృష్ణ ప్రసాద్

గారు ప్రారంభించారు. ఓ ఆధ్యాత్మిక యజ్ఞంలా అన్నమయ్య కీర్తనల స్వర రచనను వారు ముందుకు తీసుకుపోయిన తీరు ఆదర్శనీయమైనది. సంపదను చాలా మంది రూపాయల్లో కొలిస్తే, శ్రీ బాలకృష్ణ ప్రసాద్ గారు స్వరాల్లో కొలుచుకున్నారు. అన్నమయ్య సంకీర్తనా ప్రాజెక్టు ద్వారా శ్రీ వారి ఆస్థాన గాయకుడిగా నియమితులై, స్వామివారి సేవలో జీవితాన్ని ధన్యం చేసుకున్నారు.

ఇటీవల వారి ఇంటర్వ్యూ ఒక భాగాన్ని మిత్రులు వాట్సప్ ద్వారా పంపించారు. అందులో వారికి ఇష్టమైన అన్నమయ్య సంకీర్తన గురించి అడిగారు.అన్ని కీర్తనలు ప్రాణప్రదాలే అని చెబుతూ, సామాజిక బాధ్యతను బోధించే "అంతయు నీవే హరి పుండరీకాక్ష" కీర్తన గురించి వారు ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆ కీర్తన గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నదే నా ఆకాంక్ష. శ్రీనివాసుని పట్ల సంపూర్ణ శరణాగతి భావంతో అంతా శ్రీహరే అన్నది ఆ కీర్తన సారాంశం. కులము, కలిమి, తలపు, నెలవు, తనువు, మనికి, వినికి, పుట్టుగు, ముందు వెనుకలు, నట్టనడుమ, చివరకు కొన ఊపిరి కూడా శ్రీహరే అన్నది ఈ కీర్తనలోని భావం. కుల వివక్షలు లేకుండా, అందరిలో భగవంతుణ్ని చూడగలగడమే నిజమైన భక్తి అన్నది ఈ కీర్తన నుంచి మనం గుర్తెరగాల్సిన సారాంశం. అన్నమాచార్య ప్రాజెక్ట్ లో ప్రత్యేక గ్రేడ్ గాయక కళాకారునిగా వారు నిర్వహించిన వేలాది సంగీత కచేరీలు అన్నమయ్య కీర్తనలను ఇంటింటికీ చేరువ చేశాయి. 60 ఏళ్ల సంగీతయాత్రలో ఎన్నో సన్మానాలు, బిరుదులు సహా అన్నమయ్య ఆశీస్సులను, తిరుమల శ్రీనివాసుని కృపను పరిపూర్ణంగా పొందారాయన. ఇంత పేరును సంపాదించుకున్నా, "అంతా శ్రీనివాసుని దయ, నా భాగ్యం తప్ప నాకేం తెలుసండీ..!" అంటూ వినయంగా, సభక్తికంగా చెప్పే వారి భక్తి ప్రపత్తులు ఆదర్శనీయమైనవి. "నారాయణా..! నీ నామమే గతి ఇక / కోరికలు మాకు కొనసాగుటకు" అన్న అన్నమాచార్యుల వారి కీర్తన సంపూర్ణ శరణాగతికి చిహ్నంగా అనిపిస్తుంది. శ్రీ బాలకృష్ణ ప్రసాద్ గారిని వివిధ సందర్భాల్లో నేను అడిగి పాడించుకునే కీర్తన కూడా అదే. వారు సంపూర్ణ శరణాగతి భావంతో ఆ కీర్తన పాడుతుంటే, నా మనసు భక్తి భావంతో ఉప్పొంగి, తెలియకుండానే ఆనంద భాష్పాలు కన్నుల నుంచి జాలు వారేవి. వారు పరమపదించడానికి కొద్ది రోజుల ముందు కూడా నా "పంచ సప్తతి" కార్యక్రమం సందర్భంగా, శుభాకాంక్షలు తెలుపుతూ ఇదే కీర్తన పంపించారు.

అంతటి శరణాగతి భావంతో 16 ఏళ్ళ వయసులోనే అన్నమయ్య సంకీర్తనలతో మమేకమైన ఆయన, ఇటీవల సంగీత యాత్రలో "షష్ట్యబ్ది"ని కూడా పూర్తి చేసుకున్నారు. ఆ సందర్భంలో వారిని అభినందిస్తూ ప్రత్యేకంగా ఉత్తరాన్ని కూడా పంపించాను. ఇంతలోనే వారు శ్రీవారిలో ఐక్యం కావడం ఎంతో మంది అభిమానులకు తీరని లోటు. శ్రీ బాలకృష్ణ ప్రసాద్ గారు అన్నట్లు "అంతా శ్రీనివాసుని లీల". ఇంకెంత కాలం అంటూ శ్రీనివాసుడు తన పదసన్నిధికి వారిని చేర్చుకున్నారు. బతికి ఉండగానే శ్రీనివాసుని కృపను పరిపూర్ణంగా పొందిన శ్రీ బాలకృష్ణ ప్రసాద్ లాంటి వారికి మరణం లేదు. వారి గాత్రం సజీవం, సమున్నతం. వారు జీవితంలో ఏదీ కోరుకోలేదు. సంగీతం పట్ల శ్రద్ధ, శ్రీనివాసుని పట్ల భక్తి ప్రపత్తులు, అన్నమయ్య పట్ల అచంచల గౌరవంతో శ్రీనివాసుని సంకీర్తనా యజ్ఞాన్ని జీవిత పర్యంతం కొనసాగించారు. పేరు ప్రతిష్టల గురించి గానీ, ఇతర అంశాల గురించి గానీ ఆలోచించలేదు. తన పనిని తాను పూర్తి చేసుకుంటూ వెళ్ళారు. దీన్ని ఈతరం యువత ప్రేరణగా తీసుకోవాలి. భగవద్గీతలో చెప్పినట్లు ఫలాపేక్షరహితంగా మన పనులు మనం నిర్వర్తిస్తే... ఫలితం దానంతట అదే వస్తుంది. నేను సైతం వ్యక్తిగతంగా జీవిత పర్యంతం ఇదే ఆచరణకు కట్టుబడ్డాను. శ్రీ బాలకృష్ణ ప్రసాద్ గారు కూడా ఇదే మార్గంలో ముందుకు సాగారు. ఈ సందర్భంగా శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ గారి కుమారుడు చిరంజీవి అనిల్ కుమార్ గురించి కూడా చెప్పాలి. ఉన్నత చదువులు చదివి సాఫ్ట్వేర్ రంగంలో మంచి ఉద్యోగం చేస్తూ కూడా తండ్రి బాటలో నడవడం, అన్నమయ్య సాహిత్యానికి స్వరార్చన చేయడం మంచి విషయం, అభినందనీయం. గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ గారి సంస్మరణ కార్యక్రమంలో చిరంజీవి అనిల్ కుమార్ అన్నమాచార్య కీర్తనలు అద్భుతంగా ఆలపించి ఒక కుమారుడిగా, శిష్యుడిగా ఆయనకు ఘనమైన నివాళులు అర్పించారు. తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు.

శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ గారి స్మృతికి మరోసారి నివాళులు అర్పిస్తూ, వారి స్ఫూర్తితో యువతరం తమ జీవితాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

**'గానకళ' వారికి నివాళులర్పిస్తున్నది.**

# సంగీత సభల కార్యకలాపములు - 'విహారి'

## సరస్వతీ గానసభ, కాకినాడ



సరస్వతీ గానసభ, కాకినాడ వారి నిర్వహణలో చిరంజీవి శ్రీకరి గంగుమళ్ళ (USA) భరత నాట్య ప్రదర్శన 02-01-2025, గురువారం కాకినాడ సూర్యకళామందిరంలో రస ప్లావితంగా జరిగింది. వయస్సు పదకొండు సంవత్సరాలే అయినా నర్తకిలో పరిణితి కనబడ్డది.

తొలుత 'పుష్పాంజలి' ఆ తరువాత 'గురుస్తుతి' తో నృత్య ప్రదర్శన ప్రారంభమయింది. గంభీరనాటలోని పుష్పాంజలిలో ఆ నటరాజస్వామిని పుష్పాలతో పూజించి, తరువాత ఈ భూమాతకు, గురు పరంపరకు, ఆచార్యవర్యులకు, సభాసదులైన ప్రేక్షకులకు శ్రద్ధాభక్తులతో నమస్కరించి అనుమతి బడసింది.

మంగళాదీని మంగళ మధ్యాని, మంగళాంతాని అన్న సూక్తి ననుసరించి నాట్య ప్రదర్శనను మంగళ శ్లోకాలతో ఆరంభించినది.

విశ్వవ్యాపితమైన ఏ దివ్యశక్తి ఈ పవిత్ర గమనంలో ప్రచోదితమై వుందో, ఆ శక్తికి ప్రణతులర్పించడమే గురుస్తుతి.

ఒక శిష్యుని జీవితంలో గురుదేవుని పాత్ర ఎంతటిదో తెలియజేసే శ్లోకాలు ఈ స్తుతిలో వినిపించి, గురువంటే.. తన శిష్యులలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి, ఉత్తమ సంస్కారాలనూ, జ్ఞానాన్నీ నింపేవాడని తెలియజెప్పింది.

**రెండవ అంశంగా**

'నర్తన గణపతి' (రాగం: మోహన, తాళం: ఆది.)లో గణపతి ... తనని కొలిచే భక్తులకు ఆశీస్సులందిస్తూ వారి కోర్కెలు నెరవేర్చే భక్త సులభుడు. ఆయన దేవదేవునిగా కొనియాడబడే దివ్య సుందరమూర్తి. అగస్త్యుని ఉద్ధరించిన అపార దయాగుణ సంపన్నులు.

విశ్వజనని కుమారులైన వీరు.. యోగుల ఆదిగురువు. మూలాధార చక్రంలో ఉంటూ వారి ధ్యానాన్ని స్వీకరించే ప్రథమ దైవతము. తన సోదరుడైన సుబ్రహ్మణ్యస్వామికి తమ దీవెనలను అందించారు వంటి అంశాలు ప్రదర్శించారు.

'అలరులు కురియగ'.... అన్నమాచార్యుల కీర్తనలో అన్నమాచార్యులు అలమేలుమంగమ్మ వారిని దివ్యలోక నాట్యాధిదేవతగా సంభావించారు. వేంకటేశునితో కూడిన ఆమె అత్యంత సౌందర్యవతి. తన రూప లావణ్య కళా విలాసాలతో ఆయనను సమ్మోహ పరచగల శక్తి కలిగినది.

శ్రీవారు తన్మయత్వం నిండిన చూపులతో ఆమె నాట్య విన్యాసాలను వీక్షిస్తారు. "సౌందర్య జలపాతంలో నర్తిస్తున్న ఆమెపై దేవతలు పూల వర్షం కురిపిస్తున్నారు", అంటారు అన్న భావన ఆమె తన అభినయాన రక్తి కట్టించింది.

**తదుపరి అంశంగా**

'శంభో మహాదేవ' . రాగం: పంతువరాళి, తాళం: రూపకం, ఈ కృతిలో త్యాగరాజులవారు శివ పార్వతులను వివిధ రకాలుగా ప్రార్థిస్తారు.

ప్రభో శంభూ! ఓ మహాదేవా! ఓ శుభంకరా! శరణాగత రక్షకా! ఓ పార్వతీ మాతా! ఓ పద్మనేత్రీ! అపార కరుణాసాగరా! ఓ పరమ శివా! జీవజాలన్నంతటినీ రక్షించే శక్తికి ప్రతీకగా ఒక చేతిలో జింకను పట్టుకుని వినోదించే ఓ హరా! సిగలో గంగను ధరించినవాడా! మెడలో శేష నాగును అలంకారముగా చేసికొన్నవాడా! త్యాగరాజ హృదయమందు నెలకొన్నవాడా! దేవతల కిరీటములందలి మణుల కాంతులచే ప్రకాశించెడు పాదములు కలిగిన ఓ కోవూరు సుందరేశా! ఓ కైలాసవాసా! అనంతుడా! ఇలా సాగే వర్ణన అందించింది. మధురా నగరిలో.. రాగం: ఆనంద భైరవి, తాళం: ఆది, రచన: చిత్తూరు సుబ్రహ్మణ్య పిళ్ళై.

భరతనాట్యంలోని సొగసులను లోతుగా తెలియజేసే ఓ గొప్ప అంశం... పదం. అంటే, ప్రేమనీ, మనోరంజిత కేళీ విలాసాన్ని గాఢంగా వ్యక్తపరిచే ఒక ప్రక్రియ. "ఓ కృష్ణా! నేను మధురా నగరానికి చల్ల అమ్ముకోవడానికి పోతున్నాను. నన్ను వెళ్లనీ. నలుగురూ నడిచే ఈ రహదారిలో నన్ను గేలి సేయకు. నన్ను చూసి మిగిలిన గోపికలు నవ్వుతారు. దయచేసి నా చేయి విడిచిపెట్టు కృష్ణా! అన్న భావ వ్యక్తీకరణ స్ఫోటకమైంది. తిల్లానా... రాగం: పూర్వీ, తాళం: రూపకం, రచన: గోకర్ణం విద్యానాథ భాగవతార్ భరతనాట్య ప్రదర్శనకు అందమైన ముగింపు పలుకుతూ, వడి గల గతులతో సాగే అంశం..

మన ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాభవాన్ని చాటిచెప్పే అద్భుత ప్రక్రియ. ఇది కేవలం వేదిక మీద చేసే ప్రదర్శన మాత్రమే కాక భారతీయ కళలలో నిక్షిప్తమై వున్న గొప్ప వారసత్వ సంపదనీ, తాత్త్వికతనీ వెల్లడిచేసే మహోన్నత కళారూపం. తిల్లానా అనే అంశం... సంగీతం, నృత్యం మరియు అధ్యాత్మ విద్యల త్రివేణీ సంగమం. వీక్షించే ప్రేక్షకులకు, ప్రదర్శించే కళాకారులకు ఓ గొప్ప అనుభూతిని, అనుభవాన్నీ అందిస్తుంది. అది సభికులకు లభించింది. చివరగామంగళం నవరోజ్ రాగంలో భద్రాచల రామదాసు రచన కళాకారిణి విదేశాల్లో వున్నా ఈ సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకొని ప్రదర్శించిన తీరు ముచ్చట గొలిపింది. సభికులందరూ ఆశీస్సులందజేశారు. వారి తల్లిదండ్రులను అభినందించారు.

## శ్రీరంగ గిరి మౌలాలి హైదరాబాద్ లో "గోదా సమ్మోహనం" 6-1-2025 న డా॥ శ్రీమతి వై. రమాప్రభ మనోహరంగా నిర్వహించారు.







## సాంస్కృతిక సందడి - రాజమహేంద్రవరం



గాత్ర కచేరీ చేస్తున్న ప్రణతి

శ్రీసద్గురు సన్నిధి సాంస్కృతిక సేవా సమితి నెలవారీ శాస్త్రీయ సంగీత నృత్య సభలో కార్యక్రమాలు అలరించాయి. ఆదివారం సాయంత్రం గోదావరిగట్టున ఉన్న శ్రీత్యాగరాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా చెన్నైకు చెందిన గణపురం ప్రణతి గాత్ర కచేరీ జరిగింది. అనం తరం నాట్యాచారిణి స్నేహ జాన కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.



నృత్య ప్రదర్శనతో స్నేహ జాన

**31-12-2024,** మంగళవారం సాయంత్రం ముక్కోటి ఏకాదశి ఉత్సవాలలో భాగంగా శ్రీ భాగినారాయణ శాస్త్రి కచేరి భద్రాచలం శ్రీ రామాలయం ఆస్థాన మండపంలో జరిగింది.



# భక్తిశ్రద్ధలతో సద్గురు త్యాగరాజస్వామి 178వ ఆరాధన ఆదిభట్ల నారాయణదాసు 80వ స్మరణోత్సవం



ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, విజయనగరం 689వ కార్యక్రమం సద్గురు త్యాగరాజస్వామి 178వ ఆరాధన ఆదిభట్ల నారాయణదాసు 80వ స్మరణోత్సవం రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ సంయుక్తంగా కొత్తపేట మండపం వద్ద గల సంస్థ కార్యాలయం ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో 8వ తేదీ ఉదయం నుండి రాత్రి వరకు నిర్వహించారు. ముందుగా శ్రీ పైడితల్లి అమ్మవారి కోవెల నుండి అంబటి సత్రం మీదుగా వేదికవద్దకు త్యాగరాజ, నారాయణదాసుల చిత్రపటాలతో జమ్ము అప్పన్న బృందం నాదస్వర చే ప్రఖ్యాత సీనియర్ వేణుగాన విద్వాంసులు మోడెకుర్తి వెంకట కామేశ్వర రావు త్యాగరాజ ప్రత్యేక వేషధారణతో తిరువీధి ఉత్సవం జరిగింది. అనంతరం శ్రీరామ సేవాసమితి వారు గతంలో సమర్పించిన త్యాగరాజ ఉత్సవ మూర్తికి మంగిపూడి శంకర్ శర్మ అర్చకత్వంలో పంచామృత అభిషేకం పూజాకార్యక్రమాలతో ఘనారాగ పంచరత్న కృతులలో గాన నీరాజనం విశేషంగా జరిగింది. ఇందులో భాగవతుల వంశీకృష్ణ, నిరుపమ, కరుణ, మేడూరి లక్ష్మి, రాఘవన్ తిరుమల శారదాద్వయం, సుభద్ర, అనన్య డాక్టర్ మండపాక రవి, సునీత తదితరులు కచేరీలు చేయగా వీరికి వయొలిన్ పై నీలాద్రి, రామచరణ్, భానూహర్ష, మృదంగం పై వి.అప్పలస్వామి, ఏడుకొండలు, మహేశ్వర రావు, శివకుమార్, శ్రీనివాస్,వంగల ఆచారి, సుధాకర్ లు సంస్థ అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు, ,కోశాధికారి దన్వాడ సుధాకర్, డాక్టర్ కె.ఎ.పద్మప్రియ, పంచరత్నాల్లో పాల్గొన్న విద్వాంసులను సత్కరించారు. సాయంత్రం ప్రముఖ విద్వాంసులు పి.చిన్న గాత్ర కచేరీ అందరినీ అలరించింది. మహదాసు శ్యామ్ నీలాద్రి వయొలిన్ పైన డాక్టర్ మండపాక రవి మృదంగంపై ధీటుగా సహకరించారు. సంస్థ అధ్యక్షులు సర్వేశ్వర రావు, డాక్టర్ ఎ .గోపాలరావు, పద్మప్రియ, భాస్కరరావు, సునీత, భానుమతి, పద్మావతీ శారద, సుధాకర్, కాంభట్ల శ్రీధర్ ఇతర సభ్యులు సంగీతాభిమానులు, విద్వాంసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్వాంసులను, హరికథలు సంబంధించి కాళ్ళ నిర్మల భాగవతారిణిని సత్కరించారు. గోపాలరావు మాట్లాడుతూ ఆదిభట్ల, త్యాగయ్యల ఈ పరంపర ఇలా కొనసాగడం ఎంతో ఆనందదాయకంగా ఉందని అన్నారు....



**గానకళ ప్రత్యేక ప్రతినిధి**

# శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం వేములవాడ



శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తేది 18/01/2025 నుండి 22/01/2025 వరకు జరిగిన త్యాగరాజ స్వామి ఉత్సవాలలో భాగంగా 20/01/2025న వేములవాడ కు చెందిన శ్రీ పొలస వినయ్ కృష్ణ వయోలిన్ సోలో కచేరి ఆలయ భక్తులను ఎంతో ఆకట్టుకుంది:

కార్యక్రమంలో భాగంగా :మోహన రాగ వర్ణం నిన్ను కోరి గజాననయుతం-చక్రవాక రాగం-ఆది తాళం-ముత్తుస్వామి దీక్షితర్ రఘునాయక-హంసధ్వని సాధించెనే - ఆరభి, రఘుపతిరాఘవ-లక్ష్మణ చార్య శ్రీ రాజేశం మృదంగం పై ప్రక్క వాద్యసహకారం చేశారు. అనంతరం కార్యక్రమ నిర్వహకులు శ్రీ K.రామయ్య శర్మ, శ్రీ K శ్రీనివాస్ కళాకారులను సత్కరించారు.

# త్యాగరాజ స్వామి వారి 178 వ ఆరాధన మరియు విద్యాలయ 69 వ వార్షికోత్సవం, అంబర్ పేట

జనవరి 18 వ తేదీ శనివారం సాయంత్రం 5.30 నుండి శ్రీ సాయి బాబా మందిరంలో త్యాగరాజ స్వామి వారి 178 వ ఆరాధన మరియు విద్యాలయ 69 వ వార్షికోత్సవం జరిగింది.

ముఖ్య అతిధి: శ్రీమతి శోభా శంకర్ గారు. (బుల్లితెర దర్శక నిర్మాత), మల్లాది శాంతామూర్తి గారు (వీణా విద్వాంసురాలు)

**కార్యక్రమాలు:**

1. ప్రార్థన. 2.ఉత్సవ సాంప్రదాయ కీర్తనల గానం.:- హిరణ్య, భావన, హితాంష్, సూర్య తేజ, దివిజ, శ్రీ విద్య, శ్రీకర్, విదీష,సాయి, చేతన్ శర్మ, గాయత్రి, శ్రావణి, ప్రణీత, సాయి శ్రేయాస్, తేహిత, అభిగ్న.

3. పంచరత్న కీర్తనల గానం:: పంచశత వీణా గాన రత్న పోఫూరి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో :: యశస్విని,వాసుకీదేవి, అరుణ శ్రీ, విజయ్ కృష్ణ, రఘురాం తదితరులు.

వైలెన్: అచ్యుతకుమారి. మృదంగం: పి.దుర్గ కుమార్

ఉత్సవ సాంప్రదాయ కీర్తనలు, కరుణా జలధే, నాపాలి శ్రీరామ, రామ రామ నీ వారము, శ్రీరామ జయరామ కీర్తనలు, స్వామి వారి అష్టోత్తరం చివరిగ పంచరత్న కీర్తనల గానం జరిగింది.



# సంగీత లహరి, రాజమహేంద్రవరం - 14 వ వార్షికోత్సవ వేడుకలు

ప్రతి నెల సంగీత సభలను నిర్వహిస్తున్న ఏకైక సంస్థ సంగీత లహరి వార్షికోత్సవ వేడుకలు జనవరి 24, నుండి 26 వరకు 3 రోజల పాటు వీనుల విందుగ జరిగాయి.

మొదటి రోజు రాజమహేంద్రవరం సంగీత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ కరివేటి వెంకటేశ్వర్లు నాదస్వర కచేరి వినసొంపైన రీతిలో జరిగింది. వీరికి సహకార నాదస్వరం శ్రీ కల్లూరి జయకుమార్, (పిఠాపురం దేవస్థానం నాదస్వర విద్వాంసులు) అందించారు.

కల్యాణి రాగ వర్ణం తో కచ్చేరి ప్రారంభించి'శశి వదన' అనే చంద్రజ్యోతి రాగ అపురూప కీర్తనను, "వందే వాసుదేవం"సామ రాగ అన్నమయ కీర్తన, ఆరభి పంచరత్న కీర్తనతో సభను రంజింప చేసారు. తరువాత "నిను వినా" నవరస కన్నడ కీర్తనను మంచి కాల ప్రమాణం లో వాయించారు. ముఖ్యాంశం గా ధర్మవతి రాగం ఆలపించి "ఓడోడి వందేన్" అనే అంబుజం కృష్ణన్ గారి తమిళ్ కీర్తనను ,దానిలో స్వరప్రస్థారం దీటైన రీతిలో వాయించారు. డోలు పై రాజమండ్రి సంగీత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ ఏడిద సత్యనారాయణ మరియు హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీ టి. శివనారాయణ సహకరించారు.వారి తని ఆవర్తనం ప్రతిభావంతంగా సాగింది. సుమారు 4 గం లపాటు జరిగిన ఈ కచ్చేరి శ్రోతలు పెద్ద సంఖ్యలో హాజరు అయ్యి చివరి వరకు విన్నారు. చాలా కాలం తరువాత రాజమండ్రి లో మంచి నాదస్వర కచ్చేరి ఏర్పాటు చేసిన కమిటీ వారికి అభినందనలు తెలియ చేసారు.

రెండవ రోజు కార్యక్రమం గా విశాఖ వాస్తవ్యులు శ్రీ ప్రాతా కృష్ణమూర్తి గాత్ర కచేరీకి వయొలిన్ పై హెచ్. రాంచరణ్, మృదంగం పై యోగేశ్ మరియు కంజీర పై రామవరపు సహదేవుడు సహకరించారు. కానడ అట తాళ వర్ణం తో కచేరి ప్రారంభించి, "ఇలలో" అనే త్యాగరాయ కీర్తన, ఉప ముఖ్యాంశం గా వరాళి రాగం లో 'శేషాచల నాయకం' అనే రూపక తాళ కీర్తనను ఆలపించి అతీతం లో 3 అక్షరాలు జాగాతో 'అరవింద పత్ర నయనం' అనే చోట స్వరప్రస్తారం చేసి శభాష్ అనిపించుకున్నారు. తరువాత ముఖ్యాంశం గా 'శ్రీరంజని' రాగం విస్తారం గా పాడి 'మారుబలక కున్నావేమిరా' అనే త్యాగరాజ కీర్తన జనరంజకం గా ఆలపించి మంచి మంచి విన్యాసాలతో స్వరప్రస్తారం చేసి శ్రోతలను అలరించారు. శ్రీ రాంచరణ్ వినిపించిన వరాళి, శ్రీరంజని ఆలాపనలు, మరియు స్వరప్రస్తారం లో వారు చేసిన విన్యాసాలు ప్రతిభ కు మచ్చు తునకలు. సర్వశ్రీ యోగీశ్,సహదేవుడు ల సహకారం, తని సమర్పణ ప్రతిభా ద్యోతకాలు.

చివరి రోజు ఉదయం 6 గం లకు నగర సంకీర్తన తో ప్రారంభమైన త్యాగరాజ ఆరాధన రాత్రి 9 గంటల వరకు నిర్విరామంగా జరిగింది. రాజమహేంద్రవరం లో ఉన్న చాలా మంది కళాకారులు ఈ ఆరాధనలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఉదయం 10 గం నుండి 11 వరకు స్థానిక కళాకారులచే పంచరత్న సేవ జరిగింది. పాల్గొన్న కళాకారులందరికి కమిటీ వారు ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజనం సాయంత్రం తేనీరు ఏర్పాటు చేసారు. సరిగ్గా 9 గం లకు ఆంజనేయ ఉత్సవం తో ఆరాధన కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది.

పాల్గొన్న బాల కళాకారులలో అద్భుత ప్రదర్శన చేసిన చి. కొచెర్లకోట విద్య కార్తీక కు ప్రఖ్యాత మృదంగం విద్వాంసులు కీ. శే. శ్రీ కమలాకర రావు గారి జ్ఞాపకార్థం గా బహుమతి అందజేయ బడింది, అలాగే కీ బోర్డు మరియు మృదంగం పై సహకరించిన కూరెళ్ళ కార్తికేయ కు వీణ విద్వాంసులు శ్రీ అయ్యగారి సత్యప్రసాద్ బహుమతి అందచేసారు.

# 'సంప్రదాయ' సంకీర్తనోత్సవం, హైదరాబాద్ దృశ్యమాలిక

**(28-12-2024 నుండి 12-01-2025 వరకు)**



నృత్య సంకీర్తన : JS ఈశ్వర ప్రసాద్ భాగవతార్ మరియు బృందం



వీణా కచేరీ : డి శ్రీనివాస్, వయోలిన్ : కెవి కృష్ణ, మృదంగం : పారుపల్లి ఫాల్గుణ్, ఘటం : ఎస్ కార్తీక్



గానం : మల్లాది బ్రదర్స్, వయోలిన్ : ఎంబార్ కన్నన్, మృదంగం : మల్లాది శివానంద్, ఘటం : చంద్రకాంత్



గానం : విఘ్నేష్ ఈశ్వర్, వయోలిన్ : కమలాకిరణ్, మృదంగం : ఢిల్లీ సాయిరామ్, ఘటం : ఎం హరిబాబు



నామసంకీర్తన : JS శ్రీరామ్ అండ్ టీమ్



నామసంకీర్తన : ముంబై సుందర రామన్ భాగవతార్ మరియు బృందం



నామసంకీర్తన : సవితా శ్రీరామ్ అండ్ టీమ్



గానం : మల్లాది శివానంద్, వయోలిన్ : మల్లాది సింధు రాగేశ్వరి, మృదంగం : రామకృష్ణ, ఘటం : రోహిత్ ప్రసాద్



గానం : అపర్ణ, వయోలిన్ : కృతిక్ కౌశిక్,
మృదంగం : కార్తికేయ



గానం : అరుణిమ, వీణ : మధురిమ





గానం : TM కృష్ణ, వయోలిన్ : HN భాస్కర్, మృదంగం : సుమేష్ నారాయణన్, ఘటం : హరిబాబు



గానం : శ్రీరామ్ జొన్నలగడ్డ, వయోలిన్ : బి అనంతకృష్ణన్, మృదంగం : విజయ్ గణేష్, ఘటం : ఎం హరిబాబు



గానం : అనఘ, వయోలిన్ : కౌండిన్య,
మృదంగం : కృష్ణ వంశీ



గానం : విష్ణుప్రియ, వయోలిన్ : వాసు శాస్త్రి,
మృదంగం : కృష్ణ వంశీ, ఘటం : రోహిత్ ప్రసాద్



గానం : మాలిని & మోదిని, వయోలిన్ : శ్రీకర్,
మృదంగం : కృష్ణ వంశీ



హరికథ : MV సింహాచల శాస్త్రి మరియు బృందం




గానం : సాయి శ్రావణి, వయోలిన్ : శ్రీకర్,
మృదంగం : భార్గవ్




గానం : దుర్గా సాహితీ, వయోలిన్ : శ్రీవత్స,
మృదంగం : లక్ష్మీ అజయ్




హిందుస్తానీ కచేరీ, గాత్రం : శ్రీదేవి, హార్మోనియం : హర్షిత్,
తబలా : కృష్ణ కుమార్



గానం : ఆర్ ఎస్ కౌస్తుభ, వయోలిన్ : వాసు శాస్త్రి,
మృదంగం : కృష్ణ వంశీ, ఘటం : రోహిత్ ప్రసాద్



నామసంకీర్తన : స్వరభంగిమ విద్యార్థులు



వయోలిన్ కచేరీ : లాల్గుడి జిజెఆర్ కృష్ణన్, మృదంగం :
అరవింద్ రంగనాథన్, ఘటం : హనుమంత రావు



గానం: డివి మోహనకృష్ణ, వయోలిన్: VSPG శివాని,
మృదంగం : కెసద్గురుచరణ్, ఘటం : ఎం చంద్రకాంత్




గానం: అలేఖ కొమ్మజోస్యుల, వయోలిన్: కృతిక్ కౌశిక్,
మృదంగం : కార్తికేయ ది నారాయణ శర్మ

# శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవములు - 2025

కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలంలోని ముంగండ గ్రామములో ది. 18.01.2025 నుండి ది. 20.01.2025 తేదీ వరకు 3 రోజుల పర్యంతం శ్రీ చింతామణి గణపతి మందిరములో 49వ శ్రీత్యాగరాజ ఆరాధనోత్సవములు అత్యంత భక్తి శ్రద్ధలతో, ఘనంగా నిర్వహించినారు.



ది. 18.01.2025 తేదీన పుష్య బహుళ పంచమినాడు గ్రామంలో శ్రీత్యాగరాజ స్వామి, శ్రీరామచంద్ర మూర్తులతో భవ్యమైన ఊరేగింపు జరిగినది. అందు మంగళ వాయిద్యాలు, గాయనీమణులు ఉత్సవ సాంప్రదాయ కీర్తనలు ఆలాపించినారు. అనంతరం శ్రీత్యాగరాజ, శ్రీరామచంద్రమూర్తులకు సహస్రనామ పూజ జరిగినది. అనంతరం శ్రీత్యాగరాజ విరచిత పంచరత్న కీర్తనల గానములో శ్రీమతి పిన్నింటి అన్నపూర్ణ వారి శిష్య బృందం పాల్గొనినారు. వీరికి రాత్రి సంగీతసభను చేయవలసిన విద్వాంసులు సహకార వాద్యాలతో సహకరించినారు.

రాత్రి పూజ అనంతరము శ్రీ మల్లెల కాంతిస్వరూప్ గాత్ర సంగీతసభ ఆద్యంతం వీనుల విందుగా జరిగి రసజ్ఞుల మన్ననలందుకొన్నది. అసావేరీ రాగవర్ణంతో ప్రారంభించిరి. త్యాగరాజస్వామివారి కృతి నాగస్వరావళిరాగంలో, షణ్ముఖప్రియ – సిద్ధివినాయకం, యదుకుల కాంభోజరాగం – కామాక్షి – చిత్తరంజని రాగం – నాదతనుమనిశం – శంకరాభరణరాగం – ''ఎందుకు పెద్దల'' మొదలగు పలు కీర్తనలు చక్కగా పాడినారు. వీరికి వయొలిన్‌పై శ్రీ పి.నందకుమార్, మృదంగంపై శ్రీ పి.జయభాస్కర్, ఘటంపై శ్రీ బి.ఎన్.కె.మారుతీ రఘురామ్ సహకరించారు.



ది. 19.01.2025 తేదీ రాత్రి పూజ అనంతరం ప్రొ. శ్రీమతి కోరాడ శేషులతగారి గాత్ర సంగీతసభ జరిగినది. వీరికి శ్రీమతి డి.దుర్గాభవాని గారు (వయొలిన్), శ్రీ కె.సద్గురుచరణ్ గారు (మృదంగం), శ్రీ ఎస్.హనుమంతరావు గారు (ఘటం) పై సహకరించారు. వసంతరాగ వర్ణంతో సభను ప్రారంభించినారు. సరస్వతి రాగంలోని శ్రీత్యాగరాజకృతి – అనురాగములేని, కల్యాణవసంత రాగం – నాదలోలుడై – ఆరభిరాగంలో – సుదతులార – శ్రీత్యాగరాజస్వామివారి శ్రీరంగ

పంచరత్న కీర్తన – ఆనందభైరవి – కమలాంబా –కల్యాణిరాగం – ఏతావున మొదలగు చక్కటి రచనలతో సభను అలరించారు.



ది. 20.01.2025 తేదీనాటి రాత్రి శ్రీమతి వెన్నెలకంటి అపర్ణగారి గాత్రసంగీత సభ విశేష ప్రశంసలతో జరిగినది. శ్రీత్యాగరాజస్వామివారి కీర్తన హంసధ్వని రాగంలో, సరస్వతిరాగంలో సరస్వతీ నమోస్తుతే – హిందోళరాగంలో – గోవర్ధనాధీశం –కదనకుతూహల రాగం – పంతువరాళి – రఘువరా – యమునాకళ్యాణి – హరిదాసులు వెడలె తదితర చక్కని కీర్తనలను హృద్యంగా ఆలపించి రసజ్ఞుల ప్రశంసలను అందుకున్నారు. వీరికి వయొలిన్‌పై శ్రీమతి బి.వి. దుర్గాభవాని గారు, మృదంగంపై శ్రీ కె. సద్గురుచరణ్ గారు, ఘటంపై శ్రీ బి.దుర్గా శీనివాస శర్మగారు సహకరించినారు.

**నడిమింటి నాగరాజారావు,**

శ్రీ త్యాగరాజ ఆరాధన సమితి, ముంగండ.

## విశాఖ మ్యూజిక్ అకాడెమి లో సిద్ శ్రీరామ్ గాత్రసంగీతసభ



విశాఖ మ్యూజిక్ అకాడెమి నూతన సంవత్సరం 2025లో తమ మొదటి నెలవారీ సంగీతసభను 11.01.2025 నాటి సాయంత్రం చెన్నయికు చెందిన ప్రఖ్యాత కర్ణాటక సంగీత విద్వాంసులు శ్రీ సిద్ శ్రీరామ్ గారి వీనులవిందైన గానంతో ఆరంభించింది. స్థానిక నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ ప్రాయోజకతనందించగా వుడా చిల్డ్రన్ థియేటర్ లో హాలు నిండిన ప్రేక్షకుల మధ్య జరిగిన ఈ సభ మూడుగంటల కాలం రసజ్ఞులను సంగీతప్రవాహంలో ఓలలాడించింది. "ముదాకరాత్తమోదకం" అంటూ శ్రీ వి.యస్.యన్. మూర్తిగారి ప్రార్థన పూర్వక ఆహ్వానానంతరం కళాకారుల పరిచయం చేయగా,అకాడమి అధ్యక్షులు శ్రీ కె.వి.రామ్మూర్తిగారు కళాకారులను, ప్రాయోజకులను, అతిథులను, రసజ్ఞులను ఆహ్వానిస్తూ తన ఆనందాన్ని వ్యక్తపరిచారు. అనంతరం ప్రాయోజకత నందించిన నవయుగ ఇంజనీరింగ్ ఛైర్మన్ శ్రీసి.వి.రావు గారు కళాకారులను శాలువా, ఫలములతో సత్కరించారు. అకాడమి కార్యవర్గం సి.వి.రావు గారికి కృతజ్ఞతా పూర్వకంగా చిరు సన్మానం జరిపాక శ్రీ సిద్ శ్రీరామ్ గానం మొదలైంది.

అనంతరం "వక్రతుండ మహాకాయ" అంటూ ప్రార్థనచేసి తోడిరాగ వర్ణంతో ఆరంభిస్తూ, ఆ అంశంలోనే స్వరకల్పనలతో తన కచేరీ ఎలా సాగబోతోందో సూచనప్రాయంగా తెలిపారు సిద్ శ్రీరామ్ . నాసికాభూషణి రాగంలో "మారవైరిరమణ", బహుదారి రాగంలో అందరికీ సుపరిచితమైన "బ్రోవభారమా", పంతువరాళి రాగంలో "శంకరి నిన్నే" కీర్తనలను స్వల్ప రాగాలాపన, స్వరకల్పనలతో వినిపించి శ్రోతలను అలరించారు. తరువాత గానం చేసిన నళినకాంతి రాగంలో "మనవి ఆలకించ", అభేరి రాగంలో "నగుమోము"రచనలుకూడా ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా పాడడంతో కరతాళ ధ్వనులతో హాలు మారుమ్రోగింది. భవప్రియ రాగంలో అరుదుగా వినే "శ్రీకాంత నీయెడ", కీర్తన గానంచేసి ముఖ్యాంశంగా కాంభోజి రాగంలో "మా జానకి" కీర్తనలో తన సంగీత జ్ఞానాన్ని ప్రదర్శించారు. తరువాత వరుసగా సింధుభైరవిలో "గంగాధీశ్వరం", హంసానందిలో "శ్రీనివాస తిరువేంకట", ఖమాస్ లో "మరుబారి" జావళి, కాపీలో "జగదోద్ధారణ", "WESTERN NOTE", స్వరపల్లవి, జోన్పురీలో "సాపస్యా కౌసల్యా" రచనలను ఒక రసప్రవాహంలో వినిపించి సభలో రసజ్ఞులందరినుండి సిద్ శ్రీరామ్ STANDING OVATION అందుకోవడం విశేషం. ఇక ఈ మధురమైన గానాన్ని "మధురాతిమధురం" చేయడంలో సహకారమందించిన వాయులీన విద్వాంసులు శ్రీ హెచ్.ఎన్.భాస్కర్, మృదంగం విద్వాంసులు డా. పత్రి సతీశ్ కుమార్, కంజీరా విద్వాంసులు శ్రీ వి.అనిరుధ్ ఆత్రేయ గారల విద్వత్ప్రదర్శన ఎంతగానో దోహదం చేసిందని వారివారి వాద్యప్రదర్శన అనంతరం మిన్నుముట్టిన కరతాళధ్వనులేచెప్పాయి.రాగాలాపనస్వరకల్పనలో శ్రీ భాస్కర్ ఏ ఒక్క అవకాశం వదలకుండా విస్తృతమైన తన జ్ఞానపరిధిని చూపించారు. అలాగే శ్రీ పత్రి సతీశ్ తన సహజసిద్ధమైన ముందుచూపుతో స్వరముక్తాయిలను అందుకుంటూ లలితంగా ఒకమారు గంభీరంగా మరొకమారు సందర్భోచితంగా నాదానుసంధానం చేస్తూ, మంచి లయవిన్యాసంతో తనకు తానే సాటి అని చాటారు. శ్రీ అనిరుధ్ ఆత్రేయ చేతికి "పదివేళ్లున్నాయా" అని ఆశ్చర్యపోయేలా కంజీరాను పలికిస్తూ, మృదంగనాదానికి దీటైన రీతిలో స్పందించారు.

విశాఖ వాసులకు ఒక మరచిపోలేని అనుభూతి కలిగించిన సభపై ముచ్చటగా తమిళం తెలుగు ఆంగ్లం లో మూడుభాషలలో అర్థం వివరిస్తూచేసిన డా. పేరాల బాలమురళీకృష్ణ గారి విశ్లేషణ కూడా మరచిపోలేని రీతిలో సాగింది. అధికసంఖ్యలో హాజరైన ప్రేక్షకులకు, ధన్యవాదాలు సమర్పించడంతో సభ ముగిసింది. అకాడమీ ఎమిరటస్ కార్యదర్శి శ్రీ యమ్మెస్ శ్రీనివాస్ తలపెట్టి రూపకల్పన చేయగా కార్యవర్గ సభ్యులు అందరూ అహోరాత్రులు చేసిన శ్రమకు మంచిఫలితం కలిగిందన్న తృప్తి కలిగింది.

**వియెస్సెన్మూర్తి**

విశాఖ మ్యూజిక్ అకాడెమి.

# శ్రీ సద్గురు సంగీత విద్వత్ గానసభ 4వ వార్షికోత్సవం

శ్రీ సద్గురు సంగీత విద్వత్ గానసభ 4వ వార్షికోత్సవం సందర్భంగా శ్రీ త్యాగరాజస్వామి ఆరాధనోత్సవము తేది:26-1-2025 నాడు ఆక్స్ ఫర్డ్ హైస్కూల్, హనుమకొండ లో అత్యంత వైభవంగా జరిగింది.ప్రముఖ సంగీత విద్వాంసులు, గురువర్యులు శ్రీ వైద్యనాధన్ బాలసుబ్రహ్మణ్యన్ గారి ఆధ్వర్యములో జ్యోతిప్రజ్వలనతో ఈ సంగీత కార్యక్రమము ప్రారంభమైనది వరంగల్ లోని సంగీత కళాకారులందరు ఈ కార్యక్రమములో ఉత్సాహంగా పాల్గొన్నారు ఆక్స్ ఫర్డ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీ పర్లపల్లి వెంకటరమణ గారు, సంగీత గారు వారి స్కూల్ ప్రాంగణమును సంగీత సభకు ఇచ్చి సంగీతానికి విశేషమైన సేవ చేస్తున్నారు ఈ కార్యక్రమమునకు వయోలిన్ పై శ్రీ చిన్నికృష్ణ గారు, మృదంగముపై శ్రీ ఏడిద భీమశంకర్ గారు, ఏడిద రవితేజ గారు, ఘటనపై శ్రీ సుదర్శన ఆచార్యులు గారు,శ్రీ ఇందారపు నాగేశ్వరరావు గారు సహకరించారు































**'మధురధ్వని' సంగీత సభలో**
**26 జనవరి 2025న**
**విధుషి శ్రీమతి కస్తూరి కమలదీప్తి**
**గాత్ర సంగీత సభ.**

# నాదరమణీయమ్, హైదరాబాద్





వేణు గాన సభ ఆధ్వర్యంలో నిర్వహించిన 178వ సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలు ఆదివారం, జనవరి 26వ తేదీన ఘనంగా నిర్వహింపబడ్డాయి.

కే.పీ.హెచ్.బి, కాలనీలో గల గోవర్ధన గిరిపై ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి ఘన రాగ పంచరత్న గోష్ఠి వాయిద్య సేవ నిర్వహించారు . ఈ సేవకి జంట నగరాల్లోని విశిష్ట కళాకారులు పాల్గొన్నారు. ప్రముఖంగా వైయొలిన్ పై శ్రీ కోలంక సాయి, శ్రీ కె. అనంత శౌరిరాజన్, శ్రీ విజయభాస్కర్ , శ్రీ మతి రాధికా శ్రీనివాసన్, శ్రీమతి పరిమి ఫణి బాల, వీణియపై శ్రీమతి శాంతి చంద్రిక, కుమారి గాయత్రి, మృదంగం పై శ్రీ శ్రీకాంత్, శ్రీ శ్రీధరాచార్య, చి. అచ్యుతానంద పాల్గొన్నారు. ఇవికాక, ప్రముఖ వేణుగాన విద్వాంసులు శ్రీ శేషం రమణ వారి శిష్యులు 38 మంది వేణు గానంతో వాయిద్య గోష్ఠి గాన సేవ జరిగింది. ఈ సేవకి విశేష అతిథులుగా విజ్ఞాన సమితి, అధ్యక్షులు శ్రీ సూరి వేంకటేశ్వరులు, కార్యదర్శి శ్రీ వేమూరి సుజ్ఞాన్ విచ్చేశారు. వారు మాట్లాడుతూ, ఈ రకంగా కేవలం వాయిద్యాలతో పంచరత్న గోష్ఠి గానం చేయటం ఈ సంస్థ ప్రత్యేకతగా అభివర్ణించి,ఈ వాయిద్య సేవ నిర్విఘ్నంగా 5వ సంవత్సరం నిర్వహించటం అభినందనీయమన్నారు. విశ్లేషకులు శ్రీ మహీధర సీతారామ శర్మ కళాకారులను అభినందించి, విద్యార్థులను ఆశీర్వాదించారు. అనంతరం, వేణువు, వీణ, వైయొలిన్ విద్వాంసులు, వారి శిష్యులు స్వామి వారికి సాయంత్రం వరకు స్వరార్చన చేసారు. ప్రముఖ వైయోలిన్ విద్వాంసులు శ్రీ భట్టి పవన్ సింగ్ సేవతో కార్యక్రమం ముగిసింది.



# జయంతి సావిత్రి భాగవతారిణికి అమ్ముల స్మారక పురస్కారం ప్రదానం

నవరసాలకు భక్తి రసాన్ని జోడిస్తూ వేద శాస్త్రాలలోని, పురాణేతిహాసాలలోని ధర్మసూక్ష్మాలను తెలుపుతూ మానవులను సన్మార్గాన నడిపించే ఉత్కృష్టమైన కళ హరికథాగాన కళా ప్రక్రియ.

తెలుగునాట వర్ధిల్లిన హరికథాగాన కళా ప్రక్రియకు ఆరాధ్యుడు శ్రీ మదజ్జాదాదిభట్ల నారాయణ దాస వర్యులయితే వారి సంప్రదాయమే శ్వాసగా భావించి యధాతథంగా కొనసాగిస్తూ ఆ పవిత్రతను పరిరక్షించుకుంటూ వచ్చిన వారిలో కళా ప్రవీణులు, కళా ప్రపూర్ణులు డాక్టర్ అమ్ముల విశ్వనాథ భాగవతార్ ఒకరు. వారి 109వ జయంతి సందర్భంగా అమ్ముల వారి తనయి బివి దుర్గాభవాని (భర్త భాస్కర్ల శ్రీ సతీష్ సహకారంతో) విశ్వనాథం వారి తనయుడు అమ్ముల ఎస్ ప్రసాద్, రాజ్యలక్ష్మి ప్రసాద్ కుటుంబ సభ్యులు గత 27 సంవత్సరాల నుంచి హరికథారంగంలో ఉన్నత శ్రేణి వృద్ధ హరికథ విద్వాంసులకు విశ్వనాథ భాగవతార్ పేరిట పురస్కారాన్ని నగదుతో ప్రదానం చేస్తూ హరికథా గానం ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఆ క్రమంలో జనవరి 21వ తేదీ మంగళవారం



సాయంత్రం విజయవాడ ఘంటసాల సంగీత నృత్య కళాశాల ప్రాంగణంలోని కళావేదికపై ప్రముఖ హరికథ భాగవతారిణి జయంతి సావిత్రి (తిరుపతి) గారికి అమ్ముల వారి స్మారక పురస్కారాన్ని 10,116/- నగదుతో ప్రదానం చేశారు. సభాధ్యక్షునిగా ప్రసిద్ధ హరికథా విద్వాంసులు ధూళిపాళ శివరామకృష్ణశర్మ భాగవతులు మాట్లాడుతూ విశ్వనాథ భాగవతార్ చేసిన కృషి అనన్యమని, హరికథకునికి బహు గ్రంథ పఠనం అవసరమని, సంగీత సాహిత్యాలపై సత్తా ఉండాలని, ధారణాశక్తి ఉండాలని ఆయన హరికథా గానం ద్వారా ప్రస్ఫుటమవుతుందని అన్నారు. ఆయన పేరిట పురస్కారాన్ని జయంతి సావిత్రి భాగవతారిణి గారికి ప్రదానం చేయటం ఎంతో సముచితమన్నారు. ముఖ్యఅతిథిగా జంత్ర, గాత్ర సంగీత విద్వాంసులు, సంగీత సాహిత్యవేత్త, ఘంటసాల వేంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల విశ్రాంత అధ్యాపకులు నల్లాన్ చక్రవర్తుల బుచ్చయాచార్యులు గారు మాట్లాడుతూ అమ్ముల వారి హరికథా గానం ఒక ఆధ్యాత్మిక శిఖరం ఆధ్యాత్మిక ప్రబోధ చేస్తున్నట్లు ఉండేదని, ఆదిభట్ల వారి సంప్రదాయ హరికథకు ఆయన నిలువెత్తు రూపమని అన్నారు. సంప్రదాయ హరికథకులలో అగ్రగణ్యుడు అమ్ములవారని అన్నారు. హరికథా గాన కళా ప్రపూర్ణుడు అమ్ముల విశ్వనాథుడు అని అంటూ ఆయనకు వయొలిన్ తో సహకరించిన మధురానుభూతులను జ్ఞాపకం చేసుకుంటూ ప్రసంగించారు. ఆత్మీయ అతిథిగా ప్రముఖ గాత్ర సంగీత విదూషిణి, తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయం సంగీత విభాగం డీన్



శ్రీమతి ద్వారం లక్ష్మి గారు మాట్లాడుతూ అమ్ముల వారి కుటుంబంతో తన తండ్రి ద్వారం భావన్నారాయణరావు గారి కుటుంబంతో ఉన్న సాన్నిహిత్యాన్ని వివరిస్తూ సుందర రూపంతో కలిగిన హరికథా గానం, మంచి వక్తృత్వం, మిత్రత్వం అమ్ముల వారికి ఆభరణాలని అన్నారు. అమ్ముల వారు నిరంతర విద్యార్థి, నిత్య శోధకుడు, నిత్య సాధకుడు అని మనం చేసే కృషే మనకు గుర్తింపు ఇస్తుందని భావన ఆయన నిరంతర శ్రమలో కనిపించేదని అన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల కాలం ఆయనను స్మరించుకుంటూ చేసేటటువంటి ఇటువంటి కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని తన తండ్రి భావనారాయణరావు గారి శతజయంత్యుత్సవాలకు ఈ కార్యక్రమం మరింత ఉత్తేజాన్నిచ్చిందని అన్నారు. ప్రత్యేక అతిథిగా పాత్రికేయులు, కవి, రచయిత వసుధ బసవేశ్వరరావు గారు మాట్లాడుతూ అమ్ముల వారు హరికథ గాన కళా తపస్వి అని అన్నారు. అన్ని రంగాలలో వచ్చిన మార్పు హరికథా రంగంలో కూడా వచ్చినా అది ఆరోగ్యకరంగానే ఉండాలని, ఆ మార్పు శాస్త్రానికి సంప్రదాయానికి విరుద్ధంగా ఉండకూడదంటూ పదే పదే చెప్పేవారన్నారు. సూర్య బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి కేశవులు మాట్లాడుతూ విశ్వనాథం గారు అజాతశత్రువని, ప్రేమ వాత్సల్యం నిండిన హృదయం ఆయనదని, రాష్ట్రపతుల దగ్గర హరికథ గానాలు చేసి అఖండకీర్తిప్రతిష్టలార్జించినా సామాన్యుని సైతం సాధారణ వ్యక్తి వలె నవ్వుతూ ఆప్యాయతతో పలకరించే వారన్నారు.

పురస్కార స్వీకర్త జయంతి సావిత్రి గారు మాట్లాడుతూ కపిలేశ్వరపురం సర్వారాయ హరికథ పాఠశాలలో తాను విద్యార్థిగా ఉన్నప్పుడు తన కథను విని అమ్ములవారు వృద్ధిలోకి వచ్చే మంచి కథకురాలు అవుతుందని తనను ఆశీర్వదించారని, అదే నాకు గొప్ప అవార్డు అని, ఈ రోజున వారి కుటుంబీకులు అందించిన పురస్కారం తనకు మరింత గౌరవాన్ని పెంచిందని, హరికథ పై తనకున్న భక్తిని, బాధ్యతను మరింత ప్రబలం చేసిందన్నారు.

భక్తి పరవశులను చేసిన భక్త మార్కండేయ హరికథా గానం..

అదే వేదికపై ప్రారంభంలో జయంతి సావిత్రి భాగవతారిణి గారిచే ఆదిభట్ల నారాయణదాస విరచిత భక్త మార్కండేయ హరికథా గానం శ్రోతలను భక్తి పరవశులను చేసింది. వయోలిన్ తో చావలి శ్రీనివాస్ గారు, మృదంగంతో నగధరరావు గారు రక్తిగా సహకరించారు.





20-01-2025న NAAC పీర్ కమిటీ సందర్శన సందర్భంగా PSL తెలుగు విశ్వవిద్యాలయ విద్యార్థుల ప్రదర్శన.



శాంకరి శక్తి పీఠం, శ్రీలంక లో
'వాచస్పతి' శ్రీ ఎమ్.వి.సింహాచలశాస్త్రి
భాగవతార్ హరికథాగానం జరిగింది.

నాదసుధ, కాకినాడ లో
మల్లాది సూరిబాబు గారి
సంగీతసభ..
20.4.25 ఆదివారం.





శ్రీ శ్యామశాస్త్రి వారి 198 వ ఆరాధన.... పాఠశాల అధ్యాపకుల కచేరి. శ్రీ మల్లాది నరసింహారావు గాత్రం, శ్రీ కొక్కొండ సుబ్రహ్మణ్యం గారు వయోలిన్, సాయి కృష్ణ మృదంగం
రాజమండ్రి విజయశంకర ప్రభుత్వసంగీత పాఠశాల.

# శ్రీ విజయత్యాగరాజ సంగీతసభ
# సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం





శ్రీ కంచి కామకోటి పీఠం సౌజన్యంతో స్థానిక శంకరమఠంలో జనవరి 26,27,28 తేదీలలో మూడు రోజులపాటు శ్రీ విజయ త్యాగరాజ సంగీతసభ, శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం హాలు నిండిన సంగీతాభిమానుల మధ్య ఘనంగా నిర్వహించింది.

మొదటిరోజు అనగా 26.1.25 తేది నాటి ఉదయం జరిగిన పంచరత్నసేవలో స్థానిక సంగీత కళాకారులు పాల్గొని నివాళులర్పించారు. సాయంత్రం 6.30 గం.కు ఉత్సవాలకు శుభారంభం చేకూరుస్తూ, ఉపాధ్యక్షులు శ్రీ అయ్యగారి భుజంగరావు, విశాఖ మ్యూజిక్ అకాడెమి కార్యదర్శి శ్రీ వి. చంద్రశేఖర్, ఆత్మీయ అతిథి శ్రీ వి.ఎస్. ఎన్.మూర్తి, సంగీత విద్వాంసులు శ్రీ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం గారలు జ్యోతిప్రజ్వలన జరిపిన అనంతరం జరిగిన సంగీత కార్యక్రమంలో శ్రీ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం గారు, "త్యాగరాజ సంగీత వైభవం" అన్న అంశంపై సోదాహరణ ప్రసంగం అందించి ప్రేక్షకుల ప్రశంసలనందుకున్నారు.

త్యాగరాజస్వామి పుట్టుకతో ఆరంభించి కొద్దినిముషాలు శిష్యపరంపర, రచనా విశేషాలు తెలియజేసిన అనంతరం, సంగీత వైభవం గురించి చెబుతూ, చాలా కీర్తనలను స్పృశిస్తూ, ప్రసంగాన్ని ఆసక్తికరంగా రెండుగంటలు నడిపించారు. ముఖ్యంగా ఈ విషయాలు తెలుసుకోవలసిన యువత ప్రేక్షకులలో లేకపోవడాన్ని గమనించారాయన. పాఠాంతరాలు త్యాగరాజ శిష్యపరంపరలో శిష్యుల గాత్రసౌలభ్యానికి అనుగుణంగా చేరాయని తెలియజేశారు. ఒక కీర్తనలో నెరవు, కవి హృదయాన్ని గమనించి భావాన్ని గ్రహించి, ఆ వాక్యంవద్దనే చేసిచూపాలని సోదాహరణంగా వివరించారు.

షడ్విధమార్గిణి రాగంలో "జ్ఞానమొసగరాదా" కీర్తన స్వరపరచినా, మనం పూర్వీకల్యాణిలో పాడుకుంటూ "పరమాత్ముడు జీవాత్ముడు" వద్ద నెరవు చేస్తున్నాం, కాని "గరుడగమన వాదా" వద్ద నెరవు కవిహృదయం తెలియజేస్తుందని ప్రతిపాదించడం విశేషం. సంగీతంలో "సంగతి" ని ప్రవేశపెట్టిన ఘనత త్యాగరాజస్వామి వారిదేనని చెబుతూ, షడ్విధమైన సంగతుల వివరం సోదాహరణంగా తెలియజేశారు.

ముఖారిరాగంలో "ఎంతని నే వర్ణింతును", హరికాంభోజి రాగంలో "ఉండేది రాముడొకడు", రీతిగౌళ రాగంలో "నన్నువిడచి కదలకురా", కీర్తనలను సందర్భోచితంగా, వినిపించి కల్యాణిరాగంలో

"అమ్మరావమ్మ" కీర్తనను ముఖ్యాంశంగా గానం చేస్తూ, "ఉయ్యాలలూగవయ్యా", "నాపాలి శ్రీరామా" రచనలతో ప్రసంగాన్ని ముగించారు. వాయులీనంపై శ్రీ సరస్వతుల పార్థివ, మృదంగంపై శ్రీ A. ఆనంద శ్రీహరి గారలు ప్రసంగానికి తగిన రీతిలో ఎంతవరకూ అవసరమో అంతవరకే సమయోచితంగా సహకరించడం విశేషంగా చెప్పుకోవాలి. కార్యక్రమ ప్రాయోజకులు, డా.మైథిలి, డా. వేంకటేశ్వరరావు కళాకారులను సన్మానించారు.

రెండవరోజు 27.1.25నాటి సాయంత్రం శ్రీ విజయ త్యాగరాజ సంగీత సభ తన ప్రతిష్ఠాకరమైన "సంగీత సుధానిధి" బిరుదును మన విజయనగరానికి చెందిన చెన్నయి వాస్తవ్యులు, ప్రఖ్యాత మార్దంగికులు డా. పత్రి సతీశ్ కుమార్ గారికి సమర్పించి సత్కరించింది. అధ్యక్షులు శ్రీ చాగంటి సన్యాసిరాజు, ముఖ్య అతిథి శ్రీ యమ్మెస్ శ్రీనివాస్, ఆత్మీయ అతిథి డా.గౌరి రామ్మోహన్, కార్యదర్శి శ్రీ చాగంటి లక్ష్మణేశ్వర శర్మ, మరియు పురస్కార గ్రహీత డా. పత్రి సతీశ్ కుమార్ గారల జ్యోతి ప్రజ్వలన అనంతరం జరిగిన సత్కారసభ కుమారి విష్ణుప్రియ ఇందిర సోమయాజుల మధురమైన ప్రార్థనతో ఆరంభమైంది. సభాధ్యక్షులు శతాధిక వృద్ధులు శ్రీ చాగంటి సన్యాసిరాజు, ముఖ్యఅతిథిగా నిత్య సంగీతసేవకుడు శ్రీ యమ్మెస్ శ్రీనివాస్, ఆత్మీయ అతిథిగా డా.వి.గౌరి రామ్మోహన్ గారు పాల్గొని తమతమ సందేశాల నందించిన అనంతరం సన్మాన కార్యక్రమం మొదలైంది.

పురస్కార గ్రహీత డా. పత్రి సతీశ్ కుమార్ గారు ప్రత్యేక ఆసనం గ్రహించిన తరువాత వేదఘనపాఠి శ్రీ కందుకూరి బాలసుబ్రమణ్యంగారి ద్వారా వేదోక్త ఆశీర్వచనం "శతమానం భవతి" అంటూ జరిగింది.

అతిథులు శ్రీ సతీశ్ గారిని గంధము, తిలకము, పూలమాలలు, శాలువ, శిరోభూషణములతో సత్కరించారు. అనంతరం శ్రీ వి.ఎస్.ఎన్. మూర్తిగారు, పురస్కారగ్రహీత శ్రీ సతీశ్ కుమార్ పరిచయం చేయగా ఆనాటి సభాప్రాయోజకులు శ్రీ సి.వి.సూర్యారావుగారు(USA) వారి తండ్రి గారైన శ్రీ చెలికాని పార్థసారథి అప్పారావుగారి స్మృత్యర్థం సమకూర్చగా, వారి తరపున శ్రీమతి పద్మిని గారు పురస్కారగ్రహీతను శాలువ ఫలములతో సత్కరించారు. తరువాత స్థానికసంస్థలు, పుర ప్రముఖులు, సంగీత కళాకారులు, మార్దంగికులు వచ్చి వరుసగా సన్మానించి శ్రీ సతీశ్ పట్ల తమ అభిమానం తెలియజేసారు. తమస్పందనను తెలియజేస్తూ, ఈ సన్మానం తనకు తన బరువు బాధ్యతలను ఎప్పుడూ గుర్తుచేస్తుందని వినయ పూర్వకమైన పలుకులతో కృతజ్ఞత తెలియజేశారు. ప్రాయోజకతను సమకూర్చిన వారితరపున విచ్చేసిన శ్రీమతి పద్మినిగారిని సంస్థ సన్మానించి కృతజ్ఞతను తెలిపింది.

అనంతరం జరిగిన సంగీతసుధానిధి డా. రామవరపు మాధురీదేవి వీణావాదనసభ, సంగీతసుధానిధి డా.పత్రి సతీశ్ కుమార్ మృదంగ సహకారంతో రసవత్తరంగా సాగి ప్రతీ అంశమూ కరతాళధ్వనుల నందుకుంది. మాధురీదేవిగారు గానమూర్తి రాగంలో "గానమూర్తే" కీర్తనతో ఆరంభించి, కార్యక్రమ లక్ష్యం తెలిసిన విద్వాంసురాలిగా, కల్యాణి స్వల్పరాగాలాపన తానం తో, చిన్న పల్లవిని, నాటకురంజి, బేహాగ్, కాపీ, రాగమాలిక స్వరకల్పనతో నడిపించి సమయాన్ని లయవిన్యాసానికే కేటాయించడం గమనార్హం.



తరువాత 30ని॥ సాగిన చతురశ్రజాతి త్రిపుట తాళంలో లయవిన్యాసంతో, ప్రేక్షకులు కళాకారునిలో ఒక శివస్వరూపాన్ని, మృదంగ శబ్దాలలో ఒక శివతాండవాన్ని చూడగలిగి వినగలిగారంటే అతిశయోక్తికాదు. ఆరంభంనుండి ప్రదర్శించిన గతులు, కూర్చినజతులు, లెక్కలలో ముక్తాయిలు, లయవిన్యాసంలో వివిధ రీతులలో పలికించడం కేవలం ఆ సంగీతసుధానిధికే చెల్లు. హాలులో నిండిన మృదంగనాదం, రసజ్ఞుల మనసుకు పట్టేసిన శబ్దతరంగాలు అందరికీ మరచిపోలేని మధురమైన అనుభూతిని కలిగిస్తూ, ఆనందడోలికలలో ఓలలాడించాయి. ఒక్కొక్క గతిలో మృదంగంపై అంగుళుల నర్తనం కనువిందు కలిగిస్తూ, మైమరపింపజేసి, అలుపెరుగని ఆవిద్వాంసునిపై ప్రశంసల వర్షం కురిపించాయి. STANDING OVATION తో రసజ్ఞులు తమ ఆనందాన్ని తెలియజేయడం విశేషం.ఫరజురాగంలో "చెలి నేనెట్లు" జావళి, హిందోళరాగ తిల్లానా, మంగళంతో సభ ముగిసింది. వేదపండితులు శ్రీ కుప్పా హయగ్రీవమూర్తి గారి ఆశీస్సుల అనంతరం శ్రీ చాగంటి లక్ష్మణేశ్వరశర్మ ధన్యవాదసమర్పణ చేశారు.

మూడవరోజు 28.1.25 నాటి సాయంత్రం శ్రీ విజయత్యాగరాజ సంగీత సభ అధ్యక్షులు శ్రీ చాగంటి సన్యాసిరాజుగారు, ఉపాధ్యక్షులు నాటి సభా ప్రాయోజకులు శ్రీ అయ్యగారి భుజంగరావుగారు, కార్యదీక్షాపరులు శ్రీ యమ్మెస్ శ్రీనివాస్ గారు, శంకరమంఠం కార్యదర్శి శ్రీ తల్లాప్రగడ అచ్యుతరామయ్య గారు జ్యోతినివెలిగించి శుభారంభం చేకూర్చారు. అనంతరం సంగీత సుధానిధి డా.కె . వందన గారి గాత్రసంగీతసభ వీనుల విందుగా సాగింది. అచ్యుతరామయ్య దంపతులు వందనగారిని సన్మానించిన అనంతరం వందన త్యాగరాజస్వామిని స్మరిస్తూ బేగడరాగంలో ఒక శ్లోకంతో గానం ఆరంభించారు. తరువాత వరుసగా బేగడ రాగంలో "గట్టిగాను", అసావేరి రాగంలో "ఏ పనికో జన్మించితినా", నాదవరాంగిణి రాగంలో అరుదుగా వినే "కృపాలవాల" కీర్తనలు వినిపించి చక్కనైన శహన రాగాలాపనతో శ్రోతలను ఆకట్టుకున్నారు. "గిరిపై నెలకొన్న" కీర్తనను భావయుక్తంగా గానం చేసి, వేగంగా మరొక అరుదుగా మనం వినేరచన కుంతలవరాళి రాగంలో రసవత్తరమైన చిట్టస్వరంతో "చెంతనే సదా" కీర్తనతో గాత్రంలో తనకుగల పట్టును ప్రదర్శించారు గాయని. చిక్కనైన పంతువరాళి రాగాలాపనతో "రఘువర నన్ను" కీర్తన వినిపించి ఎన్నో కొత్తరాగాలను సృష్టించిన శ్రీ త్యాగరాజస్వామివారిపై "రామభక్త శిరోమణిం త్యాగరాజం భజే, బహుదారి రాగ కర్తారం" అన్న బహుదారి రాగ "రాగం – తానం – పల్లవి" ని ఉత్సవాలకు తగినరీతిలో వినిపిస్తూ,నళినకాంతి, బిందుమాలిని, కోకిలవరాళి, రాగాలనుకూడా జోడిస్తూ మనోహరమైన అంశం అందించారు. హుసేని రాగంలో "ఏమని వేగింతునే", యదుకుల కాంభోజి రాగంలో "పాహి రామచంద్ర" అంశాలతో సభను తద్వారా ఉత్సవాలను సుసంపన్నం గావించారు డా. వందన. శ్రీ H. రాంచరణ్ గారు వాయులీనంపై, శ్రీ కె. సద్గురు చరణ్ గారు మృదంగంపై దీటైన సహకారంతో సభను రక్తి కట్టించారు. కుమారి R. కృష్ణప్రియ శ్రుతి సహకారం అందించారు. అనంతరం కార్యదర్శి శ్రీ చాగంటి లక్ష్మణేశ్వర శర్మగారు శంకరమఠం వారికి, ప్రాయోజకులకు, ప్రేక్షకులకు ధన్యవాదాలు సమర్పించడంతో మూడు రోజుల ఆరాధన సభలు ముగిశాయి.

**– వియెస్సెన్మూర్తి**

# సంస్కృతి ఫెడరేషన్,హైదరాబాద్ 10వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు జనవరి 29నుండి ఫిబ్రవరి 2వరకు ఘనంగా జరిగాయి.




































# సంగీత విద్వత్సభ, కాకినాడ 77వ వార్షిక సంక్రాంతి గానసభలు 19-28 జనవరి 2025





























# సంగీత లహరి 14 వ వార్షికోత్సవ వేడుకలు.

రాజమహేంద్రవరం లో ప్రతి నెల సంగీత సభలను మాత్రమే నిర్వహిస్తున్న ఏకైక సంస్థ సంగీత లహరి వార్షికోత్సవ వేడుకలు జనవరి 24, నిండి 26 వరకు 3 రోజల పాటు వీనుల విందైన కచేరీలు జరిగాయి.

మొదటి రోజు రాజమహేంద్రవరం సంగీత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ కరివేటి వెంకటేశ్వర్లు గారి నాదస్వర కచేరి అద్భుతమైన రీతిలో జరిగింది. వీరికి సహాకార నాదస్వరం శ్రీ కల్లూరి జయకుమార్ గారు పిఠాపురం దేవస్థానం నాదస్వర విద్వాంసులు పాల్గొన్నారు.

కల్యాణి రాగం లో ఆది తాళం వర్ణం తో కచ్చేరి ప్రారంభించి'శశి వదన' అనే చంద్రాజ్యోతి రాగ అపురూప కీర్తనను, వన్దే వాసుదేవం సామ రాగ అన్నమయ కీర్తన ఆరభి పంచరత్న కీర్తన వాయించి సభను రంజింప చేసారు. తరువాత "నిను వినా నవరస కన్నడ కీర్తనను మంచి కాల ప్రమాణం లో వాయించారు. ముఖ్యాంశం గా ధర్మవతి రాగం ఆలపించి ఓడోడి వందేన్ అనే అంబుజం కృష్ణన్ గారి తమిళ్ కీర్తనను, దానిలో స్వరప్రస్థారం అద్భుతమైన రీతిలో వాయించారు. తరువాత డోలు తనియావర్తనం వాయించారు. శ్రోతలు చాలా ఆనందించారు. డోలు పై రాజమండ్రి సంగీత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ ఏడిద సత్యనారాయణ మరియు హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీ టి. శివనారాయణ గారు సహకరించారు. సుమారు 4 గం లపాటు జరిగిన ఈ కచ్చేరికి శ్రోతలు పెద్ద సంఖ్యలో విచ్చేసి చివరి వరకు విన్నారు. చాలా కాలం తరువాత రాజమండ్రి లో మంచి నాదస్వర కచ్చేరి ఏర్పాటు చేసిన కమిటీ వారికి అభినందనలు తెలియ చేసారు

రెండవ రోజు కార్యక్రమంగా విశాఖ వాస్తవ్యులు శ్రీ ప్రాతా కృష్ణమూర్తి గారు గాత్రం కచ్చేరి జరిగింది. వీరికి వయొలిన్ పై ఆ రాంచరణ్, మృదంగం పై హెచ్. యోగేష్ మరియు కంజీరా పై రామవరపు సహదేవుడు సహకరించారు.

కానడ అట తాళ వర్ణంతో కచ్చేరి ప్రారంభించి, ఇలలో అనే త్యాగరాయ కీర్తన, ఉప ముఖ్యాంశం గా వరాళి రాగం లో శేషాచల నాయక



















**స్వరరాగసుధ, ఒంగోలు.**

సంస్థ వారు నిర్వహించిన త్యాగరాజ ఉత్సవాలలో
భాగంగా 26-1-25న **శ్రీ ఆకొండి శ్రీనివాస రాజారావు** ను
సన్మానించి "**గానసుధాకర**" బిరుదముతో సత్కరించారు.
సంగీతవిద్వాంసులు శ్రీమోదుమూడి సుధాకర్
పోపూరి గౌరినాథ్, వైలెన్ విద్వాసులు
శ్రీ పాలపర్తి నాగేశ్వరరావు,సంస్థ స్ధాపకులు శ్రీని వాసమూర్తి,
డా. ప్రసాద్ ఇతర స్ధానిక ప్రముఖుల సమక్షంలో
ఈ కార్యక్రమం ఎంతో వేడుకగా జరిగింది.




**మీనాక్షి దేవాలయం,**
**టెక్సాస్ లో 13.4.2025న**
**విద్వాన్ శ్రీ డి.రాఘవాచారి సంగీతసభ.**

# శ్రీ శారదా సంగీతాలయం,నరసన్నపేట.త్యాగరాజ ఆరాధనోత్సవం.





గాత్రం: టి.దేవి సుజాత గారు, వైలిన్: హెచ్.రామ్ చరణ్ గారు, మృదంగం: ఎమ్.కామేష్ గారు







'రస' సంగీత సంస్థనుండి 'ఇసై రసమామని' బిరుదంతో
సత్కరింపబడిన వాయులీన విదుషీమణులు
డా. ఎం. లలిత మరియు ఎం. నందిని.
నిర్వాహకులు శ్రీమతి అంబికా కామేశ్వర్,
శ్రీ రాజ్ కుమార్ భారతి, శ్రీమతి ప్రియా మురాళే

## ఈనెల 28 నుండి వేసవి సంగీత శిక్షణా శిబిరం

రోటరీ క్లబ్ విజయనగరం కమ్యూనిటీ ప్రాజెక్టులో భాగంగా రోటరీ ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ద్వారా నడుపబడుతున్న కొత్తగ్రహారంలో గల రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ ద్వారా రోటరీ కమ్యూనిటీ ఎ.సి. హాల్ నందు ఈనెల 28నుండి జూన్ 6వ తేదీ వరకు 40 రోజుల పాటు "సంగీత వసంతం" పేరిట వేసవి సంగీత శిక్షణాశిబిరం నిర్వహించనున్నట్లు అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి తెలియజేశారు. నామమాత్రపు రుసుముతో ఈ 40 రోజుల సంగీత శిక్షణా కార్యక్రమమును అందరూ వినియోగించుకోవాలని ప్రతీ రోజూ సాయంత్రం 5.30 నుండి 7.30వరకు ఈ శిక్షణ ఉంటుందని తెలియజేశారు. పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్ 9440114618 అనే నంబర్ కి గాని 9441042236 అనే నంబర్ గాని వివరాలు తెలుసుకోవచ్చు.

– **డాక్టర్ మండపాక రవి,** ప్రిన్సిపాల్, రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ, విజయనగరం 9440114618

# త్యాగరాజ స్వామికి సంకీర్తనార్చన
# - పంచరత్నాలతో నగర సంకీర్తన చేసిన గాయకులు





త్యాగరాజ స్వామికి పంచరత్నాలతో గాయకులు సంకీర్తనార్చనలు చేశారు. పిఠాపురం శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయంలో కొలువు తీరిన త్యాగరాజ స్వామివారి వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సంగీత కళాకారులు నగర సంకీర్తన నిర్వహించారు. సద్గురు త్యాగరాజ సంగీత సమాఖ్య ఆధ్వర్యంలో పిఠాపురం జే.జి.ఆర్ హాస్పిటల్ డాక్టర్ జోగా వీర బాలాజీ సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. విశాఖపట్నం సంగీత జనకులం ఐ విల్ శాస్త్రి సంగీత సమితి, పిఠాపురం ఆకొండి వెంకట్రావు శిష్య బృందం సుమారు వందమంది సంగీత కళాకారులు ఈ నగర సంకీర్తనలో పాల్గొని త్యాగరాజ విరచిత పంచరత్న కీర్తనలు ఆలపించారు. ఆలయం వద్ద నుండి సినిమా సెంటర్, కోటగుమ్మం, చిన్న బజార్ మీదుగా నగర సంకీర్తన జరిపించారు నగర సంకీర్తనలో త్యాగరాజ స్వామికి మహిళలు హారతులు అందించారు. మృదంగంపై ఏ కామేష్, అనిల్, వయోలిన్ పై శ్రీరామ్ వాద్య సహకారం అందించారు. అర్చకులు విజయ జనార్ధనాచార్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్య నిర్వహణ అధికారి నున్న శ్రీరాములు, గట్టి శ్రీకృష్ణదేవరాయ వెంకట్రావు, జోగా వెంకట రమణ, ఆలయ ప్రెసిడెంట్ శ్రీనివాస్, మల్యాల రామలక్ష్మి, సుబ్బరాయ శర్మ, విగాయత్రి తదితరులు పాల్గొన్నారు.



**అలరించిన నాదార్చన సంగీత కార్యక్రమం**

**సద్గురు శ్రీ శివానందమూర్తి గురువుగారి గురుధామంలో ప్రతి మాసం జరుగుతున్న నాదార్చన సంగీత కార్యక్రమంలో భాగంగా నాదస్వర విద్వాంసులు పీరయ్య గారి బృందంచే నిర్వహించిన నాదస్వర సంగీత కార్యక్రమం ప్రేక్షకులను అద్యంతం ఎంతగానో అలరించింది.**

# నాట్య పరిమళ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ

**మంత్రముగ్ధుల్ని చేసిన లిపికారెడ్డి బృందం నృత్య, భక్తిగీతాలాపన.**

భక్తి పారవశ్యంతో కళాకారులు చేసిన నృత్యాలు భక్తిరస హృదయాలను మీటాయి. అష్టోత్తర శత నృత్య సంగీతార్చన పేరిట దేశ వ్యాప్తంగా 108 శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాల్లో నాట్యపరిమళ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ నిర్వహించ తలపెట్టిన నృత్య సంగీతార్చన శనివారం సాయంత్రం కాకినాడ జిల్లా తుని, ఎస్.అన్నవరంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 38వ ప్రదర్శన జరిగింది. కూచిపూడి నృత్య కళాకారిణి, అకాడమీ డైరెక్టర్ డా॥ కె.పి. లిపికారెడ్డి నృత్య నిర్దేశత్వంలో మూషికవాహన ప్రార్ధనా నృత్యంతో ప్రారంభించి మహాగణపతిం, అదివో అల్లదివో.., రారా వేణుగోపాల.. రఘువంశసుద, ఇదిగో భద్రాద్రి, గోవర్ధన గిరి ధార, నారాయణతే నమో నమో, అలిమేలు మంగ హరి అంతరంగ, ఎందరో మహానుభావులు, మంగళం వంటి అంశాలను 30 మంది నృత్య కళాకారులు తమ అభినయ విన్యాసాలతో నృత్యాభిషేకం చేసి నాట్య కళాభిమానులను మైమరపించారు. డైరెక్టర్ లిపికారెడ్డితో పాటు అకాడమీలో శిక్షణ పొందుతున్న మానసశ్రీ, పరణిక, భవ్యశ్రీ, హిమబిందు, హర్షిణి, త్రిపుర, రవీనారెడ్డి, జాహ్నవి, గగన స్ఫూర్తి, సుదీక్ష, కృష్ణ హాసిని, చాందిని, తనూజ, జ్ఞాపిక, ప్రణవి, అనన్య పలు అంశాలను అలవోకగా అభినయించారు. అలాగే గాయకులు ఆలపించిన గరుడగమన, పిడికెడు తలంబ్రాలు, ఇందరికి అభయములు, గోవింద గోవింద, గురు అష్టకం వంటి భక్తిరస గీతాలను డాక్టర్ బాలగణేష్, లిపికారెడ్డి, సింధూజరెడ్డి, రూపారెడ్డి, కుందనసాయి, శ్రీఅనగా, అనూష, నిక్షిత, హన్విత, ద్రాక్షయాని, జనీషశ్రీ, ప్రిస్తిక, హర్షిణి పాడి సంగీత ప్రియులను ఆకట్టుకున్నారు. ముందుగా ప్రముఖ బంగారు వ్యాపారి శ్రీ డి. విష్ణు చక్రం ముఖ్య అతిథిగా హాజరై









జ్యోతి ప్రజ్వలన చేసి, మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పవని, వీటిని పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది అన్నారు, మరియొక ముఖ్య అతిధి ప్రముఖ విద్యావేత్త శ్రీ డి. రామకృష్ణ గారు మాట్లాడుతూ దేశంలో 108 శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాలో సంగీత నృత్య ప్రదర్శనలు లిపికారెడ్డి తన బృందంతో శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు, సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించేందుకు ఇటువంటి భక్తిరస నృత్యాలు ఎంతోగాను దోహదం పడతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వహకులు శ్రీ ఎల్. స్వామి మణీంద్ర, దేవాలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు. పై కార్యక్రమానికి ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. వై. బాలగణేష్ వ్యాఖ్యానం చేసి సభను రంజింపచేశారు. అకాడమీ వ్యవస్థాపకులు కంబాపు సత్యనారాయణరెడ్డి అధికసంఖ్యలో కళాభిమానులు, కళాకారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రసవత్తరంగా అష్టోత్తర శత నృత్య సంగీతార్చన



తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దమైన కూచిపూడి నృత్యం ద్వారా దేశంలో 108 శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయాల్లో అష్టోత్తర శత నృత్య సంగీతార్చన పేరిట నాట్య పరిమళ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి తలపెట్టిన కార్యక్రమాల్లో భాగంగా 37వ ప్రదర్శన భీమునిపట్నం, సాగరతీరం, వెంకటగిరి క్షేత్రంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఘనంగా జరిగింది. ఇందులో అంతర్జాతీయ కూచిపూడి నృత్య కారిణి, అకాడమి డైరెక్టర్ శ్రీమతి కె.పి. లిపికరెడ్డితో పాటు ఆమె దగ్గర శిక్షణ పొందుతున్న ముప్పై మంది కళాకారులు తమదైన శైలిలో కూచిపూడి నాట్య విన్యాసాలతో అలౌలిక అనుభూతి పంచారు. ముందుగా మూషికవాహన ప్రార్ధనా నృత్యంతో ప్రారంభించి మహాగణపతిం, అదివో అల్లదివో.., రారా వేణుగోపాల.. రఘువంశం ఇదిగో భద్రాద్రి, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణం కూచిపూడి నృత్య రూపకం, ఎందరో మహానుభావులు, మంగళం

వంటి అంశాలను 30 మంది నృత్య కళాకారులు తమ అభినయ విన్యాసాలతో నృత్యాభిషేకం చేసి నాట్య కళాభిమానులను మైమరపించారు. డైరెక్టర్ లిపికారెడ్డితో పాటు అకాడమీలో శిక్షణ పొందుతున్న భవాని, చార్మిత, సాయి రోషిణి, మానసశ్రీ, పరణిక, భవ్యశ్రీ, కావ్య లలిత, హిమబిందు, హర్షిణి, త్రిపుర దీక్షిత, రవీనారెడ్డి, తన్యశ్రీ, జాహ్నవి, గగన స్ఫూర్తి, సుదీక్ష, కృష్ణ హాసిని, చాందిని, తనూజ పలు అంశాలను అలవోకగా అభినయించారు. అనంతరం నాట్యాచార్యుణి గురు శ్రీమతి ఆర్. కృష్ణవేణి ఈశ్వర్ గారిని నాట్యమంజుష ఎక్స్ లెంట్ అవార్డుతో సత్కరించారు. అలాగే గాయకులు ఆలపించిన గరుడగమనతవ భావములోన మరియు దేవతలు చలగిరి వంటి భక్తిరస గీతాలను డాక్టర్ బాలగణేష్, లిపికారెడ్డి, కావ్యలలిత, సాయిరోషిణి, సింధూజరెడ్డి, రూపారెడ్డి, నళిని, కుందనసాయి, ప్రణవి, శరణ్య, వైష్ణవి, శ్రీఅనగా సాధ్విక పాడి సంగీత ప్రియులను ఆకట్టుకున్నారు. ముందుగా గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ 2వ వార్డు కార్పొరేటర్ శ్రీమతి జి. చిన్ని కుమారి లక్ష్మి గారు ముఖ్య అతిధిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, మాట్లాడుతూ భారతీయ



సంస్కృతి సాంప్రదాయాలు ఎంతో గొప్పవని, వీటిని పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది అన్నారు. కళలు నిర్జీవమైపోతే వాటి ప్రభావాన్ని రక్షించి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి కృషి చేస్తున్న లిపికారెడ్డి అభినందనీయురాలు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు జి. అప్పలనాయుడు గారు, జి.వి. ఎం.సి. సర్వేయర్ & జనరల్ సెక్రటరీ, డి.ఎస్. ఎస్.ఆర్. కృష్ణ మూర్తి, దేవాలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు. పై కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీ ఎం. వి. రాజశేఖర్ వ్యాఖ్యానం చేసి సభను రంజింపచేశారు. ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.వై. బాలగణేష్ అకాడమీ వ్యవస్థాపకులు కంబాపు సత్యనారాయణరెడ్డి అధికసంఖ్యలో కళాభిమానులు, కళాకారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



**కాకినాడ**

## 'శరణ్య సంగీత పాఠశాల'లో

**త్యాగరాజ ఆరాధన.**

**నిర్వహణప్రిన్సిపాల్**

**శ్రీ భైరవభట్ల సుబ్రహ్మణ్య శర్మ.**

# శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘము, గుంటూరు




లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘము ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమములలో భాగంగా శ్రీ త్యాగరాజ కళావేదికపై 9/3/2025 ఆదివారం సాయంత్రం శ్రీ కోరిడే సుధీర్ కుమార్, ఆస్ట్రేలియా, వారి గాత్ర సంగీత సభ జరిగింది. దీనికి, వాయులీనంపై శ్రీ జనార్దన్, బెంగళూరు,మృదంగం తో శ్రీ జయభాస్కర్, హైదరాబాద్, మరియు ఘటం, శ్రీ చంద్రకిరణ్ హైదరాబాద్ వారలు సహకారాన్న అందించారు. శ్రీ సుధీర్ శర్మగారు ప్రధానంగా శ్రీవిద్యోపాసకులు, యజ్ఞయాగాది క్రతువులు నిర్వహిస్తూ ఉంటారు, సంగీతం పై మక్కువతో శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందేరు. వీరు తోలుత పవనాత్మజ గచ్చ, దీక్షితర్ గారి రచన నాటరాగంలో పాడేరు. తరువాత ఏపనికో జన్మించితినని త్యాగరాజ స్వామివారి అపురూప కృతి అసావేరి రాగం లోనిది వినిపించారు. పిమ్మట దయజూడవే, కమలామనోహరి రాగం (శ్యామకృష్ణ ముద్ర వచ్చింది కానీ శ్యామశాస్త్రీ గారిరచన అనిపించలేదు) పాడేరు. ఆతరువాత కనికరము లేకపోయినా ఆనందభైరవి, జగదీశమామవ, నాటకురంజి రాగం, ప్రధానాం శంగా పాడేరు, వైయలిన్ పై జనార్దన్ గారు చక్కని రాగాధర్మాన్ని ప్రదర్శించి కచేరికి జవసత్వాలు చేకూర్చారు మృదంగం తో జయభాస్కర్, ఘటంతోచందనకుమార్ గార్లు గాయకుని స్థాయికి తగినట్లు ఒదిగి సహకారాన్నందించి పక్కవాద్య ధర్మాన్ని ప్రదర్శించారు. వీరిరువురి తన్యావర్తనం నవనవోన్మేషంగా, కచేరిని మరింత శోభయమానం చేసింది. అనంతరం అఠాణా జావళి, నాదానామక్రియ, సురటి లోని రచనలలు పాడి మంగళంతో ముగించారు. నాటి కార్యక్రమ్మాన్ని సంఘ గౌరవ కార్యదర్శి శ్రీ కృష్ణకిషోర్, ఉపాధ్యక్షులు శ్రీ S. గిరిజాశంకర్ గారలు నిర్వహించి విద్వాంసులను సత్కరించారు. దాంతో సభాకార్యక్రమం జయప్రదంగా ముగిసింది.






# విశాఖ మ్యూజిక్ అకాడెమి




విశాఖ మ్యూజిక్ అకాడెమి ప్రతియేటా భక్తజ్ఞానానందతీర్థ ఓగిరాల వీరరాఘవ శర్మ ఎండోమెంట్ అవార్డు ను లబ్ధప్రతిష్ఠులైన గాత్రవిద్వాంసులలో ఒకరికి సమర్పిస్తూ వస్తోంది. ఈ ఏడాది ఆ అవార్డును చెన్నయి వాస్తవ్యులు విద్వాన్ సి.వి.పి.శాస్త్రి గారికి సమ్మానపూర్వకంగా సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా తే.22.03.2025ది శనివారం సాయంత్రం స్థానిక కళాభారతి (ఏ.సి) ఆడిటోరియంలో ముందుగా సన్మాన సభ అనంతరం శ్రీ సి.వి.పి.శాస్త్రిగారి గాత్రసంగీతసభ జనరంజకంగా జరిగాయి. అకాడమి కార్యవర్గ సభ్యులు శ్రీమతి సునీత కుమార్ అకాడమి అధ్యక్షులు శ్రీ కే.వి.రామమూర్తి గారిని, కార్యదర్శి శ్రీ వి. చంద్రశేఖర్ గారిని, కోశాధికారి శ్రీ సి.హెచ్. దుర్గాప్రసాద్ గారితో పాటు సమ్మానితులు శ్రీ సి.వి.పి.శాస్త్రిగారిని వేదికపైకి ఆహ్వానించారు. అనంతరం కుమారి కర్రా నాగవైష్ణవి ప్రార్థన చేయగా, అధ్యక్షులు కే.వి.రామమూర్తిగారు తమ సందేశమును అందించాక వేదిక పైన పెద్దలు, సహకార్యదర్శులు శ్రీయుతులు ఎ.భుజంగరావు, ఎమ్. జ్వాలాప్రసాద్ గారలు సహకరించగా సమ్మానితులు శ్రీ సి.వి.పి.శాస్త్రిగారిని శాలువా, చందనమాల, సన్మానపత్రము, ఫలములు మరియు నగదు పురస్కారములతో సత్కరించారు.

తరువాత జరిగిన శ్రీ శాస్త్రి గారి గానం, శ్రీరాగ వర్ణం "సామీ నిన్నే కోరి" తో ఆరంభమైంది. తరువాత వరుసగా మలహరి రాగంలో "పంచమాతంగ", వలజి రాగంలో ఓగిరాలవారి రచన "శ్రీ గాయత్రి" కీర్తనను రాగాలాపన స్వరకల్పనలతో వినిపించారు. వీరవసంతం రాగంలో "ఏమని పొగడుదురా", కీర్తన అనంతరం మరల ఓగిరాలవారి మరొకరచన ఖరహరప్రియ రాగంలో "నాదానంద" అనే కీర్తనను, దేవక్రియరాగంలో "శ్రీ గురుగుహ తారయా సుమాం" అన్న అంశాలు శాస్త్రి గారి ప్రతిభకు అద్దం పట్టాయి. ముఖ్యాంశంగా వినిపించిన పూర్వీకల్యాణిరాగ కీర్తన "మీనాక్షీ మేముదం" రసజ్ఞుల ప్రశంసలు అందుకుంది. సింధు భైరవి రాగంలో "తంబూరి మీటెదవా", కుంతలవరాళి రాగంలో బాలమురళీకృష్ణ గారి తిల్లానతో సభను ముగించారు శాస్త్రి గారు. వాయులీనంపై శ్రీ సరస్వతుల పార్థివ, మృదంగంపై శ్రీ కల్యాణ రామన్ తగినవిధంగా సహకారం అందించి సభను రక్తికట్టించడంలో తమవంతు పాత్ర పోషించారు. శ్రీ జ్వాలాప్రసాద్ గారి వందన సమర్పణతో సభ ముగిసింది.

**– వియెస్సెన్మూర్తి, విశాఖ మ్యూజిక్ అకాడెమి**

# సామ ఫౌండేషన్ ఆవిర్భావం



బెంగుళూరు మహానగరంలో నగర వైశాల్యం దృష్ట్యా, ఇప్పటికి నెలకొన్న సంస్థలు, అవి ఏ కళకు సంబంధించినవైనా, సంఖ్యాపరంగా అతి తక్కువేనని చెప్పకతప్పదు. అంతేకాకుండా ఆసక్తి కలిగిన రసజ్ఞులు కూడా దూరానికీ, విపరీతమైన రద్దీకీ భయపడి లోనున్న ఉత్సాహం చంపుకోవలసిన పరిస్థితి కనిపిస్తోంది. ఈ పరిస్థితిని గమనించి శ్రీ శ్రీనివాస్ దావులూరి మరియు డా.M.V.R.సుజాత దంపతి శ్రీ విశ్వావసునామ సంవత్సర ఉగాది శుభదినాన అనగా 30.03.2025 నాటి సాయంత్రం సామ ఫౌండేషన్ సంస్థకు, బీజంనాటి, శాస్త్రీయ సంగీతాన్ని సంగీతప్రియులకు అందించే సదుద్దేశంతో, ప్రారంభించారు.

స్థానిక నాగసెట్టిహళ్ళిలో గల రమణమహర్షి హెరిటేజ్ ఆడిటోరియంలో సాయంత్రం 4.30 సమయానికి సంగీతప్రేమికులంతా వచ్చి నిర్వాహకులు ఏర్పాటుచేసిన తేనీరు సేవించి తమతమ స్థానాలలో ఆశీనులయ్యారు. 5.00గం ప్రాంతంలో విశాఖపట్నం నుండి వచ్చిన శ్రీ వి.యస్.యెన్.మూర్తిగారు "ముదాకరాత్తమోదకం" అంటూ ప్రార్థనగావించి, ఆనాటి ముఖ్య అతిథి ప్రఖ్యాత సంగీత విద్వాంసురాలు డా. టి.యస్.సత్యవతి గారిని, గౌరవ అతిథి పేరొందిన మార్దంగికులు హెచ్.ఎస్.సుధీంద్ర గారినీ, ఆత్మీయ అతిథి సంగీతప్రపంచానికి చిరపరిచితులూ, సంగీత సభా నిర్వాహకులు, శ్రీ యమ్.ఎస్. శ్రీనివాస్ (విశాఖ) గారిని, సామ ఫౌండేషన్ ట్రస్టీ డా.యమ్. వి.ఆర్.సుజాతగారినీ, వీరి తండ్రిగారైన శ్రీ శ్రీనివాసరావు మధ్వపతి గారినీ, ఆత్మీయులు శ్రీ శ్రీపాద శ్రీనివాస్ గారినీ, వేదికమీదకు ఆహ్వానించి ఆహూతులకు స్వాగతం పలికారు. శుభప్రదమైన జ్యోతిప్రజ్వలన అనంతరం, డా.సుజాతగారు సంస్థ లక్ష్యాలను తెలియజేసి, తనతాతగారైన ప్రఖ్యాత రాజకీయనాయకులు, సంఘసేవకులు కీ.శే. శ్రీ భాట్టం శ్రీరామమూర్తి మరియు అమ్మమ్మగారు కీ.శే.శ్రీమతి సత్యవతి గారలందించిన సంస్కారము, ఈ కార్యక్రమానికి స్ఫూర్తినీయగా, తన తల్లిగారైన కీ.శే. డా.కరుణ మధ్వపతిగారి ప్రోత్సాహం తన వెన్నంటి ఉంటుందని తెలియజేశారు. తరువాత సంస్థనిర్వహణలో అందరి సహకారాన్ని, కోరుతూ అందరికీ ధన్యవాదాలు చెప్పగా, అతిథులు తమతమ శుభాభినందన పూర్వక సందేశాలనందజేశారు. అనంతరం జరిగిన గాత్రయుగళ సంగీతసభ రసజ్ఞులను ఆనందింపజేసి సంస్థకు శుభారంభాన్ని అందించింది. విదుషి అశ్విని సతీశ్ మరియు విదుషి శిల్ప శశిధర్ కానడరాగ అటతాళ వర్ణంతో గానం ఆరంభించి వరుసగా, తోడి రాగంలో "మహా గణపతిం వందే", నాట రాగం లో "కమలాంబికే", జనరంజని రాగంలో "నన్ను బ్రోవరాదా అంబ", రవిచంద్రిక రాగంలో "నిరవదిసుఖదా", అంశాలను వీనులవిందుగా వినిపించి, ముఖ్యాంశంగా సింహేంద్రమధ్యమరాగంలో "రామా రామా గుణసీమ" కీర్తనను మనోరంజకంగా గానం చేశారు. చివరి అంశాలుగా, వారి గురువుగారు డా. టి.యస్. సత్యవతి గారు రాగమాలికగా స్వరపరచిన దేవరనామ, భజన్, తిల్లానాలతో సభ ముగించారు. విశాఖ మ్యూజిక్ అకాడెమి వారి యువసీరీస్ లో "బెస్ట్ కాంసర్ట్" బహుమతి



గెలుచుకున్న కుమారి శ్రీవిద్య దావులూరి వాయులీనంపై సీనియర్ విద్వాంసులకు అందించిన సహకారం రసజ్ఞుల ప్రశంసలనందుకుంది. తనకు లభించిన తక్కువ సమయంలో వినిపించిన రాగాలాపనలు, స్వరకల్పనలు ఈమెకు మంచి భవిష్యత్తు కలదని నిరూపించాయి. మృదంగం పై విదుషి రంజని సిద్ధాంతి వెంకటేశ్ దీటైన రీతిలో, మంచి ముందుచూపుతో, కీర్తన సాహిత్యం అందుకొని తగినవిధంగా సహకరించారు. ఘటంపై ప్రఖ్యాత సీనియర్ ఘటవిద్వాంసురాలు విదుషి సుకన్య రామగోపాల్, ఉపపక్క వాద్యం వినిపించవలసినవిధంగా మృదంగంతోపాటు నడుస్తూ, అవకాశం చిక్కినప్పుడల్లా తన విద్వత్తును అవలీలగా ప్రదర్శిస్తూ, కరతాళ ధ్వనులు అందుకున్నారు. ఇరువురు లయవిద్వాంసులు అందించిన లయవిన్యాసం రసవత్తరంగా సాగింది. శ్రీ వి.ఎస్.ఎన్. మూర్తిగారి సభాసమీక్షతో, అనంతరం ధన్యవాద సమర్పణతో సభ దిగ్విజయంగా ముగిసింది. అనంతరం నిర్వాహకులు ఆప్యాయంగా అందించిన విందారగించి సభికులు ఆనందించారు.

**వియస్సెన్మూర్తి, బెంగుళూరు (కేంప్)**

# అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



నిరంతరం సంగీత కళాకారులను ప్రోత్సహిస్తూ, సంప్రదాయ సంగీతాన్ని భావితరా లకు అందించడం అభినందనీయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. బృందావన్గా ర్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం సాయంత్రం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శ్రీభక్త జ్ఞానానందతీర్థ (ఓగిరాల వీర రాఘవశర్మ) ఆరాధన సంగీత ఉత్సవం నిర్వహించారు. డాక్టర్ లలిత ప్రకాష్చంద్ర,



ఆలయ పాలక మండలి నిర్వా హకులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. విద్వాన్ వినయ్ చేపట్టిన శాస్త్రీయ సంగీత కచేరి అలరించింది. వయొలిన్పై గాయత్రీ విభావరి (చెన్నై), మృదంగంపై బీరక సురేష్బాబు వాయి దాన్ని అందించారు. అనంతరం విద్వాన్ ఎస్.ఆర్. వినయ్ (బెంగళూరు) కి శ్రీభక్త జ్ఞానానంద తీర్థ సంగీత కచేరి నిర్వహిస్తున్న వినయ్ మెమోరియల్ అవార్డుతో సత్కరించారు. కార్య క్రమంలో ఓగిరాల రామకృష్ణ, సంస్థ ప్రధాన కార్య దర్శి ఏం.వై.శేషురాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రా జరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ లలితాదేవి, కార్యదర్శి ఏవీ మంగాదేవి, కోశాధికారి విజయలక్ష్మి పాల్గొనగా, కళాకారులను, అతిథులను సత్కరించారు.



**చిట్టావూరి వారి షష్ట్యబ్ద పూర్తి మహోత్సవం**
**శ్రీ శ్రీనివాసమూర్తిగారి సంగీత కచేరి కార్యక్రమం**

# రోటరీ మ్యూజిక్ అకాడమీలో విశ్వావసు ఉగాది సంగీత కార్యక్రమం...





విజయనగరం కొత్తగ్రహారంలో గల ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ద్వారా నడుపబడుతున్న రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో సోమవారం సాయంత్రం విశ్వావసు ఉగాది సంగీత వేడుకలు విద్యార్థులచే జరిగాయి.. విద్యార్థులు, ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి, డి ఎన్ ఆర్ స్కూల్ అధ్యక్షులు ఉసిరికల చంద్రశేఖర్ రావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించి కొత్త సంవత్సరం అందరూ అన్ని విధాల అభివృద్ధి చెందాలని చెప్పారు. ముఖ్య అధిదిగా శ్రీమాన్ కాందూరి గోపికృష్ణస్వామి, వేదవల్లి మంగతాయారు, అధ్యాపకులు వంశీకృష్ణ, శారద, భానుహర్ష, మహేశ్వర రావు, బాలాజిస్వామి, శిరీష, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు ...

– **డాక్టర్ మండపాక రవి,** ప్రిన్సిపాల్, రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ, విజయనగరం, 9440114618









# సంగీత ఝురి- బెంగళూరు





కర్ణాటక సంగీత గాయని మరియు శ్రీమతి ముట్నూరి జలజాక్షి గారి శిష్యురాలు శ్రీమతి లావణ్య రూపాకులచే 2018 సంవత్సరములో స్థాపించబడిన 'సంగీత ఝురి', బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో కర్ణాటక సంగీతాన్ని ప్రోత్సహిస్తోంది. ప్రారంభంలో, ఈ సంస్థ లావణ్య సంగీత విద్యార్థుల కోసం త్రైమాసిక చిన్న కచేరీలను నిర్వహించింది. 2020లో, ప్రముఖ కళాకారులచే ఫేస్ బుక్ లో ఆన్లైన్ కచేరీలను నిర్వహించడం ద్వారా సంగీత ఝురి సంస్థ తన పరిధిని విస్తరించింది. 2024లో ఉగాది శుభ సందర్భంగా, సంగీత ఝురి బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో తన త్రైమాసిక కచేరీ సీరీస్‌ను ప్రారంభించినప్పుడు ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. దీనివలన వైట్‌ఫీల్డ్‌లోని సంగీత విద్యార్థులు మరియు సంగీత ఔత్సాహికులకు కర్ణాటక సంగీత కచేరీలు సులభంగా అందుబాటులోకి వచ్చి, తద్వారా వారు నగరంలోని ఇతర ప్రాంతాలకు ప్రయాణించే ఇబ్బందిని నివారించడానికి దోహదపడింది.

ఇటీవల శ్రీరామనవమి శుభదినం నాడు సంగీత ఝురి తన మొదటి వార్షికోత్సవాన్ని జరుపుకుంది. ఆ రోజు కచేరీ కళాకారులు విదుషీమణి శ్రీమతి జలజాక్షి, శ్రీ ఎంఎస్ఎన్ మూర్తి, శ్రీ బి.ఆర్. శ్రీనివాస్ మరియు సంగీత ఝురి బృందం (శ్రీమతి లావణ్య,శ్రీమతి భువన ,శ్రీమతి కృష్ణవేణి )కలిసి జ్యోతి ప్రజ్వలన చేయడంతో వేడుక ప్రారంభమయ్యింది. తరువాత శ్రీమతి లావణ్య వద్ద సీనియర్ శిష్యులుగా ఎదిగిన ప్రతిభావంతులు తమ పరమగురువు అయిన శ్రీమతి జలజాక్షి గారి ముందు ప్రదర్శన ఇచ్చిన 'మినీ కచేరి' జరిగింది. దీని తరువాత విదుషీమణి శ్రీమతి జలజాక్షి గారిని లావణ్య, వారి శిష్యులు సన్మానించారు. తరువాత జలజాక్షి గారిచే ప్రధాన కచేరి చేయబడింది. దీనిలో సీనియర్ విద్వాంసులు శ్రీ ఎం.ఎస్.ఎన్. మూర్తి వయోలిన్ పై, శ్రీ బి.ఆర్. శ్రీనివాస్ మృదంగం పై, శ్రీమతి లావణ్య గాత్ర సహకారం అందించారు. ఈ కచేరీ ఆద్యంతం అనేక రకాల రచనలతో సంప్రదాయ బద్ధంగా వీనుల విందుగా సాగింది.

కచేరీ ని నళినకాంతి వర్ణం తొ ప్రారంభించి, తమ గురువుగారు శ్రీమాన్ ఎన్.సి.హెచ్. కృష్ణమాచార్యులు గారు రచించిన గౌరీ సుకుమారి అనే కృతి తొ కొనసాగించారు. శ్రీ త్యాగరాజ

కృతి ఎంత వేడుకుండు , స్వాతి తిరునాళ్ రచన భోగీంద్ర శాయినం లాంటి చురుకైన కృతులు కచేరీ ని రక్తి కట్టించాయి. తరువాత ఉప ప్రధాన అంశం దర్బారులో రామాభి రామ, బిలహరి రాగం లో శ్రీ M.S.N. మూర్తి గారు రచించిన పల్లవి ని (RTP) కచేరీ లొ ప్రధాన అంశం గా పాడారు.

"రామచంద్ర నీదయ, సీతా కళ్యాణ" వంటి కీర్తనలు శ్రీరామనవమి సందర్భంగా మంచి సొగసును చేకూర్చాయి. రెండు గంటల పాటు జరిగిన ఈ ప్రదర్శనకు ప్రేక్షకులు ముగ్ధులయ్యారు. ఇది జలజాక్షి గారికి కర్ణాటక సంగీతం పట్ల ఉన్న నైపుణ్యం మరియు అంకితభావానికి నిదర్శనం.

వయోలిన్ విద్వాంసులు శ్రీ ఎం.ఎస్.ఎన్. మూర్తి గారు, జలజాక్షి గారి గాత్రానికి సంక్లిష్టమైన మరియు సూక్ష్మమైన సహకారం అందించడం ద్వారా అసాధారణమైన ప్రదర్శన ఇచ్చారు. వయోలిన్ పై ఆయనకున్న నైపుణ్యం కచేరీకి లోతు మరియు భావోద్వేగాన్ని జోడించాయి. మృదంగం కళాకారులు శ్రీ బి.ఆర్. శ్రీనివాస్ గారు నైపుణ్యం కలిగిన సంక్లిష్టమైన లయలను అల్లారు. ఇద్దరు కళాకారులూ వారి నైపుణ్యాన్ని ప్రదర్శించడం ద్వారా కచేరీ యొక్క అందాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించారు.

## గాయిత్రి మహిళా సంగీత సన్మండలి – గుంటూరు

15-3-25 శనివారం 16-3-25 ఆదివారం గాయిత్రి మహిళా సంగీత సన్మండలి 28వ వార్షికోత్సవము శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం బృందావన్ గార్డెన్స్ లోని అన్నమయ్య కళావేదిక మీద ప్రారంభమైంది. 15-3-25 శనివారం శ్రీమతి మోదుమూడి అంజనా సుధాకర్ జ్యోతి ప్రజ్వలన తో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా శ్రీ మాదల రత్నగిరిబాబు పాల్గొన్నారు. వేదికమీద పద్మశ్రీ డా. అన్నవరపు రామస్వామి, గౌరవాధ్యక్షులు గాయిత్రి మహిళా సంగీత సన్మండిలి వారి శతజయింతి పురస్కరించుకుని సన్మానం జరిగింది. పద్మశ్రీ పండిట్ డా. ఎల్లా వేంకటేశ్వరరావు, చిత్రీవీణ న్. రవికిరణ్ చెన్నై వారికి సన్మానం జరిగింది. సన్మానకర్త కళారత్న శ్రీమోదుమూడి సుధాకర్ గారు. అనంతరం విద్వాన్ ఎన్. రవికిరణ్ గారి చిత్రవీణ కచేరీ జరిగింది. మొదటగా హంసధ్వని రాగంలో శ్రీరఘుకుల మందు తో ప్రారంభించారు. ముఖారి రాగంలో ఏమనినే సుబ్బరాయి శాస్త్రిగారి రచనని ప్రధాన అంశంగా తీసుకుని అత్యద్భుతంగా చిత్రవీణ పై పలికించారు. చివరగా నారాయణ బేహాగ్ రాగం అన్నమయ్య కృతితో ముగించారు. గాత్ర సహకారం శ్రీ ధృవ్ ఎస్. పతంగి వయోలిన్ పై కుమారి వి.ఎస్.పి.జి. శివాని, మృదంగం పై డా. ఎల్లా





వేంకటేశ్వరరావు, ఘటం పై ఎం. చంద్రకాంత్ సహకారం వాయిద్యంతో సభ ఆసాంతం సంగీత ప్రియుల మన్ననలు పొందారు. ఈ కార్యక్రమాన్ని క్రీ.శే. మాదల శకుంతలమ్మ స్మృత్యర్థం వారి కుమారుడు శ్రీ మాదల రత్నగిరి బాబు సమర్పించారు.

16-3-25 ఆదివారం వార్షికోత్సవ సభ డా. పి. విజయ్ సన్మండలి అధ్యక్షులు జ్యోతి ప్రజ్వలన తో ప్రారంభమైంది. కుమారి వై. భావన ప్రార్థన చేసారు. డా. కె. వీరేన్ MBBS ExH.M.O. మున్సిపల్ కార్పొరేషన్ వారు ప్రత్యేక సంచిక ఆవిష్కరణ చేసారు. ఆత్మీయి అతిథిగా దేవాలయం అధ్యక్ష సి.హెచ్. మస్తానయ్య పాల్గొన్నారు. కు. మల్లాది సింధు రాగేశ్వరి కి స్వర్ణ పతక బహూకరణ జరిగింది. అనంతరం సింధు రాగేశ్వరి శాస్త్రీయ సంగీత కచేరి జరిగింది. మొదటగా దర్బారు వర్ణంతో కచేరి ప్రారంభం అయింది. కాంబోజి లో ఎవరి మాట విన్నావో ప్రధానంశంగా తీసుకుని చాలా చక్కగా రాగం, నెరవలు, స్వరకల్పనతో సాగింది. బేగడ రాగంతో అనుదినము, చివరగా తిల్లానా తో కచేరి ముగించింది. వయోలిన్ పై సి.ఎస్. చిన్మయి, మృదంగంపై మల్లాది శివానంద యశస్వి చాలా చక్కగా సహకారం అందించారు. కచేరి ఎంతో విద్వత్తతో, చిన్నారులందరూ కచేరిని రంజింపచేసారు. ఈ కార్యక్రమాన్ని లలితా సూపర్ సెపషాలిటిస్ హాస్పటల్ ప్రధాన సమర్పకులు కాగా, వడ్లమాని రవి, డా. బయ్యి శ్రీనివాసరావు, చుక్కపల్లి రాజేష్ సమర్పకులు.

స్వర్ణ పతకాన్ని కార్యవర్గ సభ్యులు సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధాన కార్యదర్శి ఎం. వై. శేషురాణి, కార్యదర్శి ఎ.వి. మంగాదేవి, ఉపాధ్యక్షులు డా. ఎం. రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, లలితాదేవి, ఉపకార్యదర్శి ఎ. మాధవకృష్ణ, పర్యవేక్షించారు.

**– మాధవపెద్ది మీనాక్షి.**





**సుప్రసిద్ధ నాదస్వర విద్వాంసులు**

**శ్రీ పెద్దేహపు సాయిబాబు గారు**

**13.4.2025 న పరమపదం చేరారు**

**వారికి గానకళ నివాళులర్పిస్తున్నది.**

# శ్రీశారదా సంగీత కళాసమితి,అనపర్తి సంగీత,నృత్య,ప్రవచన,వేదపఠన మహోత్సవాలు 3.1.2025నుండి 10.1.2025 వరకు ఘనంగా జరిగాయి.
























**క్లీవ్ లాండ్ త్యాగరాజ ఉత్సవం లో**
**శ్రీ శ్రీ సోదరీమణుల గాత్ర యుగళం.**

శ్రియ శ్రీనివాస్;శ్రీజ శ్రీనివాస్ -గాత్రయుగళం.
డా.డి.బదరీనారాయణన్-మృదంగం;
అశ్విన్ బాలచంద్రన్-మృదంగం;
ఎన్.సుందర్-మోర్సింగ్.

**సద్గురు సన్నిధి,**
**రాజమహేంద్రవరం లో 2.2.25న**
**శ్రీ సరస్వతుల పార్థివ వయొలిన్ కచేరి.**






సరస్వతి గానసభ ఆధ్వర్యంలో
21.3.2025 న శ్రీ భరత్ సుందర్ గాత్ర సంగీత సభ




సరస్వతి గానసభ ఆధ్వర్యంలో
22.3.2025 న కుమారి వాణీరావు హిందుస్థానీ సంగీతం



**లాస్యప్రియ కూచిపూడి నృత్య నికేతన్,**
**రాజమండ్రి వారి**
**ఇండియన్ కల్చరల్ ఆర్ట్స్ ఫెస్టివల్ లో 02.02.2025 న**
**'కళాసేవక్ అవార్డు' స్వీకరించిన మృదంగ విద్వన్మణి**
**డా. కుమారి మండపాక నాగలక్ష్మి.**

# మేలుకొలుపులు ఆడియో ఆవిష్కరణ ఉత్సవం



12.1.2025న కాకరపర్రు (ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా)లో చర్ల వెంకటరత్నం సత్యవతి ఫౌండేషన్ మరియు గాయత్రీ బ్రాహ్మణ సేవా సమితి సంయుక్తం గా నిర్వహించిన మేలుకొలుపులు (కాకరపర్రు భజన సాంప్రదాయ కీర్తనలు) ఆడియో మరియు పుస్తకావిష్కరణ కార్యక్రమం విజయవంతంగా కొన సాగింది. కాకరపర్రు గాయత్రీ బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులు శ్రీ నరసింహదేవర గౌరీపతి శాస్త్రి, గురువులు శ్రీ వేదుల సీతారామ స్వామి, శ్రీ ఆకొండి వ్యాస సుబ్రహ్మణ్య శర్మ మరియు శ్రీ వేదుల గణపతిరావు తృతీయ కుమారులు శ్రీ వేదుల అత్యుత రామారావు (చైర్మన్, శ్రీ షిరిడీ సాయి సంస్థాన్ ట్రస్ట్, కాకినాడ) ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాల్గొని శ్రీ చర్ల వెంకటరత్నం సత్యవతి ఫౌండేషన్ సమర్పణలో ఈ మేలుకొలుపులను సంకలనం, సంగీత నిర్వహణ మరియు గానం చేసి గ్రామానికి అందించిన శ్రీ చర్ల గోపాలకృష్ణని అభినందించి వారి సందేశం ద్వారా మనఃపూర్వక అశీస్సులు అందించడం ఆనంద దాయకం. చర్ల వెంకటరత్నం సత్యవతి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ చర్ల శివప్రసాద్ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, ఫౌండేషన్ సెక్రటరీ శ్రీ చర్ల శ్రీరామ చంద్రమూర్తి సభాధ్యక్షులుగా వ్యవహరించి సభను జయప్రదంగా నడిపించారు. గాయత్రీ బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు ముఖ్య అతిధులను మరియు సంప్రదాయ మేలుకొలుపుల రూపకర్త శ్రీ చర్ల గోపాలకృష్ణని సన్మానించడంతో కార్యక్రమం ముగిసింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి సహాయ సహకారాలందించిన గాయత్రి బ్రాహ్మణ సేవా సమితి సభ్యులందరికీ ధన్యవాదములు తెలిపారు. ఈ మేలుకొలుపుల ఆడియోలను వీడియోల రూపంలో Gopala Krishna Charla యూట్యూబ్ ఛానల్ ద్వారా అందించడం జరుగుతుంది.

# విదుషి శ్రీమతి లక్ష్మి శ్రీనివాస్ కు వంశీ అవార్డ్



వంశీ ఇంటర్నేషనల్ నిర్వహణలో త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక మీద 12.04.2025 న వీణా విద్వాంసులు చిట్టిబాబు గారి పేరుమీద వంశీ ఇంటర్నేషనల్ ఉగాది పురస్కారం ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ్యులు శ్రీ మండలి బుద్ధప్రసాద్, శ్రీ వంశీ రామరాజు తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు శ్రీ నిత్యానందరావు దర్శకులు శ్రీ రేలంగి నరసింహారావు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. యాదాద్రి దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీ లక్ష్మీ నరసింహచార్యులు గారు వేద ఆశీర్వచనం చేశారు.

# అలరించిన సంగీత కచేరి



ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో జరిగిన ఎం. ఆముక్తమాల్యద సుషమ ఆలపించిన సంగీత కచేరి అందరిని అలరించింది. సహన రాగ వర్ణంతో కచేరి ప్రారంభించి గంభీరనాట రాగంలో గిరిజారమణ, శ్రీ సరస్వతి, ప్రధానాంశంగా శంకరాభరణ రాగంలో స్వరారాగసుధ తదితర కృతులు, కీర్తనలు ఆలపించారు. దీనికి వయొలిన్ పై హనుమంతు రామచరణ్, మృదంగం పై ప్రముఖ విద్వాంసుడు డాక్టర్ మండపాక రవి ధీటుగా సహకరించారు. అధ్యక్షులు ధవళ సర్వేశ్వర రావు ఈ సందర్భంగా సంస్థకు సేవలందించిన వంకాయల నరసింహం, పోడూరి కృష్ణమూర్తి, అండలూరి సోమేశ్వర రావు, మండపాక మృత్యుంజయ రావు, మోడేకుర్తి నరసింగ రావు, రావిగంటి రామా రావు, అంబుజవల్లి, కానుకుర్తి లక్ష్మణరావు, మంద వెంకట మాణిక్యం, కె.ఎల్.నరసింగ రావు తదితరుల సేవలను కొనియాడి వారికి ఈ కచేరి అంకితమన్నారు. ఉపాధ్యక్షులు దూసి శివరాం శర్మ ఈ కార్యక్రమాన్ని సమార్పించారు....

## నివాళి



**1937-2025**

**పేరెన్నికగన్న వాయులీన విద్వాంసులు**

**శ్రీ కొక్కొండ సుబ్రహ్మణ్య శర్మ గారికి**

**గానకళ నివాళులు అర్పిస్తున్నది. నిధనం-07.03.2025.**

# స్వర్గీయ శ్రీ మునుగంటి శ్రీరామమూర్తి శతజయంతి ఉత్సవాలు
# ఏప్రిల్ 4, 5, 6  కాకినాడ సూర్యకళామందిరంలో ఘనంగా జరిగాయి.



విద్వాన్ శ్రీ ప్రసన్న వెంకటరామన్ గాత్ర సంగీత సభ



విదుషి డా. శ్రీమతి పంతుల రమ గాత్ర సంగీత సభ



శ్రీ మునుగంటి వారిపై డాక్యుమెంటరీ నిర్మించిన
వీణ విద్వాన్ శ్రీ ద్విభాష్యం నగేష్ బాబును సత్కరిస్తున్న
శ్రీ కె.వి.ఎస్. ఆంజనేయమూర్తి



శ్రీ మునుగంటికి సంగీత స్వర నీరాజనం సమర్పించిన విదుషి
శ్రీమతి పెద్దాడ సూర్యకుమారి గారిని సత్కరిస్తున్న
మునుగంటి కుటుంబం.









ప్రసంగిస్తున్న శ్రీ కె.వి.ఎస్. ఆంజనేయమూర్తి-సరస్వతీ గానసభ అధ్యక్షులు; శ్రీ నారాయణం మురళి - అధ్యక్షులు సంగీత విద్వత్ సభ;
శ్రీ ఎం.ఎస్. శ్రీనివాస్-విశాఖ మ్యూజిక్ అకాడమీ, శ్రీ మునుగంటి భాస్కర వెంకట రామకృష్ణ,



మునుగంటి వారి శతజయంతి ఘనంగా నిర్వహించిన కుమారులను సత్కరిస్తున్న
శ్రీ ఈ.వి. కృష్ణమాచార్యులు, సత్కళావాహిని, కాకినాడ మరియు సభ్యులు

Editor & Publisher : Ganakala, M.Venkatarao
30-1-29, Rangayyanaidu St, Kakinada - 1, Cell, 9441488721